అపూర్వ

# రష్యన్ జానపద కథలు





స్వేచ్ఛానువాదం

అనిల్ బత్తుల

# అపూర్వ రష్యన్ జానపద కథలు

స్వేచ్ఛానువాదం

అనిల్ బత్తుల

children readers club

Apoorva  Russian Janapada Kathalu
**Anil Battula**

*First Edition :*
*2018*

*Book Design :*
**Ramanajeevi**

*Dtp :*
**Madhavi  Latha**

*Printed at :*
**Karshak Art Printers**
**Hyderabad**

*For Copies* :
**Anil Battula**
telugureadersclub@gmail.com
http://sovietbooksintelugu.blogspot.in
Mobile: 8179273971

**Kathaa Prapancham Book House**,
Near ISCKON Temple, K.T.Road,
Tirupati
www.kathaaprapancham.in
Mobile: 9553518568

**Navodaya Book House**
Kachiguda, Hyderabad
www.telugubooks.in
Mobile: 9247471362, 9247471361

**Manchi Pustakam**
Taranaka, Hyderabad
www.manchipustakam.in
Mobile: 7382297430, 9490746614

**VMRG Books**
Hyderabad.
www.vmrgbooks.in
Mobile: 6300483715

**Analpa Book House**
Neredmet x roads, Hyderabad
Mobile: 7093800678

ebook: **kinige.com**

Rs.200/-

చిట్టి పొట్టి పాపల్లారా
చిరునవ్వుల చిన్నారుల్లారా
అల్లీబిల్లీ ఆటలతోటీ
అల్లరి చేసే చిరుతల్లారా
ఆటలు పాటలు కొంచెం ఆపి
చక్కని ఈ కథ వినండి చెబుతా!

చిన్నారులూ! నా మొదటి పుస్తకం "రష్యన్ జానపద కథలు" చదివి ఆనందించారు కదూ. మరికొన్ని రష్యన్ జానపద కథల్ని అనువాదంచేసి మీకోసం ఈ పుస్తకం తెస్తున్నాను. ఇందులో ప్రసిద్ధి చెందిన గొప్ప రష్యన్ చిత్రకారుల చక్కని బొమ్మలున్నాయి.

మీలాగే నాకూ బొమ్మలంటే చాలా ఇష్టం. చిన్నప్పుడు రాత్రిపూట మా అమ్మ గోరుముద్దలు తినిపిస్తూ, ఆకాశంలోని చందమామలో అస్పష్టంగా కనిపించే చిత్రాల్ని చూపిస్తూ, చందమామలో ఓ ముసలమ్మ రాట్నం వడుకుతూ తన కొడుకు కోసం ఎదురుచూస్తుందని చెప్పేది. ఎప్పటికైనా ఆ కొడుకు తల్లిని చేరుకోలేకపోతాడా అని రోజూ ఆ కథ ఆసక్తికరంగా వినేవాడ్ని.

ఆ తరువాత రంగురంగుల బొమ్మలంటే ఎంతో ఇష్టం ఏర్పడింది. బొమ్మల్ని చూస్తూ ఎన్నో చక్కటి కథల్ని చదివాను. చిన్నప్పుడు నేను చదివిన చందమామ, బాలమిత్ర కథలు ఇప్పటికీ గుర్తున్నాయి. అందుకు కారణం కథల్లో ఉన్న బొమ్మలే. అలా చిన్నప్పుడే బొమ్మల ప్రేమలో పడ్డాను.

మీకు కూడా నాలాగే అందమైన బొమ్మలున్న కథల పుస్తకాలంటే ఇష్టం కదూ! ఇందులో ఉన్న చక్కటి జానపద కథలు, చిత్రకారుల రంగురంగుల బొమ్మలు మీకూ నచ్చుతాయి. మరిక ఆలస్యం ఎందుకు? చదివి ఆనందించండి.!

## కృతజ్ఞతలు

కడుపు గంగాధర్‌రావు

బాదర్ల అజయ్ ప్రసాద్

రమణజీవి

కథాప్రపంచం కిరణ్

పత్తిపాక మోహన్

నా తల్లిదండ్రులు

బత్తుల మహాలక్ష్మమ్మ

బత్తుల పెద్దపోలిరెడ్డి

నా భార్య

మాధవిలతకు



# మ్యావ్ మ్యావ్...


| | | | |
|---|---|---|---|
| 1. | లెక్కల కుందేలు | – ఎవా వసిలివిస్కాయా | 6 |
| 2. | మాషా–ఎలుగుబంటి | – రష్యన్ జానపద కథ | 11 |
| 3. | వెండిచేప పిల్ల కథ | – మికోలా ట్రుబ్లైని | 18 |
| 4. | అక్కా తమ్ముడు | – రష్యన్ జానపద కథ | 23 |
| 5. | మూడు ఎలుగుబంట్లు | – టాల్స్టాయ్ | 30 |
| 6. | ఇవాన్ | – మాక్సీమ్ గోర్కీ | 37 |
| 7. | చీమ – చందమామ | – మాక్సిమ్ టాంక్ | 44 |
| 8. | రాళ్ళు కొట్టే మనిషి కథ | – రష్యన్ జానపద కథ | 51 |
| 9. | బంగారు యాపిల్ చెట్టు | – బైలో రష్యన్ జానపద కథ | 56 |
| 10. | తెల్ల పావురం | – అట్కాయ్ | 67 |
| 11. | జాలరి బంగారు చేప | – అలెగ్జాండర్ పుష్కిన్ | 78 |
| 12. | సముద్రతీరంలో పిల్లవాడు | – మాక్సీమ్ గోర్కీ | 87 |
| 13. | వింత టోపీ | – స్పిరిడాన్ వెంగిలి | 98 |
| 14. | చెక్కబొమ్మ పిల్లవాడు | – అలెక్సేయ్ తోల్స్తోయ్ | 103 |
| 15. | కొసక్ వీరుడి కథ | – ఉక్రేనియన్ జానపదకథ | 112 |
| 16. | తెలివైన అన్నదమ్ములు | – ఉజ్బెక్ జానపద కథ | 123 |
| 17. | బుజ్జి సూర్యుడు | – హెడ్జాక్ గయుల్నాజర్యాన్ | 134 |
| 18. | నిప్పు పక్షి | – అలగ్జాండర్ అఫనస్వేవ్ | 141 |
| 19. | చందమామ రొట్టె | – రష్యన్ జానపద కథ | 152 |
| 20. | బంగారు చేప | – ఉజ్బెక్ జానపద కథ | 159 |



# లెక్కల కుందేలు

## ఎవా వసిలివిస్కాయా

అనగనగా ఒక అడవిలో ఓ కుందేలు నివసించేది. దానికి ఐదుగురు పిల్లలు. ఆఖరి బుజ్జి కుందేలు పేరు 'విల్లీ'.

చిన్నప్పుడు ఎవరైనా సరే అల్లరి చేస్తూ, అరుస్తూ, గెంతుతూ ఆడుకుంటారు కదా!

కానీ బుజ్జి కుందేలు మాత్రం అవేమి చేసేది కాదు. దానికి లెక్కపెట్టడం అంటే ఎంతో ఇష్టం. ఎంత ఇష్టమంటే లెక్కపెట్టడం కోసం అది తన సోదరులతో ఆటలు కూడా ఆడేది కాదు. అల్లరి చేసేది కాదు.

ప్రతిరోజు ఉదయాన్నే అది వాళ్ళ ఇంటి తలుపు బయట కూర్చునేది. దేనిని లెక్కపెడదాం అని కొద్దిసేపు ఆలోచించేది. ఓ రోజు ఇలాగే ఆలోచిస్తూ వుండగా, వాళ్ళ ఇంటి ముందు నుండి ఓ గొంగళి పురుగు వేగంగా నడుచుకుంటూ వెళ్తుంది. గొంగళి పురుగుని చూడగానే బుజ్జి కుందేలు ఆనందించింది.

కుందేలు గొంగళి పురుగు కాళ్ళను ఇలా లెక్కించసాగింది.

"ఒక కాలు, రెండు కాళ్ళు, మూడు కాళ్ళు....., నాలుగు..."

"నాలుగు..." అని లెక్కపెట్టే లోపల గొంగళి పురుగు వెళ్ళిపోయింది. పోనీలే ఏం పర్లేదు. గొంగళి పురుగు వేగంగా వెళ్ళిపోయింది. కొంచెం నెమ్మదిగా నడిచే దాన్ని లెక్కపెడతాను అనుకుని చుట్టూ చూసింది.

ఎదురుగా ఓ చెట్టు తొర్రలో వున్న పక్షి గూడులో నీలం రంగులో వున్న గుడ్లు కనిపించాయి. ఆ గుడ్లు మెత్తటి గడ్డిపై వున్నాయి. వాటిని చూడగానే బుజ్జి కుందేలు భలే ఆనందించింది. ఇవి వేగంగా పరిగెత్తలేవు. నేనిప్పుడు ప్రశాంతంగా లెక్కపెట్టవచ్చు అనుకుంది.

కుందేలు నీలం గుడ్లను ఇలా లెక్కించసాగింది. "ఒక చిన్న గుడ్డు, రెండు చిన్న గుడ్లు, మూడు చిన్న గుడ్లు, నాలుగు......" క్షణాల్లో తల్లి పక్షి వచ్చి గుడ్లపై కూర్చుని కుందేలును గుర్రుగా చూసింది.

"ఏం చేస్తున్నావిక్కడ?" అని కోపంగా ప్రశ్నించింది తల్లి పక్షి.

గుడ్లు లెక్కపెడుతున్నానని చెప్పడానికి ప్రయత్నించింది కుందేలు. తన గుడ్ల జోలికొస్తే అంతుచూస్తానని హెచ్చరించింది తల్లి పక్షి.

బెదిరిపోయింది బుజ్జి కుందేలు. దిగులుగా తల వంచుకొని ఇంటి దారి పట్టింది.

అలా నడుస్తూ వుండగా అక్కడ మొక్కజొన్న విత్తనాలు భూమిపై



చల్లినట్లు పడి వున్నాయి. వాటిని చూడగానే బుజ్జి కుందేలు ఆనందించింది. ఆలస్యం చేయకుండా వాటిని లెక్కించసాగింది.

"ఒక విత్తనం, రెండు విత్తనాలు, మూడు విత్తనాలు. నాలుగు...." ఎక్కడ నుండి వచ్చాయో, ఓ పావురాల గుంపు వచ్చి ఆ విత్తనాలపై వాలాయి. క్షణాల్లో విత్తనాలన్నీ తినేసి చక్కా ఎగిరిపోయాయి.

బుజ్జి కుందేలు ఎంతో బాధపడింది. ఏడ్చింది. తనకు లెక్కించడానికి వచ్చిన ప్రతి అవకాశమూ, చేజారిపోతున్నందుకు అది చింతించింది. ఇంటికి చేరింది.

సాయంత్రానికి తన సోదరులైన ఇతర కుందేళ్ళు, తల్లి కుందేలూ ఇల్లు చేరాయి. భోజనాలయ్యాక, మిగతా కుందేళ్ళు ఆటలాడసాగాయి. బుజ్జి కుందేలు చెవిని లాగాయి, కాలిని గోకాయి. కానీ బుజ్జి కుందేలు స్పందించలేదు.

"ఆపండి పిల్లలూ! బుజ్జిగాడు అలసిపోయినట్లున్నాడు. వాడిని ప్రశాంతంగా వుండనివ్వండి" అంది తల్లి కుందేలు.

బుజ్జి కుందేలుని తల్లి ఒడిలో పడుకోబెట్టుకుంది. జోల పాట పాడసాగింది. బుజ్జిగాడికి అమ్మ ఒళ్లో వెచ్చగా, హాయిగా వుంది. జోలపాటకు దానికళ్ళు మూతపడసాగాయి. బుజ్జి కుందేలు తలుపు బయటకు చూసింది. పైన ఆకాశంలో బోలెడు నక్షత్రాలు మిణుకు మిణుకుమని మెరుస్తున్నాయి.

"ఓహ్ ఇప్పుడు నన్నెవరూ ఆపలేరు. ఆకాశంలోని నక్షత్రాలన్నీ లెక్కపెట్టేస్తాను" అనుకుంది బుజ్జి కుందేలు.

ఇలా లెక్కించసాగింది. "ఒక నక్షత్రం, రెండు నక్షత్రాలు, మూడు నక్షత్రాలు, నాలుగు...."

"ష్...బుజ్జోడు నిద్రపోతున్నాడు. అల్లరి చేయకండి" అంది తల్లి కుందేలు.

"నాలుగు..." అని నక్షత్రాల్ని లెక్కిస్తూ, మెల్లగా నిద్రలోకి జారుకుంది బుజ్జి కుందేలు.

ఇదండీ మన బుజ్జి లెక్కల కుందేలు కథ.

| | | |
|---|---|---|
| English Title | : | The Rabbit who loved to count |
| Writer | : | Eva Vassilevskaya |
| English Translation | : | James Riordan |
| Illustration | : | David khaikin |



# మాషా-
# ఎలుగుబంటి
## రష్యన్ జానపద కథ

అనగనగా ఓ ఊరిలో ఒక అమ్మమ్మ, తాతయ్య ఉండేవారు. వారికి ఒక్కగానొక్క మనవరాలు. ఆ పాప పేరు 'మాషా'.

ఓ రోజు మాషా స్నేహితులంతా అడవిలోకి వెళ్ళి పుట్టగొడుగులు, బెర్రీలు ఏరుదామనుకున్నారు. 'నువ్వు వస్తావా మాతో?' అని అడిగారు మాషాని.

''ప్రియమైన తాతయ్య, అమ్మమ్మా! స్నేహితులంతా అడవికి వెళ్తున్నారు. దయచేసి నన్ను కూడా అడవికి పంపండి'' అని ప్రాధేయపడింది, చిన్నారి మాషా.

వాళ్ళు ఒప్పుకున్నారు. “అడవిలో స్నేహితురాళ్ళని విడిచి దూరంగా వెళ్ళొద్దు. అలా వెళ్ళావో నువ్వు తప్పిపోతావు. ఎప్పటికీ ఇల్లు చేరలేవు” అని జాగ్రత్తలు చెప్పారు.

మాషా, స్నేహితురాళ్ళు ఊరి పక్కనున్న దట్టమైన అరణ్యంలోకి వెళ్ళారు. చెట్టూ, పుట్టా గాలిస్తూ పుట్టగొడుగులూ, బెర్రీలు ఏరటం మొదలు పెట్టారు. ఈ క్రమంలో మాషా తన స్నేహితులకి దూరంగా అడవి లోపలికి వెళ్ళిపోయింది. ఆ విషయం మాషా గ్రహించలేదు.

కొద్దిసేపటికి చుట్టూ చూసింది మాషా. చుట్టుపక్కల ఎవరూ లేరు. తన స్నేహితురాళ్ళు కోసం బిగ్గరగా పిలిచింది. సమాధానం లేదు. మాషాకు భయం వేసింది. అడవిలో ఎంత వెతికినా తన స్నేహితురాళ్ళు కనిపించలేదు. వాళ్ళ జాడ కూడా లేదు. ఇంటికి తిరిగి వెళ్దామని ప్రయత్నించింది. కానీ దురదృష్టవశాత్తు ఇంటికెళ్ళే దారి మర్చిపోయింది. బాధతో కన్నీరు కార్చింది మాషా.

అలా నడిచి, నడిచి చివరికి దట్టమైన అరణ్యం మధ్య భాగానికి చేరింది. అక్కడ అడవిగాలి కూడా చొరబడనంత దట్టంగా ఉంది.

ఆశ్చర్యం అక్కడ మాషాకు ఓ గుడిసె కనిపించింది. వెంటనే దాని తలుపు తట్టింది. ఎవరూ ఉలుకలేదు, పలుకలేదు. సరేనని తలుపును నెట్టింది. ఆ తలుపుకు లోపల గడియ వేయలేదు, కాబట్టి అది మెల్లగా తెరుచుకుంది.

మాషా ఇంటిలోపలికి వెళ్ళి కిటికీ వద్ద కూర్చుంది. “ఎవరుంటారబ్బా ఈ ఇంట్లో ” అని ఆలోచించసాగింది.

ఆ ఇంట్లో ఓ పెద్ద ఎలుగుబంటి నివసించేది. అది కొద్దిసేపటి



క్రితం షికారుకి వెళ్ళింది. పొద్దుగూకింది. ఎలుగుబంటి తన ఇల్లు చేరింది. మాషాను చూసి అది చాలా సరదా పడింది.

"ఆహా! భలేగా దొరికావు ఓ బుజ్జి పాపా! నువ్వు ఈ క్షణం నుండి నా సేవకురాలివి. ఇంటిపని, వంటపని అంతా నువ్వే చూసుకోవాలి. ఏ మాత్రం బద్ధకించినా లేదా పారిపోవాలని ప్రయత్నించినా, ఆ రోజే నీ ఆఖరి రోజు గుర్తుంచుకో జాగ్రత్త." అని హెచ్చరించింది ఎలుగుబంటి.

"సరేనండి ఎలుగుబంటిగారూ! మీరు చెప్పినట్లే బుద్ధిగా నడుచుకుంటాను." అంది మాషా.

ప్రతీ రోజు ఉదయం ఎలుగుబంటి ఇంట్లోనుండి బయలుదేరి వేటకు వెళ్ళేది. మాషా ఇంటిని సర్ది, పాత్రలు కడిగి, వంట చేసేది. తిరిగి వచ్చిన ఎలుగుబంటి సుష్టుగా తిని నిద్రపోయేది. ఇది దాని దినచర్య.

ఇలా కొన్ని నెలలు గడిచాయి. మాషాకి తన అమ్మమ్మ, తాతయ్యలని చూడాలని దిగులు పుట్టింది. పారిపోదామంటే దారి తెలియదు తనకి సాయం చేయడానికి ఏ ఒక్క మనిషి దరిదాపుల్లో కూడా లేరు ఎలాగబ్బా? అని ఎంతగానో ఆలోచించింది. చివరకి ఓ పథకం వేసింది.

ఓ రోజు సాయంత్రం ఎలుగుబంటి అడవి నుండి తిరిగి ఇంటికి వచ్చింది. మాషా బోజనం వడ్డించింది. ఎలుగుబంటి సుష్టుగా తిని తేపింది.

మాషా ఇలా అడిగింది. "ఎలుగుబంటిగారూ! ఎలుగుబంటిగారూ! నన్ను ఒక్కరోజు మా ఊరికి వెళ్ళనివ్వండి. నేను తయారు చేసే రుచికరమైన పిండివంటలు మా తాతయ్య, అమ్మమ్మలకి ఇచ్చేసి వస్తాను."

"కుదరదు" అని కోపంగా అరిచింది ఎలుగుబంటి.

ఓ క్షణమాగి "ఇలా రా" అంది ఎలుగుబంటి. "మాషా! ఓ పని

చేద్దాం. నువ్వు రుచికరమైన పిండివంటలు తయారు చెయ్యి. నేను వాటిని జాగ్రత్తగా మీ తాతయ్యకి, అమ్మమ్మలకి చేరుస్తాను. ఎందుకంటే నువ్వు చిన్నపిల్లవి కదా! అడవిలో తప్పిపోతావు".

తన పథకం పారుతున్నందుకు లోలోపల సంతోషించింది మాషా. కానీ బయటకు మాత్రం గంభీరంగా మొహం పెట్టింది. "సరేనండి, ఎలుగుబంటిగారూ" అంది మాషా.

పెద్ద పళ్ళెం నిండా చక్కటి పిండి వంటలు తయారు చేసింది మాషా. అవి గుమగుమలాడే సువాసనలు వెదజల్లుతున్నాయి. ఎంతో రుచికరమైన పిండివంటలవి. వాటిని వీపుకు తగిలించుకునే తోలు సంచిలో జాగ్రత్తగా సర్దింది.

"ఎలుగుబంటిగారూ! నాదో చిన్న షరతు. మీరు ఈ పిండి వంటల్ని జాగ్రత్తగా మా అమ్మమ్మ, తాతయ్యలకి చేర్చాలి. దారిలో మీకు ఆకలేసినా, సంచి తెరవకూడదు. పిండివంటలు తినకూడదు. నేను ఒక చెట్టుపైకి ఎక్కి అంతా గమనిస్తూ ఉంటాను." అంది మాషా. సరేనంది ఎలుగుబంటి.

"బయటకు వెళ్ళి వర్షం పడుతోందో, లేదో ఓసారి చూసిరండి" అంది మాషా.

ఎలుగుబంటి ఇంటి బయటకు వెళ్ళింది.

ఈలోగా మాషా వీపుకు తగిలించే పెద్ద సంచీలో జాగ్రత్తగా కూర్చుంది. తన తలపై తినుబండారాలున్న పళ్ళాన్ని పెట్టుకుంది. నిశ్శబ్దంగా కూర్చుంది. తను కనిపించకుండా జాగ్రత్త పడింది.

ఎలుగుబంటి ఇంట్లోకి వచ్చింది. తోలు సంచి భుజానికి తగిలించుకుంది. మాషా వాళ్ళ ఊరి వైపు ప్రయాణం ప్రారంభించింది.

మొదట దేవదారు చెట్లను దాటింది. తరువాత పోప్లార్ చెట్లను దాటింది. కొండను ఎక్కి, దిగింది. అలసి పోయింది. ఎలుగుబంటికి ఆకలి వేసింది.

**" నేనిప్పుడు విశ్రాంతి తీసుకోకుంటే, చచ్చిపోతాను**
**ఈ చెట్టుకింద కూర్చుని ఓ లడ్డూ తింటాను"**

అని బిగ్గరగా అంది.

తోలు సంచి లోపలి నుండి మాషా ఇలా అంది.

**"ఎలుగుబంటిగారూ! ఎలుగుబంటిగారూ!**
**ఒక చెట్టుపై నుండి నేను అంతా చూస్తున్నాను.**
**మీరు ఇచ్చిన మాట తప్పకూడదు.**
**లడ్డూలు తినకూడదు.**
**వాటిని మా తాతయ్య, అమ్మమ్మలకి చేర్చాలి."**

ఆశ్చర్యపోయింది ఎలుగుబంటి.

"అబ్బా! మాషా ఎంత తెలివైన పిల్ల. ఒక చెట్టుపై కూర్చుని, ఎంతో దూరంలో ఉన్న నన్ను చూడగల్గుతోంది. నా మాటలు వినగలుగుతోంది." అనుకుంది ఎలుగుబంటి.

సంచి భుజానికి తగిలించుకుని వేగంగా నడవసాగింది. చివరకి మాషా వాళ్ళ ఊరు చేరింది.

చుట్టుపక్కల వాకబు చేసి, మాషా వాళ్ళ ఇంటిని కనిపెట్టింది.

" టక్...టక్...టక్ . . ."అని తలుపుని కొట్టింది.

" తలుపు తెరవండి. మాషా మీ కోసం తినుబండారాలు పంపింది" అని బిగ్గరగా అరచింది ఎలుగుబంటి.

ఊరి లోని వీధి కుక్కలు, ఎలుగుబంటి వాసనను కనిపెట్టాయి. మూకుమ్మడిగా గట్టిగా అరుస్తూ ఎలుగుబంటిపై దాడి చేసాయి.

ఎలుగుబంటి బెదిరిపోయింది. భుజానికి ఉన్న సంచిని క్రింద పడేసి, పరుగు లంకించుకుంది. వెనక్కి తిరిగి చూడకుండా అడవిలోకి పారిపోయింది.

పని మీద బయటకు వెళ్ళిన అమ్మమ్మ, తాతయ్యలు ఇంటికి తిరిగి వచ్చారు. "ఏంటీ ఈ సంచి? " అని అవ్వ అడిగింది.

తాత సంచిని తెరిచాడు. తన కళ్ళను తానే నమ్మలేక పోయాడు. పిండి వంటల పళ్ళెం తొలగించగానే, అందులో వాళ్ళ మనవరాలు మాషా ఉంది. ఆనందంలో మాషాని కౌగలించుకున్నారు. ముద్దుల వర్షం కురిపించారు. ఆనందబాష్పాలు రాల్చారు. వాళ్ళెప్పటికి సుఖసంతోషాలతో ఆనందంగా ఉన్నారు.

చూశారా పిల్లలూ! ఉపాయం ఉంటే, ఎంతటి అపాయం నుండైనా బయటపడవచ్చు.

| | | |
|---|---|---|
| English Title | : | Masha and the Bear |
| Writer | : | Folk tale |
| English Translation | : | Irina Zheleznova |
| Illustration | : | Rachev |



# వెండి చేప పిల్ల కథ

## మికోలా ట్రుబ్లైని

అనగనగా ఓ కొండ పక్కనున్న సరస్సులో ఓ వెండి చేప పిల్ల నివసించేది. అదే సరస్సులో ఎర్రటి ముక్కున్న, తెల్లటి రాజ హంస కూడా నివసించేది. ఓ రోజు హంసకు, వెండి చేప పిల్ల తారసపడింది. హంస దాన్ని తినేద్దామనుకుంది.

వెండి చేప పిల్ల ఇలా ప్రార్థించసాగింది "రాజహంస గారూ! రాజహంస గారూ!! దయచేసి నన్ను చంపొద్దు, నా ప్రాణాలు కాపాడండి".

రాజహంస ఇలా అంది "సరే! నిన్ను నేను వదిలేస్తాను. ఈ సరస్సు పైనున్న మంచు వల్ల నా కాళ్ళు చాలా ఇబ్బంది పడుతున్నాయి. నాకో చక్కని 'బూట్ల' జతని సంపాదించు. బూట్లు

లేకుండా తిరిగి వచ్చావో, నీ పని అయిపోయినట్లే".

వెండి చేపపిల్ల సరస్సు అంతా గాలించింది. చివరకి సరస్సు అడుగున కూడా వెతికింది. ఎంత వెతికినా బూట్ల జత మాత్రం కనిపించలేదు. నిరాశ చెందింది. చివరకు సరస్సు ఒడ్డు దగ్గరున్న రెల్లు గడ్డి పొదల వద్దకు చేరింది. బిగ్గరగా ఏడ్వసాగింది.

చేపపిల్ల ఏడుపుని ఓ ఆకుపచ్చని కప్ప వినింది.

"ఓ వెండి చేప పిల్లా! వెండిచేప పిల్లా! ఎందుకు ఏడుస్తున్నావ్? ఏం కష్టమొచ్చింది?" అని అడిగింది కప్ప.

వెండి చేపపిల్ల తన కథంతా చెప్పి తన దురదృష్టానికి బాధపడింది.

ఆకుపచ్చ కప్ప ఇలా అంది "నేను నీకు సాయం చేస్తాను. కానీ నువ్వు ఇక్కడే వుండు. నా కోసం ఎదురుచూడు" సరేనంది చేపపిల్ల.

ఆకుపచ్చ కప్ప ఒడ్డుకు బాగా దగ్గరగా వున్న గడ్డి పొదల దగ్గరకు వెళ్ళింది. "బెక్..బెక్..బెక్..బెక్" అని అరవసాగింది.

ఒడ్డు పక్కనున్న విల్లో చెట్టుపై కూర్చుని వున్న ఓ పిచుక, కప్ప అరుపులు వినింది. "క్రిప్..క్రిప్..క్రిప్..క్రిప్" అని పిచుక అరవసాగింది.

"ఆకుపచ్చ కప్పా! ఎందుకు అరుస్తున్నావ్? నీకు ఏ సాయం కావాలి?" అని అడిగింది పిచుక.

కప్ప వెండి చేపపిల్ల కథంతా చెప్పింది. తనకు బూట్ల జత ఎంత అవసరమో వివరించింది.

పిచుక ఇలా అంది "నేను నీకు సాయం చేస్తాను. కానీ నువ్వు ఇక్కడే వుండు. నా కోసం ఎదురుచూడు" సరేనంది ఆకుపచ్చ కప్ప.

పిచుక ఎగురుకుంటూ సరస్సు పక్కనున్న ఓ గ్రామానికి వెళ్ళింది. అక్కడ ఓ ఇంటి పెరడులో ఓ చిన్న పాప ఆడుకుంటుంది. ఆ పాప పేరు



నటలోష్కా. "క్రిప్..క్రిప్..క్రిప్..క్రిప్" అని పిచుక అరవసాగింది.

"ఓ బుజ్జి పిచుక! ఎందుకు అరుస్తున్నావ్? నీకు ఏ సాయం కావాలి?" అని అడిగింది పాప.

పిచుక వెండి చేపపిల్ల కథంతా చెప్పింది. చేపపిల్ల బూట్ల జత లేకుండా, రాజహంస వద్దకు వెళ్తే ప్రాణగండం వుందని వివరించింది. సాయం కావాలని అర్థించింది.

చిన్న పాప ఇలా అంది "నేను నీకు సాయం చేస్తాను. కానీ నువ్వు ఇక్కడే వుండు. నా కోసం ఎదురుచూడు". సరేనంది పిచుక.

పాప ఇంట్లోకి వెళ్ళి, తన ఎర్రటి అందమైన బూట్ల జతను తీసుకొచ్చి వాటిని పిచుకకు ఇచ్చింది.

పాప పిచుకతో ఇలా అంది "నువ్వు ఎంత త్వరగా వీలైతే అంత వేగంగా వెళ్ళి, వెండి చేపపిల్ల ప్రాణాలు కాపాడు".

పిచుక కృతజ్ఞతలు తెలిపింది. వాయు వేగంతో ఎగురుతూ ఆకుపచ్చ కప్ప వద్దకు చేరింది. బూట్ల జతను ఇచ్చింది. కప్ప పిచుకకు కృతజ్ఞతలు తెలిపింది. కప్ప ఆ బూట్ల జతను వెండి చేపపిల్లకు అప్పగించింది.

వెండి చేపపిల్ల కప్పకు కృతజ్ఞతలు తెలిపింది. ఎర్రటి అందమైన బూట్ల జతను తీసుకెళ్ళి, రాజహంసకు ఇచ్చింది. అవి హంస పాదాలకు చక్కగా సరిపోయాయి. చేపపిల్ల జోలికి తను జీవితంలో రానని, మాట ఇచ్చింది రాజహంస. ఎంతో ఆనందించింది చేపపిల్ల.

ఈ విషయాన్ని ఆకుపచ్చ కప్పతో చెప్పింది. "నన్ను కాపాడినందుకు కృతజ్ఞతలు నేస్తం" అంది వెండిచేప పిల్ల. కప్ప పిచుక గురించి, చిన్న పాప గురించి చెప్పింది.

వెండి చేపపిల్ల తన కృతజ్ఞతల్ని పిచుకకు, చిన్న పాపకు కూడా

చెప్పమని అభ్యర్ధించింది. ఆకుపచ్చ కప్ప ఈ విషయాన్ని పిచుకకు చెప్పింది. పిచుక ఈ సంగతిని పాపకు చెప్పింది. పాప ఆనందంతో చిరునవ్వు నవ్వింది.

ఇదండీ నా చిన్నారి నేస్తాలూ! వెండి చేపపిల్ల కథ. మీరు మీ స్నేహితులకు ఇలాంటి సాయం ఏదో చేసే వుంటారు. ఆ కథ నాకూ చెప్తారు కదూ!

| | | |
|---|---|---|
| English Title | : | Little Natalochka and The Silver Fish |
| Writer | : | Mikola Trublaini |
| English Translation | : | Anatole Bilenko |
| Illustration | : | Gennady Kuznetsov |



# అక్కా తమ్ముడు

## రష్యన్ జానపద కథ

అనగనగా ఒక ఊరిలో ముసలి దంపతులకు ఇద్దరు పిల్లలుండేవారు. పాప పేరు అల్యోనుష్కా. బాబు పేరు ఇవానుష్కా. వాళ్ళిద్దరు అక్కా తమ్ముళ్ళు. తల్లిదండ్రులు చనిపోయాక పిల్లలిద్దరూ ఒంటరివాళ్ళయ్యారు.

ఒక రోజు అల్యోనుష్కా పొలం పనులకు వెళ్తూ, తన తమ్ముడు ఇవానుష్కాను తీసుకెళ్ళింది. వాళ్ళు చాలా దూరం ప్రయాణించారు. తమ్ముడికి బాగా దాహమేసింది.

అక్కా! "నాకు చాలా దాహంగా వుంది" అన్నాడు తమ్ముడు.

"కొంచెంసేపు ఆగు తమ్ముడూ! త్వరలోనే మనకు మంచినీటి బావి కనిపిస్తుంది" అంది అల్యోనుష్కా.

అలా వాళ్ళు చాలా దూరం నడిచారు. ఎండ మండిపోతుంది కానీ మంచినీటి బావి మాత్రం కనిపించలేదు. కొద్దిసేపటికి ఆవు కాలి గిట్టల మధ్య నీరు కనిపించింది.

"నేను ఆ నీళ్ళు కొంచెం తాగుతాను" అన్నాడు తమ్ముడు.

"వద్దు తమ్ముడూ! ఆవు కాలి గిట్టల మధ్య వున్న నీటిని తాగితే నువ్వు లేగదూడగా మారిపోతావు" అంది అక్క. తమ్ముడు అక్క మాట విన్నాడు. చాలా దూరం నడిచారు. ఎండ మండిపోతుంది కానీ మంచినీటి బావి మాత్రం కనిపించలేదు.

మరికొద్దిసేపటికి గుర్రం కాలి గిట్టల మధ్య నీరు కనిపించింది.
"నేను కొంచెం ఆ నీళ్ళు తాగుతాను" అన్నాడు తమ్ముడు.
"వద్దు తమ్ముడూ! గుర్రం కాలి గిట్టల మధ్య వున్న నీటిని తాగితే, నువ్వు గుర్రం పిల్లగా మారిపోతావు" అంది అక్క.

తమ్ముడు అక్క మాట విన్నాడు. చాలా దూరం నడిచారు. ఎండ మండిపోతుంది కానీ మంచినీటి బావి మాత్రం కనిపించలేదు.

కొద్దిసేపటికి మేక కాలి గిట్టల మధ్య నీరు కనిపించింది. "నేను కొంచెం ఆ నీళ్ళు తాగుతాను, ఈ దప్పికను భరించలేను" అన్నాడు తమ్ముడు.

"వద్దు తమ్ముడూ! మేక కాలి గిట్టల మధ్య వున్న నీటిని తాగితే, నువ్వు మేక పిల్లగా మారిపోతావు" అంది అక్క.

ఈసారి తమ్ముడు అక్క మాట వినలేదు. మేక కాలి గిట్టల మధ్య వున్న నీటిని తాగాడు. మరుక్షణం పిల్లవాడు, తెల్లటి బుజ్జి మేక పిల్లగా మారిపోయాడు.

"తమ్ముడూ!" అని పిలిచింది. పిల్లవాడికి బదులు, మేకపిల్ల పరిగెత్తుకుంటూ అక్క వద్దకు వచ్చింది.



అక్క బోరున ఏడ్చింది. గడ్డి వాము పక్కన కూర్చున్న అక్క చుట్టూ గెంతుతూ బుజ్జి మేక పిల్ల ఆడుకుంది.

గుర్రంపై వెళ్తున్న ఓ వర్తకుడు ఆ దృశ్యాన్ని చూశాడు. “ఎందుకు ఏడుస్తున్నావు ఓ అందాల భరిణా?” అని అడిగాడు.

అల్యోనుష్కా తన కథంతా చెప్పింది. అది విన్న వర్తకుడు ఇలా అన్నాడు “ ఓ అందాల భరిణా! నన్ను పెళ్ళి చేసుకో. నిన్ను బోల్డెంత బంగారం, వెండితో అలంకరిస్తాను.  ఈ బుజ్జి మేక పిల్ల కూడా మనతోనే జీవిస్తుంది.”

అల్యోనుష్కా బాగా ఆలోచించింది. వర్తకుడిని పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకుంది.

త్వరలోనే వాళ్ళు పెళ్ళి చేసుకుని, బుజ్జి మేకపిల్లతో కలసి సుఖంగా జీవించారు. అల్యోనుష్కా తిన్న కంచంలోనే బుజ్జి మేక తినేది. అల్యోనుష్కా మంచినీళ్లు తాగే గ్లాసులోనే బుజ్జిమేక కూడా తాగేది.

ఒక రోజు వర్తకుడు వ్యాపార నిమిత్తం బయటకు వెళ్ళాడు. వున్నట్టుండి ఎక్కడినుండో ఓ మంత్రగత్తె మారువేషంలో ఊడిపడింది. అల్యోనుష్కా గది కిటికి వద్దకు వచ్చిన మంత్రగత్తె, నదిలో స్నానానికి తనతో రమ్మని  బతిమిలాడింది.

మంత్రగత్తెతో కలసి అల్యోనుష్కా నదికి వెళ్ళింది. మంత్రగత్తె అల్యోనుష్కా మీద పడి బంధించింది. అల్యోనుష్కా మెడకు ఓ బండరాయి కట్టి, నదిలోకి తోసేసింది. అచ్చం అల్యోనుష్కాలా మారి, ఆమె బట్టలు, నగలు ధరించి, అల్యోనుష్కా  ఇంటికి వెళ్ళింది మంత్రగత్తె. అల్యోనుష్కా రూపంలో వున్న మంత్రగత్తెను చూసి, అందరూ అల్యోనుష్కానే అనుకున్నారు. చివరకి వర్తకుడు కూడా ఆమె వేషాన్ని గుర్తించలేకపోయాడు.

మంత్రగత్తె చేసిన మోసం గురించి బుజ్జి మేకపిల్లకు మాత్రమే

తెలుసు. బుజ్జి మేక దిగులుతో తల వేలాడేసుకొని కూర్చునేది, తిండి తినేది కాదు. ఏదీ తాగేది కాదు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం బుజ్జి మేకపిల్ల నది ఒడ్డుకు వెళ్ళి ఇలా అనేది.

**"అల్యోనుష్కా అక్కా! అల్యోనుష్కా అక్కా! నా మాటలు**
**వినిపిస్తున్నాయా?**
**నా వద్దకు ఈదుకుంటూ రా?"**

బుజ్జి మేక దినచర్యను గమనించిన మంత్రగత్తె, దాన్ని చంపాలని పథకం వేసింది. దాన్ని చంపమని వర్తకుడిని ఒత్తిడి చేసింది.

బుజ్జి మేకను చంపడం వర్తకుడికి ఇష్టం లేదు. కానీ మంత్రగత్తె రాత్రింబవళ్ళు అతడిని ఒత్తిడికి గురి చేసింది. విసుగు చెందిన వర్తకుడు ఇలా అన్నాడు "దానిని నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో."

మంత్రగత్తె ఆనందంతో మంటలను రాజేసింది. పెద్ద కుండలలో నీళ్ళను కాచి, కత్తులను సాన పెట్టించింది.

తనకు రోజులు దగ్గర పడ్డాయని గ్రహించిన బుజ్జి మేక వర్తకుడితో ఇలా అంది

"మీరు నన్ను తండ్రిలా ఎంతో ప్రేమగా చూసుకున్నారు. నా చివరి కోరికను మన్నించి, నన్ను నది వద్దకు పంపండి. ఆఖరిసారి ఆ నది నీటిని ఓసారి తాగి వస్తాను".

బుజ్జి మేక చివరి కోరికను వర్తకుడు అంగీకరించాడు.

మేకపిల్ల పరిగెత్తుకుంటూ నది వద్దకు వెళ్ళి బాధతో ఇలాఅంది

**"అక్కా! అక్కా! అల్యోనుష్కా అక్కా!**
**అక్కా! అక్కా! అల్యోనుష్కా అక్కా!**
**నా వద్దకు రా! నా వద్దకు రా**

**నీటి ఒడ్డుకు ఈదుకురా**

**మాయలమారి వచ్చింది**

**నీ వేషం వేసింది**

**నన్ను చంపమని చెప్పింది**

**కత్తులు పదును పెడుతుంది"**

నదిలో నుండి అల్యోనుష్కా ఇలా అంది

**"నా చిన్ని తమ్ముడు ఇవానుష్కా**

**నన్ను బండరాయి కిందుంచింది**

**కాళ్ళను తాడుతో బంధించింది**

**ఇసుకలో దిగబడి వున్నాను**

**బైటకు రాలేకున్నాను"**

మంత్రగత్తె, బుజ్జిమేక కోసం వెతికింది. కాని అది కనుపడలేదు. మేక పిల్లను వెతికి తన వద్దకు తీసుకురమ్మని పనివాడిని ఆదేశించింది.

పనివాడు నది వద్దకు వెళ్ళి ఆ దృశ్యాన్ని చూశాడు. బుజ్జిమేక నది వద్ద అటూ ఇటూ పరిగెత్తుతూ బాధతో ఇలా అరుస్తుంది

**"అక్కా! అక్కా! అల్యోనుష్కా అక్కా!**

**అక్కా! అక్కా! అల్యోనుష్కా అక్కా!**

**నా వద్దకు రా! నా వద్దకు రా**

**నీటి ఒడ్డుకు ఈదుకురా**

**మాయలమారి వచ్చింది**

**నీ వేషం వేసింది**

**నన్ను చంపమని చెప్పింది**

**కత్తులు పదును పెడుతుంది"**

నదిలో నుండి అల్యోనుష్కా ఇలా అంది

**"నా చిన్ని తమ్ముడు ఇవానుష్కా**
**నన్ను బండరాయి కిందుంచింది**
**కాళ్ళను తాడుతో బంధించింది**
**ఇసుకలో దిగబడి వున్నాను**
**బైటకు రాలేకున్నాను"**

పనివాడు ఇంటికి పరుగెత్తుకుంటూ వచ్చి తను విన్నది, చూసింది వర్తకుడికి చెప్పాడు.

ఊరిలోని ప్రజలంతా కలిసి నది వద్దకు వెళ్ళారు. వలను నదిలో విసిరి, అల్యోనుష్కాను కాపాడారు.

తన మెడకు వున్న పెద్ద బండరాయిని తొలగించారు.

అల్యోనుష్కా తాజా నీటిలో స్నానం చేసింది.

అందమైన దుస్తులను ధరించింది. అప్పుడు అల్యోనుష్కా, మునుపటి కంటే అందంగా మెరిసిపోయింది.

బుజ్జి మేక ఆనందంతో పిల్లిమొగ్గలు వేసింది. ఆ మరుక్షణమే బుజ్జిమేక, తన తమ్ముడు ఇవానుష్కాలా మారిపోయాడు.

ఊరి ప్రజలు మంత్రగత్తెను బంధించి గుర్రపు తోకకు కట్టారు. బెదిరిన గుర్రం మైదానంలోకి దౌడు తీసింది.

| | | |
|---|---|---|
| English Title | : | Alyonuska and her little brother Ivanushka |
| Writer | : | A Russian folk tale |
| English Translation | : | Irina Zheleznova |
| Illustration | : | T. Shevaryova |



# మూడు ఎలుగుబంట్లు
## టాల్‌స్టాయ్

అనగనగా ఒక ఊరిలో ఓ చిన్నారి పాప నివసించేది. ఓ రోజు షికారుకు పక్కనున్న అడవిలోకి వెళ్ళింది. అలా నడుస్తూ నడుస్తూ దారి తప్పింది. తిరిగి తన ఇంటికి వెళ్ళాలని తీవ్రంగా ప్రయత్నించింది. కానీ తన ప్రయత్నం ఫలించలేదు. చివరకి అడవిలో ఓ ఇల్లు కనిపిస్తే ఆ ఇంటికి చేరింది.

ఆ ఇంటి తలుపులు తెరచే వున్నాయి. పాప మెల్లగా తొంగి చూసింది. ఎవరూ లేరని నిర్ధారించుకొని మెల్లగా ఇంట్లో అడుగు పెట్టింది.

ఆ ఇంట్లో ఒక ఎలుగుబంటి

కుటుంబం నివసించేది. వాళ్ళు ముగ్గురు. నాన్న ఎలుగుబంటి పెద్దగా భీకరాకారంలో వుండేది. అమ్మ ఎలుగుబంటి కొంచెం చిన్నగా వుండేది. వాళ్ళ కూతురైన బుజ్జి ఎలుగుబంటి చాలా చిన్నది. బుజ్జి ఎలుగుబంటి పేరు 'మిషా'.

అమ్మ ఎలుగుబంటి సూప్ తయారు చేసింది. అది చల్లారడానికి కొంత సమయం పడుతుంది కదా అని మూడు ఎలుగుబంట్లు పచార్లు చేయడానికి అడవిలోకి వెళ్ళాయి.

ఈలోగా పాప అక్కడకెళ్ళిందన్నమాట.

ఆ ఇంట్లో రెండు గదులు మాత్రమే వున్నాయి. మొదటిది భోజనాల గది. రెండవది నిద్రించే గది.

చిన్నారి పాప మొదట భోజనాల గదిలోకి ప్రవేశించింది.

భోజనాలు తినే మేజాబల్లపై మూడు గిన్నెలు వున్నాయి. వాటిలో ఘుమఘుమలాడే సూప్ వుంది. మొదటి గిన్నె చాలా పెద్దది, అది నాన్న ఎలుగుబంటి గిన్నె. రెండవ గిన్నె చిన్నది, అది అమ్మ ఎలుగుబంటి గిన్నె. మూడవ గిన్నె చాలా చిన్నది, అది నీలం రంగులో వుంది, అది పిల్ల ఎలుగుబంటి 'మిషా' గిన్నె. ప్రతి గిన్నె పక్కన ఒక చెంచా వుంది. వరుసగా ఒక పెద్ద చెంచా, ఒక చిన్న చెంచా, ఒక బుజ్జి చెంచా వున్నాయి.

పాప పెద్ద చెంచాను తీసుకొని పెద్ద గిన్నెలోని సూప్‌ని రుచి చూసింది. తరువాత చిన్న చెంచాను తీసుకొని చిన్న గిన్నెలోని సూప్‌ని రుచి చూసింది. తరువాత బుజ్జి చెంచాను తీసుకుని నీలంరంగు మిషా గిన్నెలోని సూప్‌ని



రుచి చూసింది. పాపకు అన్నింటికంటే మిషా గిన్నెలోని సూప్ రుచి బాగా నచ్చింది.

పాపకు అలసటగా అనిపించి చుట్టూ చూసింది. మూడు కుర్చీలు వున్నాయి. ఒక పెద్ద కుర్చీ, ఒక చిన్న కుర్చీ, ఒక బుజ్జి కుర్చీ వున్నాయి. పాప పెద్ద కుర్చీలో కూర్చోడానికి ప్రయత్నించి వీలుకాక కింద పడింది. తరువాత చిన్న కుర్చీలో కూర్చుంది. అంత సౌకర్యవంతంగా అనిపించలేదు. తరువాత బుజ్జి కుర్చీలో కూర్చుంది. అది చాలా చక్కగా సరిపోయింది. పాప ఆనందంతో చప్పట్లు కొట్టింది. నీలి రంగులో వున్న బుజ్జి గిన్నెను తీసుకుని అందులోని సూప్‌ని తాగేసింది.

సూప్ మొత్తం తాగాక, తాపీగా కుర్చీలో ముందుకు వెనక్కు ఊగింది. అలా కొంచెంసేపు ఊగగానే కుర్చీ పుటుక్కున విరిగింది. పాప కిందపడిపోయింది.

పాప లేచి నిలబడి, పక్క గదిలోకి వెళ్ళింది. అది నిద్రించే గది. అక్కడ మూడు మంచాలున్నాయి. ప్రతి మంచంపై మెత్తటి పరుపు, దిండ్లు వున్నాయి. వాటిలో ఒక పరుపు చాలా పెద్దగా వుంది. మరో పరుపు చిన్నదిగా వుంది. ఇంకొక పరుపు చాలా చాలా చిన్నదిగా వుంది.

పాప మొదటి పరుపుపై పడుకుంది. అది తనకు విశాలంగా, చాలా పెద్దగా అనిపించింది. నచ్చలేదు. తరువాత చిన్న పరుపుపై పడుకుంది. అది తనకు కొంచెం ఎత్తుగా వున్నట్టు అనిపించింది. అదీ నచ్చలేదు. తరువాత చాలా చాలా చిన్నగా వున్న పరుపుపై పడుకుంది. దానిపై ఎంతో సౌకర్యంగా

వుంది. అది ఎంతో నచ్చింది. ఆ మెత్తటి బుజ్జి పరుపుపై పడుకుని, దుప్పటి కప్పుకొని క్షణాల్లో నిద్రలోకి జారుకుంది.

కొంత సమయం గడిచాక, మూడు ఎలుగుబంట్లు ఇంటికి తిరిగి వచ్చాయి. అవి చాలా ఆకలిగా వున్నాయి. నాన్న ఎలుగుబంటి తన పెద్ద గిన్నెలోకి చూసి బిగ్గరగా ఇలా అరిచింది

"నా సూప్ ఎవరు రుచి చూశారు?"

అమ్మ ఎలుగుబంటి తన చిన్న గిన్నెలోకి చూసి చిన్న గొంతుతో ఇలా అంది.

"నా సూప్ ఎవరు రుచి చూశారు?"

పిల్ల ఎలుగుబంటి తన బుజ్జి గిన్నెలోకి చూసింది. అది ఖాళీగా వెక్కిరించింది. చాలా చిన్న గొంతుతో మెల్లగా ఇలా అంది

"నా సూప్ మొత్తం ఎవరు తాగేశారు?"

తరువాత నాన్న ఎలుగుబంటి తన పెద్ద కుర్చీని చూసి బిగ్గరగా ఇలా అరిచింది

"నా కుర్చీలో ఎవరు కూర్చున్నారు? దానిని పక్కకు ఎందుకు జరిపారు?"

అమ్మ ఎలుగుబంటి తన చిన్న కుర్చీని చూసి చిన్న గొంతుతో ఇలా అంది

"నా కుర్చీలో ఎవరు కూర్చున్నారు? దానిని పక్కకు ఎందుకు జరిపారు?"

పిల్ల ఎలుగుబంటి తన బుజ్జి కుర్చీని చూసేసరికి, అది విరిగి ముక్కలైంది. చాలా చిన్న గొంతుతో మెల్లగా ఇలా అంది

“నా కుర్చీని ఎవరు విరగొట్టారు?”

మూడు ఎలుగుబంట్లు నిద్రించే గదిలోకి వెళ్ళాయి. నాన్న ఎలుగుబంటి తన పరుపుని చూసింది. బిగ్గరగా ఇలా అరిచింది.

“నా పరుపుపై ఎవరు పడుకున్నారు, అది నలిగిపోయింది?”

అమ్మ ఎలుగుబంటి తన పరుపుని చూసింది. చిన్నగొంతుతో ఇలా అంది

“నా పరుపుపై ఎవరు పడుకున్నారు, అది నలిగిపోయింది?”

చిన్న ఎలుగుబంటి చిన్న చెక్క పీటపై ఎక్కి తన పరుపుని చూసి చాలా చిన్న గొంతుతో మెల్లగా ఇలా అంది.

“నా పరుపుపై ఎవరో పడుకున్నారు!”

ఉన్నట్టుండి పరుపుపై నిద్రపోతున్న పాపను చూసి మెల్లగా ఇలా అంది

“ఇక్కడుంది పాప! పట్టుకోండి!.. పట్టుకోండి!.. ఇక్కడుంది పాప! పట్టుకోండి!.. పట్టుకోండి!.. ”

బుజ్జి ఎలుగుబంటి పాపను కొరకాలని చూసింది. ఈలోగా ఉలిక్కిపడి పాప నిద్ర లేచింది. ఎదురుగా మూడు ఎలుగుబంట్లు కోపంగా కనిపించాయి. చిన్న పాప తానున్న పరిస్థితి గ్రహించి, క్షణాల్లో మంచం పక్కన తెరిచి వున్న కిటికిలో నుండి బయటకు దూకి వాయువేగంతో పారిపోయింది.

పాపను పట్టుకోవాలని మూడు ఎలుగుబంట్లు ప్రయత్నించాయి.

కానీ పాప దొరకలేదు.

పాప క్షేమంగా ఇల్లు చేరింది. తిరిగి వచ్చిన పాపను చూసి వాళ్ళ తల్లిదండ్రులు సంతోషించారు.

| | | |
|---|---|---|
| English Title | : | The Three bears |
| Writer | : | Lev Tolstry |
| English Translation | : | Ivy Litvinov |
| Illustration | : | Yuri Vasnetsov |



# ఇవాన్

## మాక్సీమ్ గోర్కీ

అనగనగా ఒక ఊరిలో ఇవాన్ అనే ఓ అందమైన యువకుడు ఉండేవాడు. అతను చాలా అమాయకుడు. కాబట్టి ఊరివాళ్ళంతా అతన్ని 'వెర్రివెంగళప్ప ఇవాన్' అని పిలిచేవారు. ఇవాన్ ఓ రైతు వద్ద పనిలో చేరాడు. రైతు దంపతులిద్దరూ పట్టణానికి పట్టణానికి వెళ్తూ ఇవాన్‌తో ఇలా అన్నారు.

"పిల్లలకు భోజనం పెట్టి వాళ్ళని జాగ్రత్తగా చూసుకో".

"వాళ్ళకు ఏం చేసిపెట్ట మంటారు?" అడిగాడు ఇవాన్.

బంగాళ దుంపలతో సూప్ తయారుచేసి పెట్టమంది రైతు భార్య. "ఇంటిని ఓకంట కనిపెట్టు. పిల్లలు అడవిలోకి వెళ్ళకుండా జాగ్రత్తగా

చూసుకో" అన్నాడు రైతు. వాళ్ళు పట్టణానికి బయలుదేరారు.

ఇవాన్ గాఢనిద్రలో వున్న పిల్లలిద్దరినీ లేపాడు. వాళ్ళు నిద్రమత్తుతో లేచి కూర్చుని "మాకు బాగా ఆకలేస్తుంది" అన్నారు.

ఇవాన్ వెంటనే ఒక పెద్ద గిన్నె తీసుకొని దానిలో నీళ్ళుపోసి మరిగించి సగం బస్తా పిండిని వేశాడు.తరువాత కంగారుపడుతూ బిగ్గరగా అన్నాడు

"ఇప్పుడు ఏమి చెయ్యాలి".

ఇది విన్న పిల్లలు బాగా కంగారుపడ్డారు. ఈ వెర్రివెంగళప్ప మనల్ని ఏమైనా చేస్తాడేమో అని భయపడి తప్పించుకుని అడవిలోకి పారిపోయారు.

ఇవాన్ పొయ్యిమీద వున్న గిన్నె మంట తగ్గించి ఇలా ఆలోచించసాగాడు. రైతు దంపతులు నాకు రెండు పనులు అప్పగించారు. మొదటిది పిల్లల్ని చూసుకోమని, రెండవది ఇంటిని కనిపెట్టుకొని వుండమని చెప్పారు. అయినా ఒక వ్యక్తి, ఒకేసారి రెండు పనులు ఎలా చెయ్యగలడు? ఎంత ఆలోచించినా ఉపాయం తట్టలేదు.

ఇవాన్ ఓ పథకం వేశాడు. "రైతు తలుపుని కనిపెట్టుకొని వుండమంటే దానర్ధం పిల్లలు అడవిలోకి వెళ్ళకుండా వుండాలి. అలా అయితే ఆ తలుపుని నాతో తీసుకొని వెళ్తే, పిల్లలు ఎక్కడకీ వెళ్ళలేరు" అనుకున్నాడు. ఇంటిద్వారం నుండి చెక్క తలుపుని వేరుచేశాడు వెర్రివెంగళప్ప ఇవాన్. తలుపుని వీపు మీద పెట్టుకొని అడవికి బయలుదేరాడు.

అడవిలో ప్రయాణిస్తుండగా, అనుకోకుండా అతనికి ఓ ఎలుగుబంటి కనబడింది. "చెక్క తలుపుని ఎందుకు మోస్తున్నావ్?" అడిగింది ఎలుగుబంటి. జరిగినదంతా చెప్పాడు ఇవాన్. ఇవాన్ అమాయకత్వాన్ని చూసి, పొట్టపగిలేలా నవ్వింది ఎలుగుబంటి. ఆ ఆనందంలో కేరింతలు వేసింది.

"నేనిప్పుడు నిన్ను తినేస్తాను. వద్దులే మీ యజమాని పిల్లల్ని తినేస్తాను.



మరోసారి పిల్లలు తల్లిదండ్రులు లేనప్పుడు, అడవిలోకి వెళ్ళడానికి ప్రయత్నించరు" అని మళ్ళీ గట్టిగా నవ్వింది ఎలుగుబంటి.

"నీలాంటి వెర్రివెంగళప్పని నేను ఇంతవరకు చూడలేదు. నిన్ను నా భార్యకు పరిచయం చేస్తాను. చెక్క తలుపుని ఈ పైన్ చెట్టుకింద వుంచు మా ఇంటి నుండి తిరిగివచ్చాక తీసుకోవచ్చు." అన్నది ఎలుగుబంటి. ఇవాన్ ఇలా సమాధానమిచ్చాడు "నేను మాట తప్పను. రైతు నన్ను ఈ తలుపుని గమనిస్తూ వుండమన్నారు. కాబట్టి నేను ఎక్కడికి వెళ్ళినా నాతో పాటు ఈ తలుపుని కూడా తీసుకొనివస్తాను." వాళ్ళు ఇక అడవిలో ప్రయాణం సాగిస్తూ ఎలుగుబంటి గుహను చేరారు.

ఎలుగుబంటి తన భార్యతో ఇలా అంది "మాషా! నేను నీకు పరిచయం చేయడానికి ఒకరిని తీసుకొచ్చాను. ఇతని పేరు వెర్రివెంగళప్ప ఇవాన్. ఇతనిలాంటి అమాయకుడుని ఇప్పటివరకూ నేను ఎక్కడా చూడలేదు. మాషాతో ఇవాన్ ఇలా అన్నాడు "మీరు పిల్లల్ని చూశారా?".

"నా పిల్లలు గుహలో హాయిగా నిద్రపోతున్నారు" అంది మాషా. "నన్ను ఒకసారి చూడనిస్తారా? వాళ్ళు రైతు పిల్లలైతే కాదు కదా" అన్నాడు ఇవాన్. మాషా అతనిని లోపలికి తీసుకొని వెళ్ళి, దాని ఎలుగు కూనల్ని చూపించింది.

ఇవాన్ ఇలా అన్నాడు "వీళ్ళు రైతు పిల్లలు కాదు ఎందుకంటే వాళ్ళ పిల్లలు ఇద్దరు, వీళ్ళు ముగ్గురు". ఇవాన్ అమాయకత్వం, తెలివితక్కువతనం మాషాకు అర్థమై నవ్వుకుంది.

మాషా ఇలా అంది "రైతు పిల్లలేమో మనుషులు, మరి నా పిల్లలేమో ఎలుగు కూనలు కదా. వాళ్ళు వీళ్ళు ఒకేలా వుండరు". దానికి బదులుగా ఇవాన్ ఇలా అన్నాడు "చిన్న పిల్లలుగా వున్నప్పుడు అందరూ ఒకలాగే

వుంటారు. వాళ్ళను గుర్తించడం కష్టం". మాషా ఇవాన్ మాటలకు ఆశ్చర్యపోయింది.

మాషా ఎలుగుబంటితో ఇలా అంది "మనం ఇతనికి హాని చెయ్యవద్దు, మనతోనే వుంచుకొని పనిలో పెట్టుకుందాం సరేనా?". సరేనని తలూపింది ఎలుగుబంటి.

ఇవాన్ మనిషి అయినప్పటికీ, అమాయకుడు కదా, అతని వల్ల మనకి ఎటువంటి హాని జరగదని నిర్ణయించుకున్నారు దంపతులిద్దరూ.

మాషా, ఇవాన్‌కి బుట్టను ఇచ్చి ఇలా అంది. "అడవిలోకి వెళ్ళి, రాస్‌బెర్రీ పండ్లను బుట్టనిండా ఏరుకునిరా, నా కూనలు నిద్రలేవగానే వాటికి తినిపించాలి".

ఇవాన్ ఇలా అన్నాడు "సరేనండీ, మీరు ఈ తలుపుని జాగ్రత్తగా కనిపెట్టండి." ఇవాన్ దట్టమైన అరణ్యంలోకి వెళ్ళాడు. రాస్‌బెర్రీ చెట్లనిండా కాయలు వేలాడుతున్నాయి. ఇవాన్ ఆ పండ్లను కడుపునిండా తిని, బుట్టనిండా కాయలను ఏరాడు. ఈ క్రింది విధంగా పాట పాడుతూ గుహకు బయలుదేరాడు.

**చక్కటి అడవి, చిక్కటి అడవి**
**చిట్టిపొట్టి బుల్లి జంతువులు**
**చకచక గెంతే ఉడతలు**
**నిత్యం పనిలో ఎర్ర చీమలూ**
**ఎంతో రుచిగా రాస్ బెర్రీలు**
**చక్కటి అడవి చిక్కటి అడవి**
**ఆనందాలను పంచే అడవి**

"రాస్‌బెర్రీ పండ్లు తెచ్చాను" అని గట్టిగా అరిచాడు ఇవాన్. ఈ

మాటవిన్న ఎలుగుకూనలు తోసుకుంటూ ఇవాన్ దగ్గరకు వచ్చాయి. ఆకలితో వున్న కూనలు పండ్లను ఇష్టంగా తిన్నాయి.

ఆ దృశ్యం చూసిన ఇవాన్ ఇలా బాధపడ్డాడు "నా దురదృష్టం కొద్దీ నేను మనిషినై పుట్టాను, నేనూ ఎలుగుబంటినైతే నాక్కూడా ఇలాంటి బుజ్జి కూనలు వుండేవి".

ఇది చూసిన ఎలుగుబంటి దంపతులు ఇవాన్‌ను చూసి ఆనందించారు.

"మీరు ఈ తలుపుని జాగ్రత్తగా చూసుకోండి. నేను నా యజమాని పిల్లల్ని వెతుకుతాను" అన్నాడు ఇవాన్.

మాషా ఎలుగుబంటితో మీరూ ఇవాన్‌కి సహాయం చెయ్యండి. అసలే అతను చాలా అమాయకుడు కదా! ఇక ఇద్దరూ తిరుగు ప్రయాణమయ్యారు. వారి ప్రయాణంలో మరింత దగ్గరయ్యారు. ప్రాణస్నేహితుల్లా అన్నీ విషయాలు పంచుకున్నారు.

దారి మధ్యలో వాళ్ళకు చెట్ల పొదల్లో నిద్రిస్తున్న ఇద్దరు పిల్లలు కనిపించారు. "వాళ్ళేనా రైతు పిల్లలు" అడిగింది ఎలుగుబంటి. "నాకూ తెలియదు పిల్లల్నే అడుగుతాను. ఈ పిల్లలకి ఆకలిగా ఉందంటే వీళ్ళే రైతు పిల్లలు" అన్నాడు ఇవాన్. ఇవాన్ పిల్లలని నిద్రలేపి, మీకు ఆకలిగా వుందా అని అడిగాడు ఇవాన్. పిల్లలిద్దరూ 'అవును' అన్నారు.

"మిత్రమా నాకు సహాయం చేయగలవా? ఈ తలుపుని తీసుకొని నాతో కలసి రైతు ఇంటికి రాగలవా? నేను ఈ పిల్లలను తీసుకొనివస్తాను" అన్నాడు ఇవాన్.

"తప్పకుండా వస్తాను ఇవాన్" అంది ఎలుగుబంటి.

ఎలుగుబంటి, పిల్లలతో కలసి ఇవాన్ ఇంటివైపు అడుగులు వేశారు.

వాళ్ళు ఇంటికి చేరేసరికి, రైతు దంపతులు ఇంట్లో వున్నారు. ఇల్లంతా గందరగోళంగా వుంది, ఇంటి ద్వారానికి తలుపు లేదు. పిల్లలను చూడగానే తల్లిదండ్రులు ఆనందంతో హత్తుకున్నారు.

ఏం జరిగింది ఇవాన్? అడిగారు రైతు దంపతులు. మీరు చెప్పినట్లే చేశాను అన్నాడు ఇవాన్ అమాయకంగా. "తలుపు ఏది? అడిగాడు రైతు. "నా మిత్రుడు తీసుకొని వస్తున్నాడు" సమాధానమిచ్చాడు ఇవాన్. రైతు దంపతులు కిటికీలో నుండి చూశారు. ఓ ఎలుగుబంటి, తన వీపుపై చెక్క తలుపుని మోసుకొని ఠీవీగా వస్తుంది. ఎలుగుబంటిని చూసిన కుక్కలు భౌ..భౌ..అని అరుస్తూ బెదిరిపోయాయి. కోడిపుంజులూ భయంతో చెదిరిపోయాయి. ఊరి ప్రజలందరూ ఎలుగుబంటిని చూడడానికి గుంపులుగుంపులుగా వస్తున్నారు. కొందరు డాబాల మీద, చెట్ల పైకి ఎక్కి తలుపుని మోస్తున్న ఎలుగుబంటిని చూస్తున్నారు.

ఎలుగుబంటి తలుపుని రైతు దంపతులకు అప్పగించింది. వాళ్ళు దానిని చూసి భయపడ్డారు కానీ, పిల్లలు క్షేమంగా ఇల్లు చేరినందుకు సంతోషించారు.

ఇవాన్ ఊరి చివరిదాకా వెళ్ళి తన మిత్రుడైన ఎలుగుబంటికి కృతజ్ఞతలు తెలిపి, వీడ్కోలు ఇచ్చాడు.

వాళ్ళు ఇప్పటికీ మంచి మిత్రులు.

చూశారా పిల్లలూ! స్నేహం అంటే ఇదే మరి!


| | | |
|---|---|---|
| English Title | : | Ivan the Fool |
| Writer | : | Maxim Gorky |
| English Translation | : | Galina Glagoleva |
| Illustration | : | Yuri Molokanov |



# చీమ – చందమామ

## మాక్సిమ్ టాంక్

అనగనగా ఒక అడవిలో ఓ చీమ నివసించేది. దానికి విశ్వంలో ప్రయాణించి చంద్రమండలాన్ని చేరాలని చిరకాల వాంఛ. అది తన చీమల సమూహంతో కలిసి మెలిసి ఓ చీమల పుట్టలో నివసించేది. రాత్రిళ్ళు అది చెట్టు ఎక్కి చంద్రుడిని, చుక్కల్ని, ఆకాశాన్ని చూస్తూ గడిపేది. ఎప్పటికైనా చంద్రుణ్ణి చేరతానని కలలు కనేది.

ఆ చీమల పుట్ట సమీపంలో ఓ ముళ్ళ పంది, నక్క, ఎలుగుబంటి, కొంగ నివసించేవి.

ఆ అడవికి దగ్గరలో ఓ పట్టణం వుండేది. పట్టణంలోని పిల్లలు సెలవు దినాన, పుట్ట గొడుగులు ఏరడానికి అడవిలోకి వెళ్ళారు. వాళ్ళు పుట్ట గొడుగులు ఏరడానికి కొన్ని పాత న్యూస్

పేపర్లని వాళ్ళ వెంట తీసుకుకెళ్ళారు. ఇంతలో ఓ గాలి దుమారం వచ్చి, పేపర్లు గాలికి చెల్లాచెదురయ్యాయి.

వాటిలో ఓ దినపత్రికలోని పేజీ ఎగురుకుంటూ వెళ్ళి చీమల పుట్ట సమీపంలో పడింది.

మొదట ఆ పేజీని ముళ్ళ పంది చూసింది. చదవడానికి ప్రయత్నించింది. దానికి చదువు రాదన్న విషయం గుర్తొచ్చింది. సరే దినపత్రికలోని విషయాలు తెలుసుకుందామని, ఆ పత్రిక పేజీని నక్క వద్దకు తీసుకువెళ్ళింది.

ముళ్ళ పంది ఇలా అంది "నక్క బావా! నక్క బావా! ఈ దినపత్రిక కాస్త చదివిపెట్టవూ! నాకేమో చదువు రాదు కదా మరి"

నక్క ఇలా సమాధానం చెప్పింది "ముళ్ళ పంది అల్లుడూ! ఆ చదువే నాకొస్తే నేను ఇలా ఎందుకుంటాను, మనం ఎలుగుబంటి వద్దకు వెళ్దాం పద, అది మనకు సాయం చేస్తుందేమో".

ముళ్ళ పంది, నక్క ఇద్దరూ కలిసి ఎలుగుబంటి వద్దకు వెళ్ళారు.

"ఎలుగుబంటి గారూ! ఈ దినపత్రిక కాస్త చదివిపెట్టరూ! మాకేమో చదవడం రాదు" అన్నారు ఇద్దరూ.

ఇది విన్న ఎలుగుబంటి "హీ..హీ..హీ" అంటూ గట్టిగా నవ్వింది. చాలాసేపు నవ్విన మీదట తాపీగా ఇలా అంది.

"నేను చిన్నప్పుడే బడికి డుమ్మా కొట్టాను. కాబట్టి ఆ వచ్చిన నాలుగు అక్షరాలు మర్చిపోయాను. కాబట్టి నేను చదువలేను. కానీ మీకు కొంగ కానీ, చీమ కానీ సాయం చేయగలవు".

ముళ్ళ పంది, నక్క కలసి కొంగ వద్దకు వెళ్ళి దినపత్రిక చదివిపెట్టమని ప్రార్థించాయి.



కొంగ అందుకు ఒప్పుకుని చదవడం ప్రారంభించింది.

అదే సమయానికి అటు నుండి వెళ్తున్న చీమ కూడా అక్కడకు చేరింది.

కొంగ పత్రికలోని విషయాన్ని చదివి ఇలా చెప్పింది "మరో రెండు రోజుల్లో, ఇద్దరు వ్యోమగాములు, ఓ రాకెట్టులో చంద్రమండలానికి ప్రయాణించబోతున్నారు. ఏర్పాట్లు అన్ని పూర్తయ్యాయి".

ఇది విన్న చీమ ఎంతో సంతోషించింది. తన చిరకాల వాంఛ తీరే సమయం వచ్చినందుకు ఎంతో సంతోషించింది.

చీమ ఓ చేతి కర్రను, కంపాస్‌ను తీసుకుని, బట్టల సంచి వీపుకు తగిలించుకుంది. బంధుమిత్రులకు వీడ్కోలు చెప్పి, చంద్రమండలానికి ప్రయాణాన్ని ప్రారంభించింది.

రాత్రింబవళ్ళు ప్రయాణించి పట్టణంలోని విమానాశ్రయాన్ని చేరింది. "టికెట్టు లేకుండా విమానంలోకి ఎక్కనివ్వరు కదా!" అన్న సందేహం వచ్చింది చీమకు.

విమానాశ్రయంలో కౌంటర్ వద్ద ప్రయాణికులు 'క్యూ' లో నిలబడివున్నారు. వాళ్ళలో చిన్న పిల్లలు, యువకులు, యువతులు, వృద్ధులు వున్నారు.

కొందరు వెళ్ళే ప్రయాణానికి మాత్రమే టికెట్టు తీసుకుంటే, మరికొందరు తిరుగు ప్రయాణానికి కూడా టికెట్టు తీసుకుంటున్నారు. ఇదంతా శ్రద్ధగా గమనించింది చీమ.

"విమానంలో ప్రయాణించడం ఎలాగా?" అని ఆలోచించసాగింది. ఇంతలో చీమకు ఒక ఆలోచన వచ్చింది.

మెల్లగా చీమ ఓ ముసలావిడ బుట్టలోకి చేరింది. ఆ బుట్ట నిండా

బహుమతులు వున్నాయి. ప్రయాణికులంతా విమానం ఎక్కారు. అలా ముసలావిడ బుట్టతోపాటు చీమ కూడా విమానంలోకి చేరింది.

విమానం మెల్లగా బయలుదేరింది. చీమ ఆసక్తిగా విమానంలో ఏం జరుగుతుందా అని చూద్దామనుకుంది. కాని తనను ఎవరన్నా చూస్తారేమోనని, ఆ ప్రయత్నాన్ని మానుకుంది.

ప్రయాణ బడలిక వల్ల మెల్లగా నిద్రలోకి జారుకుంది. కొన్ని గంటల తరువాత....

చీమ నిద్రలేచింది. విమానం గమ్యస్థానాన్ని చేరింది. ప్రయాణికులు ఒక్కొక్కరూ దిగడం ప్రారంభించారు. వృద్ధురాలు తన బహుమతుల బుట్టతో దిగింది.

అప్పటికే ఆ ముసలావిడ కోసం వాళ్ళ కొడుకు ఎదురుచూస్తున్నాడు. 'అమ్మా..' అని అరుస్తూ ముసలావిడని కౌగలించుకున్నాడు. సరిగ్గా ఆ క్షణాన చీమ బుట్టలోంచి బయటకు దూకింది.

పరుగులాంటి నడకతో బయలుదేరింది. అప్పుడు సూర్యుడు అస్తమిస్తున్నాడు. విమానాశ్రయం అంతా గాలించి చివరికి రాకెట్ వున్న ప్రదేశాన్ని చేరింది.

బ్రహ్మ రాక్షసిలా వున్న రాకెట్‌ని చూసి చీమ మొదట భయపడింది. కానీ తరువాత స్థిమితపడింది.

'రాకెట్‌లోకి ఎక్కడం ఎలా' అని ఆలోచించింది. ఇద్దరు వ్యోమగాములు అప్పుడే రాకెట్‌లోకి అడుగుపెడుతున్నారు. చీమ మెల్లగా రాకెట్‌లోకి దూరింది. ఓ మూలన దాక్కుంది.

పెద్ద శబ్దం చేస్తూ, నిప్పులు కక్కుకుంటూ, రాకెట్ నింగి కెగసింది.

కొన్ని గంటల తరువాత...

ఇద్దరు వ్యోమగాములు గాలిలో తేలుతున్నారు. చీమ వాళ్ళను చూసి తను పట్టుకున్న ఆధారాన్ని వదిలింది. ఆశ్చర్యం, అది కూడా గాలిలో తేలింది. చీమకు తన శరీరం దూదిపింజలా చాలా తేలికగా తోచింది. గమ్మత్తుగా అనిపించింది. మెల్లగా అలవాటుపడింది.

వ్యోమగాములు నిద్రపోయారు. చీమ మెల్లగా లేచి ఆహారం తిని, నీరు తాగింది. విమానంలోని టెలిస్కోప్ వద్దకు వెళ్ళి భూమిని చూసింది. భూమి గుండ్రంగా పిల్లలు ఆడుకునే బంతిలా వుంది.

భూమిపైన తను వున్న బిర్చి చెట్టు, చీమల పుట్ట కనిపించాయి. చీమ ఆనందంతో బిగ్గరగా అరిచింది "ప్రతి ఒక్కరూ! చూడండి. నేను గాల్లో ఎలా ఎగురుతున్నానో?"

చీమ మాటలు విని వ్యోమగాములు నిద్రలేచారు. వాళ్ళు ఆశ్చర్యపోయారు. రాకెట్‌లోకి ఎలా వచ్చావు మిత్రమా! అంతా కుశలమేనా!" అని అడిగారు.

చీమ భయపడింది. వాళ్ళు ఇలా అన్నారు "భయపడకు మిత్రమా! ఈ క్షణం నుండి ఈ రాకెట్‌లో వ్యోమగాములు ఇద్దరు కాదు, ముగ్గురు. నీవు కూడా మా శాస్త్రవేత్తల బృందంలో సభ్యుడివే".

ముగ్గురు వంతుల వారీగా పనిచేశారు. ఎప్పటికప్పుడు వాళ్ళ సమాచారాన్ని, పరిశోధనల విశేషాల్ని శాటిలైట్ రేడియో ద్వారా భూమికి చేర్చేవారు.

చివరకు ఓ రోజు వాళ్ళు చంద్రమండలాన్ని చేరారు. చీమ ఆనందానికి అంతేలేదు. వ్యోమగామాలు వాళ్ళ దేశ జెండాని చంద్రునిపై పాతారు. చీమతో కలసి ఆ జెండా వద్ద ఫొటో దిగారు.

కొద్దిరోజులు చంద్రమండలాన్ని పరిశోధించారు. చీమ కూడా ఆ

పరిశోధనలో పాలుపంచుకుంది.

చివరకి తిరుగు ప్రయాణమయ్యారు. కొన్ని రోజులు ప్రయాణించి భూమిని క్షేమంగా చేరారు. రాకెట్ విమానాశ్రయం చేరగానే, చీమ తన మిత్రులకు సెలవు చెప్పి, తను అడవి వైపు ప్రయాణం సాగించింది. దారిలో వర్షం పడింది. అయినా చీమ లెక్కచేయలేదు. చివరకి ఇల్లు చేరింది.

చీమల సమూహం చీమను ఘనంగా ఆహ్వానించింది. పూలమాలలతో సత్కరించింది.

"చంద్రమండలంలో కాలుమోపిన తొలి చీమ'' అని చీమల సమూహం, ముళ్ళ పంది, నక్క, ఎలుగుబంటి, కొంగ చీమను పొగిడాయి.

ఇదండీ పిల్లలూ! చంద్రునిపై కాలుమోపిన తొలి చీమ కథ. కలలు కని, వాటి కోసం కష్టపడితే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరవచ్చు. కలలు కంటూ వాటి సాధించడానికి కష్టపడతారు కదూ...!

| | | |
|---|---|---|
| English Title | : | A tale of the cosmic travels of ant the tramp |
| Writer | : | Maksim Tank |
| English Translation | : | Walter May |
| Illustration | : | N. Gutiev |



# రాళ్ళు కొట్టే మనిషి కథ

## రష్యన్ జానపద కథ

అనగనగా ఒక ఊరిలో ఓ మనిషి నివసించేవాడు. అతను ఊరికి దగ్గరలోని క్వారీలో రాళ్ళు పగలకొడుతూ, దాంతో సంపాదించిన కొద్దిపాటి డబ్బుతో జీవనం సాగించేవాడు.

ఒక రోజు అతను యధావిధిగా రాళ్ళు పగలుకొట్టే పనిలో మునిగి వున్నాడు. ప్రస్తుతం అతను ఓ పెద్ద కొండని పగులకొడుతున్నాడు.

వున్నట్టుండి అతనికి పెద్ద పెద్ద అరుపులు, కేకలు వినిపించాయి. తన తోటి పనివాళ్ళు హడావిడిగా అటుఇటూ పరిగెడుతున్నారు. "మహారాజు గారు వేంచేస్తున్నారహో" అన్న వార్త నలు దిక్కులా చేరింది.

కొద్ది క్షణాల తరువాత, తెల్ల ఏనుగుపై రీవిగా ఊరేగుతూ మహారాజు వస్తున్నారు. రాళ్ళు కొట్టే వ్యక్తి మోకాళ్ళపై వంగి రాజు గారికి నమస్కరించాడు. మిగిలిన వాళ్ళు కూడా వంగి వంగి దండాలు పెట్టారు.

కానీ మహారాజు ఎవ్వరిని పట్టించుకోలేదు. వాళ్ళవైపు కూడా చూడలేదు.

ఇది రాళ్ళు కొట్టే మనిషిని బాధించింది. “మహారాజు గారు నన్ను కన్నెత్తి కూడా చూడలేదు. నేను మోకాళ్ళపై వంగి దండం పెట్టింది తెల్ల ఏనుగుకు” అని మనసులో అనుకున్నాడు.

“నేను ఎంత దురదృష్టవంతుడిని, నాకు గడ్డి పోచకు వున్న విలువ కూడా లేదు. ఏనుగు జీవితవే చాలా బాగుంది. అది చాలా అదృష్టవంతురాలు. ఎంచక్కా గర్వంగా మహారాజుని మోస్తుంది. నేను ఏనుగులా మారితే ఎంత బాగుంటుంది” అని మనసులో కోరుకున్నాడు.

ఆశ్చర్యం! మరుక్షణం రాళ్ళు కొట్టే మనిషి తెల్ల ఏనుగులా మారిపోయాడు. ఆ ఏనుగుపై మహారాజు ఊరేగుతున్నాడు.

వున్నట్టుండి రాజు గారు సేవిస్తున్న తేనేరు ఒలికింది. ఏనుగుకు కోపం వచ్చింది.

“నేను ఏనుగునై మహారాజుని మోయడం ఎంత బాధాకరం. ఇది బానిస జీవితం. ఎంచక్కా ఈ దేశ మహారాజుగా మారితే ఎంత బాగుంటుంది” అని మనసులో కోరుకున్నాడు.

అద్భుతం! మరుక్షణం మహారాజులా మారిపోయాడు. రీవిగా తేనీరు సేవిస్తూ, తెల్లఏనుగు పై ప్రయాణిస్తూ, దేశప్రజల నుండి గౌరవాన్ని స్వీకరిస్తూ ప్రయాణించాడు. కొందరు రాజోద్యోగులపై తన దర్పాన్ని ప్రదర్శించాడు. కోప్పడ్డాడు. వాళ్ళు రాజు మాటల్ని శిరసావహించారు.



అలా ప్రయాణిస్తుండగా, సూర్యుడు నడి నెత్తి మీదకు వచ్చాడు. సూర్య కిరణాలు సరాసరి మహారాజు కంట్లో పడ్డాయి. మహారాజు రూపంలో వున్న రాళ్ళు కొట్టే మనిషికి ఇది చిరాకుగా అనిపించింది.

"రాజునైన నన్నే సూర్యుడు ఇబ్బంది పెడుతున్నాడు అంటే మహారాజు కంటే సూర్యుడు బలవంతుడన్న మాట. నేను సూర్యుడినైతే ఎంత బాగుండు" అని మనసులో కోరుకున్నాడు.

మరుక్షణం సూర్యుడిలా మారిపోయాడు. సూర్య కిరణాలు వెచ్చగా భూమిని తాకాయి. భూమి వేడిగా మారిపోయింది. సూర్యుడి నుండి వెలువడే వేడి ఆ చుట్టు ప్రక్కల అంతా వ్యాపించింది. ఆకాశంలో కొన్ని చల్లటి మేఘాలు సూర్యుడికి అడ్డుగా ప్రయాణించాయి.

"ఈ వేడి శరీరాన్ని నేను భరించలేను. ఎంచక్కా చల్లని మేఘంలా మారితే ఎంత బాగుండు" అని మనసులో కోరుకున్నాడు.

మరుక్షణం చల్లటి మేఘంలా మారిపోయాడు. హాయిగా అనిపించింది. ఈ మేఘాలు ఆకాశం అంతా వ్యాపించాయి.

ఉన్నట్టుండి ఓ గాలి తీవ్రంగా వచ్చి మేఘాల్ని విడదీసింది. "మేఘం కంటే గాలి శక్తివంతురాలు లాగుంది. నేను గాలిలా మారితే ఎంత బాగుండు" అని మనసులో కోరుకున్నాడు.

మరుక్షణం గాలిలా మారిపోయాడు. ఆ సుడి గాలి భూమిపై తీవ్రంగా వీచింది. దాని ఉధృతికి చెట్లు విరిగాయి, ఇంటి పై కప్పులు ఎగిరి పోయాయి.

కాని గాలి ఓ ఎత్తైన కొండను ఢీకొనగానే చిన్న చిన్న ముక్కలైపోయింది.

"గాలి కంటే కొండ శక్తివంతురాలు లావుంది. నేను ఈ ఎత్తైన

కొండలా మారిపోతే బావుండు” అని కోరుకున్నాడు. వెంటనే ఎత్తైన కొండలా మారిపోయాడు. అది ఎంత పెద్ద కొండ అంటే, ఆకాశాన్ని తాకేంత ఎత్తైనది. దాని ముందు ఇళ్ళు, మనుషులు చిన్న చిన్న చీమల్లా కనిపిస్తున్నారు.

ఓ రాళ్ళు కొట్టే మనిషి, తన బలమైన చేతులతో, పదునైన గొడ్డలితో కొండను పగలకొడుతున్నాడు. ఇది గమనించిన కొండ ఇలా అనుకుంది.

“ఇంత పెద్ద కొండని అంత చిన్న మనిషి ఎలా పగులకొడుతున్నాడు. అంటే అన్నింటికంటే శక్తివంతుడు మనిషి. కాబట్టి నేను తిరిగి రాళ్ళు కొట్టే మనిషిగా మారితే ఎంత బాగుండు” అని మనసులో కోరుకున్నాడు.

మరుక్షణం తిరిగి క్వారీలో రాళ్ళు కొట్టే మనిషిగా మారిపోయాడు.

ఉన్నట్టుండి అతనికి పెద్ద పెద్ద అరుపులు, కేకలు వినిపించాయి. తన తోటి పనివాళ్ళు అటుఇటూ పరిగెడుతున్నారు. “మహారాజు గారు వేంచేస్తున్నారహో” అన్న వార్త నలుదిక్కులా చేరింది. రాళ్ళు కొట్టే మనిషి మనసులో ఇలా అనుకున్నాడు. “ఏనుగు, రాజు, సూర్యుడు, మేఘం, గాలి, కొండ.. ఇవేమి నాకు వద్దు. నేను నా మోకాళ్ళపై వంగి నమస్కరించను” అనుకున్నాడు. అతను వంగి రాజుకి నమస్కరించలేదు. అతన్ని అలా చేయమని ఎవరూ బలవంతపెట్టనూలేదు.

అలా రాళ్ళు కొట్టే మనిషి కష్టించి పనిచేస్తూ, వున్న దాంతో సంతృప్తి పడుతూ ఆనందంగా జీవించాడు.

| | | |
|---|---|---|
| English Title | : | A Legend of Stone cutter |
| Writer | : | Tajik fairy tale |
| English Translation | : | Progress Publishers |
| Illustration | : | A.Vinokurov and L.Shvartsman |



# బంగారు ఆపిల్ చెట్టు

## బైలోరష్యన్ జానపద కథ

అనగనగా ఒక ఊరిలో ముసలతను నివసించేవాడు. ఆయనకి ఇద్దరు భార్యలు. చనిపోయిన మొదటి భార్యకు ఒక కూతురు ఉండేది. ఆ అమ్మాయి పేరు 'గాల్యా'. రెండో భార్య కూతురి పేరు 'యుల్యా'.

ముసలమ్మకి సొంత కూతురైన యుల్యా అంటే ఎంతో ప్రేమ. సవతి కూతురైన గాల్యాని చీటికి మాటికి తిడుతూ, కొడుతూ బాగా హింసించేది.

ఒక రోజు ముసలయ్య సంతకు వెళ్ళి ఓ లేగ దూడను ఇంటికి

తీసుకొచ్చాడు. ముసలయ్య ఇద్దరు కూతుర్లను పిలిచి ఇలా అన్నాడు

"రోజుకొకరి చొప్పున ఈ లేగదూడ బాధ్యత మీ అక్కా చెల్లెళ్ళదే."

తరువాత రోజు గాల్య లేగదూడని పచ్చిక మైదానానికి తీసుకువెళ్లటానికి సిద్ధంగా ఉంది. చెడ్డదైన సవతి తల్లి ఇలా బెదిరించింది.

"ఈ పత్తి నుండి సన్నటి నూలు దారం తీసి దాంతో మంచి చీరను తయారు చేసుకునిరా. ఈ చీరని తీసుకురాకుండా ఇంటికి వస్తే, లోపలకి కూడా రానివ్వను".

"సరే పిన్ని" అంది గాల్యా.

లేగదూడ మెడని ప్రేమగా నిమిరి, దానిని తోలుకుని పచ్చిక మైదానానికి బయలుదేరింది. కొంత దూరం వెళ్ళాక వాళ్ళు ఒక దగ్గర ఆగి గాల్యా కన్నీరు కార్చింది.

లేగ దూడ ఇలా అడిగింది.

"ఓ కుందనపు బొమ్మా! ఎందుకు ఏడుస్తున్నావ్?"

అక్క ఇలా అంది.

"ఏం చెప్పమంటావు, ఓ బుజ్జి లేగదూడా! మా పిన్ని ఈ పత్తి నుండి నూలు దారం తీసి చీరని తయారు చేయమంది. ఈ పని ఒక్క రోజులో చేయడం అసాధ్యం కదా! అందుకే ఏడుస్తున్నాను".

లేగ దూడ ఇలా ఉంది.

'ఏడవకు! ముందు నన్ను పచ్చిక దగ్గరకు తీసుకుని వెళ్ళు. ఆక్కడకు వెళ్ళాక ఏం చేయాలో ఆలోచిద్దాం".

గాల్యా లేగదూడను పచ్చిక మైదానానికి తీసుకువెళ్ళింది. లేగదూడ కడుపు నిండా గడ్డి తిన్న తరవాత ఇలా అంది

"దూది చుట్టిన రాట్నాన్ని నా కుడి చెవిలో ఉంచు, బాగా గాలి పీల్చుకుని, ఆ గాలిని గట్టిగా నా ఎడమ చెవిలో ఊదు".

లేగదూడ చెప్పినట్లే చేసింది గాల్యా. ఆశ్చర్యం! లేగదూడ కుడిచెవిలోని రాట్నం గిరగిరా తిరిగింది. పత్తి మొత్తం సన్నం దారంలా మారిపోయింది. నూలు దారం నుండి అందమైన చీర తయారైంది. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది.

అక్క ఆనందంతో లేగదూడకు కృతజ్ఞతలు చెప్పింది. లేగదూడను కౌగలించుకొని తన సంతోషాన్ని తెలిపింది.

లేగదూడతో సాయంత్రానికి ఇల్లు చేరింది.

వీళ్ళకోసం ఎదురు చూస్తున్న సవతి తల్లి ఇలా అంది. "చీర తయారు చేసావా?"

మెత్తటి అందమైన చీరని పిన్ని చేతిలో పెట్టింది గాల్యా.

చీరని చూసి ముక్కున వేలేసుకుంది సవతి తల్లి. తన కళ్ళను తానే నమ్మలేనట్లు ఆశ్చర్యపోయింది. ఇది ఎలా సాధ్యమైంది అని ఎంతగానో ఆలోచించింది. కాని ఆమెకు జవాబు దొరకలేదు. ఈ ఇరుగు పొరుగు వారు అందమైన చీరని చూసి ముచ్చట పడ్డారు. గాల్యా నైపుణ్యాన్ని పొగిడారు.

తరువాత రోజు లేగదూడ బాధ్యత గయ్యాళి తల్లి సొంత కూతురైన 'యుల్యా' ది. ఆ అమ్మాయి అసలే బద్ధకస్తురాలు, పైగా పొగరుబోతు.

తల్లి ఇలా అంది. "నా ప్రియమైన యుల్యా, నీకు కొంచెం పత్తిని

ఇస్తున్నాను. దీన్ని జాగ్రత్తగా వడికి, సన్నటి నూలు దారం తీసి, దాన్ని శుభ్రపరిచి, నీ అక్క తయారు చేసిన చీరకంటే అందమైనది తయారుచేసుకునిరా. ఇరుగు పొరుగు వాళ్ళు పొగడాల్సింది నిన్ను, ఆ దరిద్రపుగొట్టుదాన్ని కాదు.”

“సరే అమ్మా” అంది యుల్యా.

యుల్యా ఓ చింతబెత్తాన్ని తీసుకుంది. లేగదూడని బెత్తంతో కొడుతూ, తిడుతూ తోటకెళ్లింది. లేగదూడకి కోపం వచ్చి అది పారిపోయింది. దాన్ని పట్టుకోవడానికి నానా తంటాలు పడింది. చివరకి అలసిపోయి, గడ్డిలో పడుకుని నిద్రపోయింది.

పత్తిని వడికే సంగతి మర్చిపోయింది. ఈ లోగా లేగదూడ పత్తిని నోటితో కరుచుకుని, తీసుకువెళ్ళి బురదగుంటలో పడేసింది. సాయంత్రానికి నిద్రలేచింది యుల్యా. బురదగుంటలో పడిఉన్న పత్తిని చూసి పట్టరాని కోపంతో చింత బెత్తంతో  లేగదూడని బాదింది. లేగదూడ పరిగెత్తుతూ ఇంటిదారి పట్టింది. దాన్ని తరుముకుంటూ ఇంటికొచ్చేసరికి పొద్దుగూకింది. తల్లి ఇలా అడిగింది. “నా ప్రియమైన యుల్యా, నేను చెప్పిన పని చేసావా?”

“లేదమ్మా! ఈ లేగదూడ నా పత్తిని బురదలో పడేసింది” అంది యుల్యా.

ఇది విన్న గయ్యాళి తల్లి కోపంతో ఊగిపోయింది. ముసలయ్య వద్దకి వెళ్ళి ఇలా అంది. “ఆ లేగదూడని చంపెయ్యి.”

“ఎందుకు?” అని అడిగాడు ముసలయ్య.

“నువ్వు ఆ లేగదూడని చంపలేదనుకో నిన్ను, నీ  మొదటి  భార్య



కూతురు గాల్యాని ఇంట్లోనుండి ఉన్నపళంగా వెళ్లగొడతాను” అంది గయ్యాళి ముసలమ్మ.

వేరే దారి లేక, లేగదూడని చంపటానికి ఒప్పుకున్నాడు ముసలయ్య.

ఇది విన్న గాల్యా పరిగెత్తుకుంటూ వెళ్ళి, కొట్టంలో ఉన్న లేగదూడను కౌగలించుకుని కన్నీరు పెట్టుకుంది.

లేగదూడ ఇలా అడిగింది “ఓ అందాల రాశీ! ఎందుకేడుస్తున్నావ్?” గయ్యాళి పిన్ని దుష్టపన్నాగాన్ని లేగదూడకి చెప్పింది గాల్యా. లేగదూడ ఇలా అంది “ఏడవకు! ముందు కళ్ళు తుడుచుకో, నేను చెప్పేది జాగ్రత్తగా విను. వాళ్లు నన్ను చంపిన తరువాత, నా కాలేయాన్ని తీసుకో, దానిలో నీకో బంగారు విత్తనం దొరుకుతుంది. ఆ బంగారు విత్తనాన్ని పెరట్లో నాటు. ఇదే నువు నాకిచ్చే వీడ్కోలు.”

లేగదూడ చెప్పినదాన్ని తూచా తప్పకుండా పాటించింది గాల్యా.

కొంతకాలానికి చిన్న విత్తనం నుండి మిల మిల మెరిసే బంగారు ఆపిల్ కాయలు కాసే ఓ మహా వృక్షం పుట్టింది. అదే బంగారు ఆపిల్ చెట్టు.

ఆ ఇంటి చుట్టు పక్కలకు ఎవరు వచ్చినా, ఆశ్చర్యంతో బంగారు ఆపిల్ చెట్టును చూసేవారు.

ఓ రోజు ఆ వీధిగుండా యుద్ధంనుండి తిరిగి వస్తున్న అందగాడైన సైనికుడు వెళ్తున్నాడు. బంగారు ఆపిల్ చెట్టుని చూసి తన గుర్రాన్ని ఆపాడు. కొమ్మలమీద ఉన్న బంగారు ఆపిల్ కాయలను తెంపుకోవాలని చేయి చాపాడు. “డింగ్–డింగ్–డింగ్” అని శబ్దం చేస్తూ కొమ్మలన్నీ అందనంత ఎత్తుకు సాగిపోయాయి. సైనికుడు తన చేతిని వెనక్కి తీసుకోగానే, కొమ్మలన్నీ

తిరిగి కిందకు చేరాయి. ఈ వింతని చూసి సైనికుడు ఆశ్చర్యపోయాడు.

కిటికీ లో నుండి ఈ దృశ్యాన్ని చూసింది గాల్యా. సైనికుడికి ఓ బంగారు ఆపిల్ కాయ తెంచి ఇస్తానని, పిన్ని అనుమతి కోరింది. అందుకు గయ్యాళి పిన్ని నానా తిట్లు తిట్టింది. గాల్యాని ఇంటిలో మంచం క్రింద దాచింది.

ఆమె సొంత కూతురైన యుల్యాని పంపింది. "ఏమో! ఆ అందగాడైన సైనికుడు తన ప్రియమైన కూతురు యుల్యా తో ప్రేమలో పడతాడేమో!" అని యుల్యా బంగారు ఆపిల్ చెట్టుకున్న ఆపిల్‌ని తెంపుదామని చేయి చాపింది.

"డింగ్–డింగ్–డింగ్" అని శబ్దం చేస్తూ కొమ్మలన్నీ అందనంత ఎత్తుకు సాగిపోయాయి. యుల్యా తన చేతిని వెనక్కి తీసుకోగానే, కొమ్మలన్నీ తిరిగి యధా స్థితికి చేరాయి. కోపంతో ఊగిపోతూ యుల్యా, చెట్టుపై తిట్ల వర్షం కురిపించింది.

ఉన్నట్టుండి ఓ కోడిపుంజు కంచెపై నుండి దూకి పెరట్లోకి ప్రవేశించింది. ఆ కోడిపుంజు ఇలా పాట పాడింది.

**కొక్కొరొక్కొ.... కొక్కొరొక్కొ....**
**మీరీ వింతను చూశారా?**
**మనసున్న ఓ మంచి పిల్లను**
**దాచేశారు మంచం కింద**
**పొగరుబోతు చెడ్డ పిల్లను**
**పంపించారు చెట్టు దగ్గరకు.**

**కొక్కొరొక్కో.... కొక్కొరొక్కో....**

**అందమైన ఆ సైనికుడిప్పుడు**

**పెళ్లాడే ఆ అమ్మాయెవ్వరు**

**కొక్కొరొక్కో.... కొక్కొరొక్కో....**

ఈ పాట విన్న సైనికుడు సరాసారి ఇంటిలోకి వెళ్ళాడు. మంచం క్రిందకు తొంగి చూసాడు. గాల్యాని చూసి తొలిచూపులోనే ప్రేమలో పడ్డాడు.

గాల్యా ఆపిల్ చెట్టు వద్దకు వెళ్ళగానే, కొమ్మలన్నీ ఊగాయి, బంగారు ఆపిల్ పండ్లు కుప్పగా ఆమె కాళ్ళ వద్ద పడ్డాయి. ఆమె వాటిని సైనికుడికి ఇచ్చింది.

సైనికుడు గాల్యాని గుర్రం పై ఎక్కించుకొని, తన ఇంటికి తీసుకెళ్ళి ఘనంగా పెళ్ళి చేసుకున్నాడు. వాళ్ళిద్దరూ ఆనందంగా జీవిస్తున్నారు. కొంతకాలానికి వాళ్లకు బొద్దుగా, ముద్దుగా ఉన్న ఓ బాబు పుట్టాడు.

ఈ సంగతులు విన్న గయ్యాళి ముసలమ్మ జీర్ణించుకోలేక పోయింది. ఎలాగైనా గాల్యాకి చెడు చేయాలని పన్నాగం పన్నింది.

ఓ రోజు గయ్యాళి ముసలమ్మ తన సొంతకూతురు యుల్యా ని పిలిచి ఇలా చెప్పింది. "నా ప్రియమైన యుల్యా! మీ అక్క గాల్యా వద్దకి వెళ్ళి పలకరించు. ప్రేమను నటించు. నదిలో స్నానం చేద్దాం రా అని పిలుచుకొని వెళ్ళి గాల్యాను నీటిలో ముంచి చంపెయ్యి".

"సరేనమ్మా" అంది దుష్టురాలైన యుల్యా.

యుల్యా అక్క ఇంటికి వెళ్ళింది. ప్రేమను ఒలకపోసింది. 'నదిలో స్నానం చేద్దాం రా అక్కా' అని పిలిచింది. చెల్లి మాటలు నమ్మింది గాల్యా.

తనతో కలిసి నది వద్దకి వెళ్ళింది.

"అక్కా! ఈ రాయి మీద కూర్చో. నీ వీపు రుద్దుతాను." అంది యుల్యా. గాల్యా రాయి మీద కూర్చుంది. అక్క వీపు రుద్దుతున్నట్టు నటిస్తూ తనని నీటిలోకి తోసేసింది జిత్తులమారి చెల్లి. గాల్యా నదిలోని ఓ బండకింద పడిపోయింది. చెల్లి పరిగెత్తుకుంటూ తన ఇల్లు చేరింది. సైనికుడు, ఆతని తల్లిదండ్రులు పొద్దుపోయేదాకా గాల్యా కోసం ఎదురు చూసారు. కానీ ఆమె జాడ తెలియలేదు.

బుజ్జిబాబు గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. ఆ పిల్లవాడి ఏడుపుని ఆపటం ఎవ్వరి వల్లా కావట్లేదు. పొరుగింటావిడ ఆ బాబుని చంకలో ఎత్తుకుని నది వద్దకు తీసుకెళ్ళి ఇలా అంది.

**ప్రియమైన "గాల్యా ! అందమైన గాల్యా ! నీ కోసం బాబు ఏడుస్తున్నాడు.**

**బాబుకి ఆకలి వేస్తోంది. కోళ్ళు నిద్రపోతున్నాయి.**

**బాతులు నిద్రపోతున్నాయి.. నిద్ర రాని నీ బాబు మాత్రం,**

**'అమ్మ' అని ఏడుస్తున్నాడు."**

నదిలో నుండి గాల్యా ఇలా అంది.

**"నేను బండరాయి కిందున్నాను**

**నా చుట్టూ నీళ్ళున్నాయి**

**బాబు దగ్గరకు రాలేను".**

నదిలో నుండి తల్లి ఇలా అంది.

**"నా బంగారు తండ్రీ, నా చిట్టికన్నా!**

**నీ ఏడుపు నే వినలేను.**

**నే వస్తున్నా నీకోసం."**

తల్లి గొంతు విన్న పిల్లవాడు, ఇంకా బిగ్గరగా ఏడ్చాడు.

నదిలో నుంచి గాల్యా బయటకు వచ్చింది. పిల్లవాడికి తినిపించింది. ప్రేమగా ముద్దాడింది. పిల్లవాడిని నిద్రపుచ్చింది. తిరిగి నదిలోకి వెళ్ళిపోయింది. పొరుగింటావిడ పిల్లవాడిని తీసుకుని ఇల్లు చేరింది. జరిగిన కథంతా సైనికుడికి చెప్పింది.

తరువాత రోజు ఉదయం, సైనికుడు, బాబుని ఎత్తుకుని బంగారు ఆపిల్ పండుని తీసుకుని నది వద్దకు వెళ్ళాడు.

**"ఓ నా గాల్యా, ప్రియమైన గాల్యా !**

**మన బాబు ఏడుస్తున్నాడు.**

**వాడికి ఆకలి వేస్తోంది**

**కోళ్ళు నిద్రపోతున్నాయి.**

**బాతులు నిద్రపోతున్నాయి.**

**కానీ బాబు మాత్రం నిద్రరాక,**

**"అమ్మా అని ఏడుస్తున్నాడు."**

నదిలో నుండి తల్లి ఇలా అంది.

**"నా బంగారు తండ్రీ, నా చిట్టికన్నా!**

**నీ ఏడుపు నే వినలేను.**

**నే వస్తున్నా నీకోసం."**

తల్లి గొంతు విన్న పిల్లవాడు, బిగ్గరగా ఏడ్చాడు.

నదిలో నుంచి గాల్యా బయటకు వచ్చింది. పిల్లవాడికి తినిపించింది. ప్రేమగా ముద్దాడింది. పిల్లవాడిని నిద్రపుచ్చింది. సైనికుడు బంగారు ఆపిల్ పండుని తన భార్యకి ఇచ్చాడు.

ఆమె ఆపిల్ పండుని కొంచెం కొరికి తినింది. హఠాత్తుగా ఆమెకు పట్టిన దెయ్యం వదిలింది. తన భర్తను పలకరించింది. వాళ్ళు క్షేమంగా ఇల్లు చేరారు. వాళ్ళు సుఖంగా ఆనందంగా జీవించారు.

ఇంకెప్పుడూ గయ్యాళి పిన్నిని, ఆమె కూతురు యుల్యాని వాళ్ళ ఇంటి దరిదాపులకి కూడా రానివ్వలేదు.

| | | |
|---|---|---|
| English Title | : | The Golden apple tree |
| Writer | : | A Bylo russian folk fairy tale |
| English Translation | : | Walter May |
| Illustration | : | A. Los |



# తెల్ల పావురం

## దగిస్థాన్ జానపద కథ

## అట్‌కాయ్

అనగనగా ఓ కొండవాలు లో ఓ ఊరు ఉండేది. ఆ ఊరిలో ప్రజలు గొర్రెల్ని మేపుకుంటూ, వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. నాన అనే మంచి అమ్మాయి జూనా ఆనే చెడ్డ అమ్మాయి అదే ఊర్లో నివసించేవారు. వీరిద్దరు ఇరుగు పొరుగు వాళ్ళు.

నానా ప్రతీ రోజు కొండ వాలులో ఉన్న నీటిని కూజాలో నింపుకుని, ఊరిలోని ప్రజలకు తెచ్చిచ్చేది. నానాకు ఇద్దరు పిల్లలు. అందరికి సాయంచేసే మనస్తత్వం

ఆమెది. జూనా ఏ పని చెయ్యకుండా, నానా మీద అందరికీ చాడీలు చెప్పేది. నానా అంటే ఎంతో అసూయ జూనాకు. జూనా స్వార్ధపరురాలు.

ఒక రోజు నానా కూజాను తీసుకుని కొండవాలు లోని నీటి పాయ వద్దకి వెళ్ళింది. అక్కడ కాలి మీద గాయాలతో ఒక తెల్ల పావురం కనిపించింది. దాన్ని జాగ్రత్తగా ఇంటికి తీసుకువచ్చింది.

కాలి గాయానికి కట్టు కట్టి, పావురానికి గింజలు తినిపించి సేవలు చేసింది. రోజులు గడిచే కొద్ది కాలి గాయం  నయం కాసాగింది.

ఆ పావురాన్ని చూడటానికి చుట్టుపక్కల పిల్లలు, రోజూ నానా ఇంటికి వచ్చేవారు. పిల్లలు దానికి నీరు తాగించేవారు, గింజలు వేసేవారు. పావురం ముక్కుని, తలని ప్రేమగా ముద్దాడేవారు. ఈ సంగతి ఊరంతా పాకింది. దుర్బుద్ధి గల జూనా కి ఈ సంగతి తెలిసింది. వెంటనే నానా ఇంటికి వచ్చి ఇలా అంది.

"నా ప్రియమైన నానా! నాకు పావురాలంటే చాలా ప్రేమ, నాకు ఈ తెల్లటి పావురాన్ని అమ్ముతావా? నీకు ఎంత డబ్బు కావాలన్నా ఇస్తాను".

నానా ఘాటుగా ఇలా సమాధానమిచ్చింది.

''జూనా, నేను ఈ పావురాన్ని అమ్మను. నువ్వు దానిని చంపాలనుకుంటున్నావు. నా లాగే ఈ తెల్ల పావురానికి కూడా  పిల్లలు ఉండవచ్చు. ఆ బుజ్జి పావురపు పిల్లలని నేను అనాథల్ని చేయలేను. నీ పాపిష్టి డబ్బు నీ వద్దే ఉంచుకో."

కొన్ని రోజుల తరువాత ఆ పావురం కాలి గాయం నయమై,

ఆరోగ్యంగా తయారైంది. తన తెల్లటి రెక్కలను 'టప్'  'టప్' లాడిస్తూ స్వేచ్ఛగా మేఘాల్లోకి ఎగిరిపోయింది.

ఈ దృశ్యం చూసి నానా, పిల్లలు, ఇరుగు పొరుగువారు ఎంతో సంతోషించారు. ఆనందంతో చప్పట్లు కొట్టారు. కానీ జూనా మాత్రం ఈర్ష్యతో కుళ్ళుకుంది.

పావురం అలా కొండలపై, పచ్చిక మైదానాలపై, అడవులపై ఎగురుతూ ఎగురుతూ చివరకి తన గూడు చేరింది. పావురం పిల్లలు గూటిలో క్షేమంగా ఉన్నాయి. వాటికి గింజలను తినిపించి, కబుర్లు చెప్పింది. గాల్లో ఎలా ఎగరాలో నేర్పింది.

కొన్ని రోజుల తరువాత అది ఆకాశంలో ఎగురుతూ ఉండగా, దానికి నానా గుర్తుకొచ్చింది. నానా చేసిన సాయానికి ప్రత్యుపకారం చేయాలని నిర్ణయించుకుంది.

తరువాత రోజు ఇంకా సూర్యుడు నిద్ర లేవలేదు. పావురం ఎగురుతూ నానా వాళ్ళ ఊరి వైపు వచ్చింది. సూర్య కిరణాలు పావురం ముక్కుమీద పడి మిల మిలా మెరుస్తున్నాయి. పావురం నానా కోసం వెదికింది. ఆకాశం లో పావురాన్ని గుర్తుపట్టిన పిల్లలు కేరింతలు కొట్టారు. చివరకి పావురానికి నానా కనిపించింది.

పావురం ఇలా అంది. "నన్ను కాపాడిన ఓ నానా! నీకు బహుమతి తెచ్చాను. ఈ విత్తనం నీ కోసమే" పావురం తన ముక్కున ఉన్న విత్తనాన్ని విడిచి పెట్టింది.



గాలిలో నుండి కిందకు పడుతున్న విత్తనం ఇలా పాడసాగింది.

**మామూలు పుచ్చగింజను కాదు నేను.**

**మంచులో పుట్టాను. నా మనసు ఎరుపు.**

**నా దేహం ఆకుపచ్చ. ఎన్నెన్నో వింతలు నాకే సాధ్యం!"**

విత్తనం సరిగ్గా నానా ఒళ్ళో పడింది. నానా విత్తనాన్ని జాగ్రత్తగా చేతిలోకి తీసుకుంది.

ఇంటి పెరట్లో ఓ మూలన గుంత తవ్వి విత్తనాన్ని నాటింది.

రోజు నీళ్ళు పోస్తూ దాన్ని జాగ్రత్తగా చూసుకుంది. కొన్ని రోజులకు అది ఓ పెద్ద పుచ్చ పాదులా మారింది. దళసరి పచ్చటి ఆకులతో మిల మిలా మెరిసేది.

అది ఎన్నో పసుపు పచ్చ పూవుల్ని పూసింది. వాటిలో నుండి ఓ బుజ్జి పూవు, పచ్చ, నలుపు చారలు గల ఓ పెద్ద పుచ్చకాయ గా మారింది.

ఆ పెద్ద పుచ్చకాయ పక్వానికి వచ్చింది. నానా దాన్ని తెంచి, బల్లపై పెట్టింది. జునాని, ఇరుగు పొరుగు వాళ్ళని, పిల్లల్ని పిలిచింది, కత్తితో పుచ్చకాయను కోసింది.

దాని పొట్టలో ఎర్రగా ఉన్న విత్తనాలు కనిపించాయి. ముక్కల్ని తలా ఒకటి పంచింది. అందరూ వాటిని తిన్నారు. అవి అద్భుతమైన రుచిగా ఉన్నాయి. ఇంత రుచికరమైన పుచ్చకాయను ఊరి జనాలు, వాళ్ళ జీవిత కాలంలో తినలేదు.

విత్తనాలు బంగారు వర్ణంలో మెరుస్తున్నాయి. విత్తనాలు ఉన్నట్టుండి గాల్లోకి ఎగిరి ఇలా పాడటం మొదలు పెట్టాయి.

మొదటి విత్తనం ఇలా పాడింది.

**“నేను బంగారు తీగలతో చేసిన**

**పట్టుగౌనుగా మారతాను.**

**నానా చేసిన మేలుకు**

**బహుమానం నేనే..”**

మొదటి విత్తనం బంగారు తీగలతో చేసిన పట్టుగౌనుగా మారిపోయింది. ఇది చూసినా నానా, జూనా, పిల్లలు, ఊరివాళ్ళు ఆశ్చర్యపోయారు. రెండవ విత్తనం ఇలా పాడసాగింది.

**“నేను అద్దంలా మారతాను.**

**మీరు నవ్వితే నేను నవ్వుతాను.**

**మీరు ఏడిస్తే నేను ఏడుస్తాను.**

**మీరేం చేస్తే, అచ్చం అలానే చేస్తాను.”**

ఇలా అని రెండవ విత్తనం అద్దంలా మారిపోయింది.

మూడవ విత్తనం ఇలా పాడసాగింది.

**“నేను ముత్యాల హారంలా మారతాను.**

**పడుచు వాళ్ళు ధరించవచ్చు.**

**ముసలి వాళ్ళు ధరించవచ్చు.**

**నన్ను ఎవరు మెడలో వేసుకున్నా**

**వాళ్ళు అందంగా కనిపిస్తారు.”**

ఇలా అని మూడవ విత్తనం చక్కటి ముత్యాల హారంలా మారిపోయింది.

ఇది చూసిన జూనా ఇలా అంది.

"నానా ఆ ముత్యాల హారంని నాకిచ్చేయి. నేను నీ తోబుట్టువులాంటి దాన్ని". జూనా మాటలు నానా పట్టించుకోలేదు.

నాలుగవ విత్తనం ఓ శాలువాలా మారిపోయింది.

ఐదవ విత్తనం రంగు రంగుల బొమ్మలున్న చక్కటి పిల్లల పుస్తకంలా మారిపోయింది.

ఆరవ విత్తనం పాటలు పాడే బొమ్మలా మారిపోయింది. ఆ బొమ్మ వీనుల విందుగా పాట పాడింది.

ఏడవ విత్తనం రెక్కల గుర్రంగా మారిపోయింది. దాన్ని చూసి పిల్లలు చప్పట్లు కొట్టారు.

ఎనిమిదవ విత్తనం పెద్ద తోటలా మారిపోయింది. ఆ తోటలోని పూవులన్నీ సువాసనల్ని వెదజల్లాయి.

తొమ్మిదొవ విత్తనం రాజభవనంలా మారిపోయింది.

పదవ విత్తనం ఓ వెండి పావురంలా మారిపోయింది. ఆ పక్షి రాజభవనంపై కూర్చుంది.

రాజభవనం మీద ఓ గడియారం ఉంది. అది టక్ టక్ అని శబ్దం చేస్తూ, గడిచి పోయే ప్రతీక్షణాన్ని ఊరి ప్రజలకు గుర్తు చేస్తుంది.

గడియారం ఇలా పాడటం మొదలు పెట్టింది.

**"చిట్టి పొట్టి చిన్నారులు!**

**చింతల్లేని చిన్నారులు!**

**మీరంతా అల్లరి చేయాలి.**

**పూవులు చక్కగా పూయాలి.**

**పెద్ద చెట్లుగా మారాలి.**

**యుద్ధమేఘాలు పోవాలి.**

**జగాన శాంతి నిండాలి."**

**డింగ్... డింగ్... డింగ్... డింగ్**

**డింగ్... డింగ్... డింగ్... డింగ్...**

ఆనందంతో పిల్లలు వంత పాడటం మొదలు పెట్టారు. ఈ దృశ్యాన్ని చూసిన జూనా అసూయతో కుళ్ళుకుంది.

వసంత కాలం వచ్చింది. మంచు కురవటం మొదలైంది. చెట్లు ఆకులు చిగురించాయి.

ఓ రోజు జూనా వెండి పావురాన్ని బంధించింది. దాని కాలికి గాయం చేసింది. గుడ్డతో కట్టు కట్టింది. పావురం కన్నీరు కార్చింది. కోపంతో దాని కళ్ళు ఎర్రబడ్డాయి. జూనా రోజు దానికి కొన్ని గింజలు పెట్టేది.

ఓ నెల గడిచింది. ఈ నెల రోజులు, ప్రతీ రోజూ జూనా తనలో తాను ఇలా అనుకొనేది. "వెండి పావురం నాకు విత్తనం బహుమతిగా ఇస్తే, నేను దాన్ని నాటి, నీరు పోసి పెంచుతాను. పుచ్చకాయ నుండి వచ్చే గింజలు, నానా బహుమతుల్ని, తిరిగి నాకు ఇస్తాయేమో, అపుడు నేను గోడపై గడియారాన్ని పగలగొడతాను. పిల్లల బహుమతుల్ని పగలగొడతాను. అందరికి తగిన శాస్తి చేస్తాను."

మెల్లగా వెండి పావురం కాలి గాయం నయమైంది. అది తన రెక్కల్ని "టప్ టప్" లాడిస్తూ ఎగిరిపోయింది. తన గూడుని చేరింది. ఆకలికి

తట్టుకోలేక దాని పిల్లలు మరణించాయి. బాగా ఏడ్చింది. కోపంతో రగిలిపోయింది. జూనాకి తగిన శాస్తి చేయాలని నిర్ణయించుకుంది.

తరువాతి రోజు, సూర్యుడు ఒళ్ళు విరుచుకుని నిద్ర లేచాడు. వెండి పావురం ఎగురుతూ, ఊరి వైపు వచ్చింది.

జూనా ఇంటి వద్దకు వచ్చి ఇలా అంది.

"జూనా నీకు బహుమతి తెచ్చాను. ఈ విత్తనం నీ కోసమే."

పావురం తన ముక్కున వున్న విత్తనాన్ని విడిచిపెట్టింది. విత్తనం సరిగ్గా జూనా ఒళ్ళో పడింది.

జూనా పనివాళ్ళని పిలిచి ఇలా అంది. "ఈ విత్తనాన్ని పెరట్లో నాటండి. రోజూ నీళ్ళు పోయండి. జాగ్రత్తగా పెంచండి". సరే అన్నారు పనివాళ్ళు.

కొన్ని రోజులకు అది ఓ పెద్ద పుచ్చ పాదులా మారింది. దళసరి పచ్చటి ఆకులతో మిలమిలా మెరిసేది. అది ఎన్నో పసుపు పచ్చ పువ్వుల్ని పూసింది. వాటిలో నుండి ఒకే ఒక్క పువ్వు, పచ్చ నలుపు చారలు గల ఓ పెద్ద పుచ్చకాయగా మారింది.

ఆ పెద్ద పుచ్చకాయ పక్వానికి వచ్చింది. దాన్ని తెంచి వెండి పళ్ళెంలో పెట్టింది. కత్తితో పుచ్చకాయ కోసింది. దాని పొట్టలో మంచుబిందువుల్లా తెల్లగా ఉన్న విత్తనాలు కనిపించాయి. వాటిపై పసుపు నలుపు చారలు ఉన్నాయి.

విత్తనాలు ఉన్నట్టుండి గాల్లోకి ఎగిరాయి. పసుపు నలుపు చారలున్న రాక్షస పురుగుల్లా మారాయి. జూనాని కరవటం మొదలు పెట్టాయి. జూనా

పారిపోటానికి ప్రయత్నించింది. కాని అవి పెద్ద సైన్యంలా జూనా వెంటబడ్డాయి. జూనా మెడని చేతుల్ని బంధించాయి. పారిపోడానికి ప్రయత్నిస్తున్న జూనా గౌను ను పిల్లి లాగింది.

రాక్షస పురుగులు జూనాను విపరీతంగా కుట్టాయి. భయంతో జూనా ఉన్నట్టుండి ఓ ఎలుకలా మారిపోయింది.

ఈ దృశ్యాన్ని చూసిన పిల్లి ఆనందంతో ఇలా పాడసాగింది.

**పిల్లలూ!**
**"నేను పిల్లిని**
**మూసిన తలుపులు తెరిచేస్తా**
**తెరిచిన తలుపులు మూసేస్తా**
**ఎలుకల్ని వేటాడేస్తా**
**వాడి పళ్ళతో కొరికేస్తా**
**సూది గోళ్ళతో రక్కేస్తా**
**పావురాన్ని హింసించిన జూనా**
**భరతం నేనే పట్టేస్తా**
**తగిన శాస్తిని చేసేస్తా"**

పాట పూర్తి అవగానే, పిల్లి, ఎలుకగా మారిన జూనాని వేటాడి శుభ్రంగా తినేసింది. ఈ దృశ్యాన్ని చూసి వెండి పావురం ఆనందించింది.

ఇలా కథ ముగిసింది.

చిన్నారి స్నేహితులూ ! చుశారా మంచి వాళ్ళకి మంచి, చెడ్డ వాళ్ళకి చెడు ఎలా జరుగుతుందో. మీరు పెరిగి పెద్దవాళ్ళయ్యాక మంచి పౌరులుగా సమాజానికి మేలు చెయ్యాలి మరి... !

| | | |
|---|---|---|
| English Title | : | The White Dove( A fairy tale from Daghestan) |
| Writer | : | Atkai |
| English Translation | : | Walter May |
| Illustration | : | Vera Khlebnikova |



# జాలరి - బంగారు చేప

## అలెగ్జాండర్ పుష్కిన్

అనగనగా ఓ సముద్రపు ఒడ్డున ముసలి దంపతులు చిన్న గుడిసెలో నివసించేవారు. వాళ్ళు చాలా పేదవాళ్ళు. వాళ్ళు ముప్పై మూడు వేసవి కాలాలు, ముప్పై మూడు శీతాకాలాలు అక్కడే జీవించారు. ఈ మూడు దశాబ్దాల కాలంలో, ముసలాయన చేపలు పడుతూ ఉండేవాడు. ముసలావిడ ఇంటిపనులు చేసుకోవటం, వలలు అల్లడం, పాడైపోయిన వలల్ని బాగుచేయటం చేసేది.

ఒకరోజు ముసలాయన చేపల

వేటకై, వలని సముద్రంలోకి వదిలాడు. పైకి లాగి చూసేసరికి, వలంతా బురద మట్టి మాత్రమే ఉంది. చేపలేమీ పడలేదు.

రెండోసారి వలని సముద్రంలోకి వదిలాడు. ఈ సారి వల కొంచెం చిరిగింది. కాని చేపల జాడలేదు.

మూడోసారి వలని సముద్రంలోకి వదిలాడు. ఈ సారి వలలో ఒకే ఒక చేప పడింది. అది సాధారణమైన చేప కాదు. దేదీప్యమైన కాంతితో మెరిసిపోతున్న 'బంగారు చేప'. బంగారు చేప ఇలా బ్రతిమలాడింది "ఓ ముసలాయనా! నన్ను సముద్రంలో వదిలెయ్యి. నీకెంత డబ్బు కావాలన్నా ఇస్తాను. నువ్వు ఏ వరం కావాలన్నా ఇస్తాను."

ఇది విన్న ముసలాయన ఆశ్చర్యపోయి, భయపడ్డాడు. ఎందుకంటే తను ముప్పై సంవత్సరాలుగా చేపల వేట సాగిస్తున్నాడు. మాట్లాడే చేప ఇంతవరకు అతడి  కంటబడలేదు.

అతడు జాగ్రత్తగా బంగారు చేపను బయటకుతీసి ఇలా అన్నాడు.

"ఓ బుజ్జి బంగారు చేపా! నువ్వు ఇస్తానన్న డబ్బు నాకొద్దు. నిన్ను సముద్రంలోకి వదులుతాను. జాగ్రత్తగా మీ ఇల్లు చేరు. స్వేచ్ఛగా హాయిగా జీవించు."

బంగారు చేపను సముద్రంలోకి వదిలాడు ముసలాయన. చేప ముసలాయనకు కృతజ్ఞతలు చెప్పి, నీలి సాగరంలో మాయమైంది.

ఇంటికెళ్ళిన ముసలాయన తన భార్యతో ఇలా అన్నాడు.

"ఈ రోజు ఓ అద్భుతం జరిగింది. నా వలలో ఓ బంగారు చేప పడింది. దాన్ని వదిలితే, ఎంత డబ్బు కావాలన్నా ఇస్తాను అంది. ఏ వరం కోరుకున్నా ఇస్తానంది. కానీ నేను జాలితో దాన్ని సముద్రంలో వదిలేసాను. డబ్బు, వరం రెండూ అడుగలేదు. చూడు నేనెంత మంచి పని చేసానో".

ముసలమ్మ ఆయనపై తిట్ల దండకం మొదలు పెట్టింది. "ఓరి అమాయకుడా! వెర్రిబాగులోడా! బంగారపుచేప డబ్బు కోరుకోమంటే వద్దన్నావు. వరం కోరుకోమంటే వద్దన్నావు. పాత్ర అయినా అడగాల్సింది కదా! మన ఇంట్లో ఉన్న పాత్ర ఇప్పటికే పాడయింది గదా!"

సరే అని ముసలాయన సముద్ర తీరానికి వెళ్ళాడు. సముద్రపు అలలు ప్రశాంతంగా కదులుతున్నాయి.

చేపని బిగ్గరగా పిలిచాడు.

బంగారు చేప ఈదుకుంటూ వచ్చింది. "ఏంటి ముసలాయన పిలిచావ్! ఏం కావాలి? అని అడిగింది. ముసలాయన ఇలా అన్నాడు.

"గౌరవనీయులైన బంగారు చేపగారు! నన్ను క్షమించండి. నా భార్య నన్ను చెడా మడా తిట్టింది. మా ఇంట్లో ఉండే పాత్ర పాడైపోయింది. కాబట్టి చేపలు లేదా బట్టలు ఉతికే కొత్త పాత్రను తను కావాలంటోంది."

బంగారు చేప ఇలా జవాబిచ్చింది "బాధపడకు, ఇంటికి వెళ్ళు, భగవంతుడు నీతోనే ఉంటాడు. నీవు కోరుకున్న వంటపాత్ర నీకు లభిస్తుంది."

మునలాయన తిరిగి ఇంటికి వెళ్ళాడు. అక్కడ ఓ కొత్త పాత్ర ఉంది. ముసలామె దాన్ని చూసి ఆనందించక పోగా, ఇలా తిట్టడం మొదలు పెట్టింది.

“ఓ అమాయకుడా! వెర్రిబాగులోడా! వంటపాత్రని ఏం చేసుకుంటాము? తిరిగి బంగారు చేప వద్దకు వెళ్ళి, ఓ మంచి ఇల్లు కావాలని ప్రార్థించు.”

ముసలాయన తిరిగి సముద్ర తీరానికి వెళ్ళాడు. ఈ సారి సముద్రపు అలలు కొంచెం అలజడిగా కనిపించాయి.

బంగారు చేపని బిగ్గరగా పిలిచాడు.

బంగారు చేప ఈదుకుంటూ వచ్చింది. “ఏంటి ముసలాయన పిలిచావ్! ఏం కావాలి నీకు?” అని అడిగింది.

ముసలాయన ఇలా అన్నాడు. గౌరవనీయులైన బంగారు చేపగారూ! నన్ను క్షమించండి. నా భార్య నన్ను మరలా తిట్టింది. తనకి ఉండటానికి మంచి ఇల్లు కావాలంట”.

బంగారు చేప ఇలా జవాబిచ్చింది. “బాధపడకు, ఇంటికి వెళ్ళు, భగవంతుడు నీతోనే ఉంటాడు. నీవు కోరుకున్న మంచి ఇల్లు నీకు లభిస్తుంది.”

ముసలాయన తిరిగి ఇంటికి వెళ్ళాడు. ఆశ్చర్యం! గుడిసె స్థానంలో ఓ మంచి ఇల్లు ఉంది. అది ఇటుకలతో కట్టినది, చెక్క కిటికీలు ఉన్నాయి. ప్రహరీ గోడ కూడా ఉంది. ఓ కిటికీ వద్ద తన భార్య కూర్చుని ఉంది. ముసలాయనని చూడగానే ఆమె ఇలా తిట్టడం మొదలు పెట్టింది. “ఓ



అమాయకుడా! వెర్రిబాగులోడా! మంచి ఇల్లు ఉంటే సరిపోతుందా? నాకు ఈ పేదరికం వద్దు. గృహిణిగా ఉండి అలసిపోయాను. నేను డబ్బున్న యజమానురాలిని కావాలనుకుంటున్నా, కాబట్టి నువ్వు తిరిగి వెళ్ళి, బంగారు చేపని నా కోరిక కోసం ప్రార్థించు."

ముసలాయన తిరిగి సముద్ర తీరానికి వెళ్ళాడు. ఈ సారి సముద్రం భీకరంగా నురుగలు కక్కుకుంటూ ఉగ్రంగా కనిపించింది.

బంగారు చేపని బిగ్గరగా పిలిచాడు.

బంగారు చేప ఈదుకుంటూ వచ్చింది. "ఏంటి ముసలాయన పిలిచావ్! మళ్ళీ ఏం కావాలి నీకు?" అని అడిగింది. ముసలాయన ఇలా అన్నాడు."

"గౌరవనీయులైన బంగారు చేపగారూ! నన్ను క్షమించండి. నా భార్య నన్ను మరలా తిట్టింది. తను డబ్బున్న యజమానురాలు కావాలనుకొంటోంది. ఇల్లంతా నౌకర్లు, సేవకులు కావాలంది."

బంగారు చేప ఇలా జవాబిచ్చింది. "బాధపడకు, ఇంటికి వెళ్ళు, భగవంతుడు నీతోనే ఉంటాడు. నీ కోరిక నెరవేరుతుంది."

ముసలాయన తిరిగి ఇంటికి వెళ్ళాడు. తన ఇల్లు స్థానంలో ఓ పాలరాతి భవనం ఉంది. తన భార్య తెల్లటి మెట్లపై  నిల్చుని ఉంది. ఆమె చుట్టూ సేవకులు, నౌకర్లు వినయంగా నిలుచున్నారు. ఆమె చాలా ఖరీదైన బట్టలు ధరించి ఉంది. మెడలో ముత్యాల దండలు మెరుస్తూ ఉన్నాయి. చేతి వేళ్ళకు బోలెన్ని ఉంగరాలు ఉన్నాయి. ఆమె తీరు వేరేగా ఉంది.

"ఇపుడు నీ కోరికలు తీరినట్లే కదా" అన్నాడు ముసలాయన. పోయి నీ పని చూసుకో అని విసుక్కుంది. యజమానురాలిలా మారిన ముసలావిడ.

మెల్లగా ఓ వారం గడిచింది. మరో వారం గడిచింది. ముసలామె గర్విష్టిగా మారిపోయింది. ఓ రోజు తన భర్తతో ఇలా అంది. నాకు యజమానురాలిగా ఉండటం అంత ఆసక్తిగా అనిపించటం లేదు. నాకు ఈ దేశానికి రాణి కావాలనుంది. నీవు సముద్రతీరానికి వెళ్ళి, బంగారు చేపను ప్రార్థించి నా కోరిక నెరవేరేలా చూడు."

ముసలాయన చేపని తిరిగి ప్రార్థించాడు.

బంగారు చేప ఇలా జవాబిచ్చింది. "బాధపడకు, ఇంటికి వెళ్ళు, భగవంతుడు నీతోనే ఉంటాడు. నీ కోరిక నెరవేరుతుంది".

ముసలాయన ఇంటికి వెళ్ళాడు. తన ఇంటి స్థానంలో ఓ రాజభవనం వెలిసింది. తన భార్య 'రాణి' లా సింహాసనం పై ఠీవీగా కూర్చుని ఉంది. కత్తులు, బల్లేలు పట్టుకుని సైనికులు ఆమెకు కాపలాగా ఉన్నారు. పట్టణ పుర ప్రముఖులు వినయంగా ఆమె వద్ద నిలుచుని ఉన్నారు.

ముసలాయన ఒంగి నమస్కరించాడు. "రాణి గారు! నమస్కారం. మీ కోరికలన్నీ నెరవేరాయని ఆశిస్తున్నాను" అన్నాడు.

ఆతని మాటలు రాణి పట్టించుకోలేదు. ముసలాయన్ని తన్ని తరిమేయండి అని ఆజ్ఞాపించింది. భటులు ముసలాయన్ని కొట్టి, రాజ ప్రసాదం నుండి బయటకు గెంటివేసారు.

మెల్లగా ఓ వారం గడిచింది. మరో వారం గడిచింది. ముసలామెకు ఎక్కడలేని గర్వం, పొగరు అలవాటయ్యాయి. ముసలాయనని తీసుకురమ్మని ఆదేశించింది. సైనికులు పట్టణం అంతా వెతికి ముసలాయనని పట్టుకున్నారు. రాణి ముందు ప్రవేశ పెట్టారు.

ఆమె ఇలా అంది.

"నాకు పట్టణానికి రాణిగా ఉండటం ఆసక్తిగా అనిపించటం లేదు. ఆ నీలి సముద్రం మధ్యలో నాకో రాజ భవనం కావాలి. నేను సముద్రానికి రాణిని కావాలి. ఆ బంగారు చేప నా సైనికుడు అవ్వాలి. నా ఆజ్ఞలు శిరసావహించి, నేను ఏది కోరుకుంటే అది నాకు దక్కేలా చూడాలి, కాబట్టి నువ్వు సముద్రం వద్దకు వెళ్ళి బంగారు చేపని క్షమాపణలు అడిగి, నా కోరిక నెరవేరేలా ప్రార్థించు."

ఇది విన్న ముసలాయన హతాశుడయ్యాడు. ఒక్క మాట కూడా తిరిగి మాట్లాడలేదు. బాధగా సముద్రం వైపు పయనమయ్యాడు.

సముద్రం అల్లకల్లోలంగా ఉంది. అలలు ఉగ్రంగా ఎగసిఎగసి పడుతున్నాయి.

బంగారు చేపని బిగ్గరగా పిలిచాడు.

బంగారు చేప ఈదుకుంటూ వచ్చింది. "ఏంటి ముసలాయన పిలిచావ్! ఏం కావాలి?" అని అడిగింది. ముసలాయన ఇలా అన్నాడు.

"గౌరవనీయులైన బంగారు చేపగారూ! నన్ను క్షమించండి. దుర్బుద్ధి గల నా భార్యను ఏం చేయమంటారు. ఆమెకు పట్టణపు రాణిగా ఉండటం ఆనందం ఇవ్వటంలేదట. ఈ సముద్రంలో ఓ రాజ భవనం కావాలట. ఈ

సముద్రానికి ఆమె రాణి కావాలట. మీరు ఆమెకు సేవకుడిగా పని చేస్తూ ఆజ్ఞలు పాటిస్తూ ఆమె కోరిన కోరికలన్నీ తీర్చాలంట."

బంగారు చేప ఏమి మాట్లాడలేదు. అది దాని తోకను ఊపుతూ సాగరగర్భంలో మాయమైంది. బంగారు చేప సమాధానం కోసం ఎదురు చూసాడు ముసలాయన. చివరకి పట్టణం లోని రాణి కోట వైపు బయలుదేరాడు.

ఆశ్చర్యం! తీరా అక్కడ చూస్తే తన పాత పూరి గుడిసె ఉంది. చిరిగి మాసిపోయిన బట్టలతో తన భార్య ఉంది. ఆమె ముందు విరిగిన పాత పాత్ర ఉంది.

| | | |
|---|---|---|
| English Title | : | The Fisher man and the gold fish |
| Writer | : | Alexander Pushkin |
| English Translation | : | Louis Zellikoff |
| Illustration | : | Bories Dekhteryow |



# సముద్ర తీరంలో పిల్లవాడు

## మాక్సీమ్ గోర్కీ

అనగనగా ఒక ఊరిలో 'ఇవాస్కా' అనే చిన్న పిల్లవాడు ఉండేవాడు. అది సముద్రతీర గ్రామం. ఒకరోజు పిల్లవాడు, సముద్రపు అంచున కూర్చుని చేపలు పట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. గేలానికి ఒక్క చేప కూడా పడలేదు. అసలే అది వేసవి కాలం. ఎండ మండిపోతుంది. ఎంతకీ చేపలు పడకపోయేసరికి పిల్లవాడు చాలా అసహనంగా వున్నాడు. "ధాం..." హఠాత్తుగా పిల్లవాడు పట్టు తప్పి సముద్రంలో పడిపోయాడు.

ఆశ్చర్యకరమైన విషయమేమి టంటే, పిల్లవాడు నీటితో యుద్ధం చేసి,

సముద్రం బయటకు రావడానికి ప్రయత్నించలేదు. తాపీగా, నెమ్మదిగా ఈదుకుంటూ సముద్రపు అడుగువైపుకు వెళ్ళాడు. అక్కడ నాచుతో కప్పబడిన ఓ బండ రాయిపై కూర్చొని, చుట్టూ చూశాడు. అతనికి చుట్టుప్రక్కల చాలా వింతలు కనిపించాయి.

ఎర్రటి నక్షత్ర చేప తన ముందు కదుల్తోంది. సముద్ర రొయ్య రాళ్ళపై నుండి వెళ్తుంది. ఎండ్రకాయ దాని ప్రక్క నుండి వెళ్తుంది. రంగురంగుల చేపలు గుంపులుగుంపులుగా వెళ్తున్నాయి. వాటిని చూస్తుంటే విరగ పండిన చెర్రీ పండ్ల తోట గుర్తుకు వస్తుంది. సముద్ర లిల్లీలు రెపరెపలాడుతున్నాయి. రొయ్యలు ఠింగు ఠింగున ఎగురుతున్నాయి. పెద్ద తాబేలు మెల్లగా కదుల్తోంది. దానికి చెరో వైపు చిన్న పచ్చ చేపలు సీతాకోకచిలుకల్లా ఎగురుతూ వెళ్తున్నాయి. ఒక ఎండ్ర కాయ రాళ్ళతో ఇల్లు కట్టుకుంటుంది. ఇది చూడగానే పిల్లవాడికి ఓ పద్యంలోని వాక్యం గుర్తొచ్చింది.

"ముసలి యాకోవ్ మామయ్య! నీ ఇల్లు ఇల్లులా లేదు. అది ఎద్దుల బండిలా వుంది."

వున్నట్టుండి సంగీతంతో ఓ గొంతు బిగ్గరగా వినిపించింది. "ఎవరు నువ్వు" అంది ఆ గొంతు.

పిల్లవాడు తలెత్తి పైకి చూశాడు.

అది ఓ పే....ద్ద చేప. పెద్ద పెద్ద కళ్ళు, పదునైన పళ్ళు, వెండి రంగులో మెరిసే పొలుసులు, బంగారు వర్ణంలోని మొప్పలు దానికి వున్నాయి. దాన్ని చూడగానే ఇవాస్కాకు తను భోజనశాలలో చూసిన చేపల వేపుడు గుర్తొచ్చింది.

"నువ్వేనా మాట్లాడేది?" అని అడిగాడు పిల్లవాడు.

"అవును" అంది చేప.

పిల్లవాడు ఆశ్చర్యపోయాడు.

"చేపలు ఎలా మాట్లాడగలవు?" అన్నాడు పిల్లవాడు.

పిల్లవాడు మనసులో ఇలా అనుకున్నాడు.

**"ఫ్రెంచ్ భాష రాదు నాకు**
**జర్మన్ అసలే రాదు**
**చేపల భాషొచ్చు నాకు**
**తెలివైన పిల్లకాయను**
**తుంటరి వాడినసలు కాదు."**

పిల్లవాడు చేపల వేటకు వెళ్ళినప్పుడు చొక్కా వేసుకోలేదు. కేవలం కాఫీ రంగు నిక్కరు మాత్రమే ధరించాడు. పిల్లవాడి ఛాతీ పైనుండి బుల్లి బుల్లి చేపలు అటుఇటూ గెంతుతున్నాయి. అవి ముచ్చట్లు చెప్పుకుంటూ, మధ్య మధ్యలో నవ్వుకుంటున్నాయి.

వాటి సంభాషణ ఇలా వుంది

"ఈ దెయ్యాన్ని చూడండి. దానికి రెండు తోకలున్నాయి. పొలుసులు అసలే లేవు. రెండు మొప్పలు వున్నాయి. తోక కూడా లేదు".

"అందవిహీనం...అందవిహీనం" అంటూ ఆటపట్టించాయి.

ఇది విన్న పిల్లవాడి మనసు నొచ్చుకుంది. ఇలా అనుకున్నాడు

"ఏమనుకుంటున్నారు వీళ్ళు? నిజమైన మనిషిని వీళ్ళెప్పుడూ చూడలేదా?"

పిల్లవాడు ఆ బుజ్జి చేపల్ని పట్టుకోవాలని చూశాడు. కానీ అవి ఒడుపుగా తప్పించుకున్నాయి. అప్పుడవి ఓ ఎండ్రకాయని ఈ విధంగా ఆట పట్టించడం మొదలుపెట్టాయి.

**"ఎండ్రకాయ! ఎండ్రకాయ! ఎక్కడున్నావు?**
**రాళ్ళ కింద దాక్కున్నావా?**
**అందమైన మా పొలుసులు చూడు,**
**నిటారుగా వున్న మా మొప్పలు చూడు,**
**పొడవైన మా తోకను చూడు,**
**ఎంత బాగా ఈదుతున్నామో చూడు,**
**మేము గొప్ప...మేమే గొప్ప."**

ఎండ్రకాయ కోపంతో ఇలా అంది "ఓసారి నా చేతికి చిక్కితే మీ పని చెప్తాను, అప్పుడు చూస్తాను మీరు ఏమాత్రం ఈదగలరో?"

ఎండ్రకాయతో జాగ్రత్తగా వుండాలని మనసులో అనుకున్నాడు పిల్లవాడు.

ఓ పెద్ద చేప పిల్లవాడిని ఇలా అడిగింది "చేపలు ఎందుకు మాట్లాడలేవని అనుకుంటున్నావ్?"

"మా నాన్న చెప్పాడు?" అన్నాడు.

"మీ నాన్న ఎవరు? అడిగింది పెద్ద చేప.

పిల్లవాడు ఇలా అన్నాడు "మా నాన్న అచ్చు నాలానే వుంటాడు. కానీ నాకంటే ఎత్తుగా, బలంగా వుంటాడు. అతనికి గడ్డం కూడా వుంటుంది.



చాలా మంచి వ్యక్తి. కానీ, అప్పుడప్పుడు నాపై కోప్పడుతుంటాడు".

"మీ నాన్న చేపల్ని తింటాడా?" అడిగింది పెద్ద చేప.

ఈ ప్రశ్న వినగానే పిల్లవాడు అయోమయానికి గురయ్యాడు. ఇప్పుడు తను ఏమని సమాధానం చెప్పాలి? నీటి వంక చూశాడు. మేఘాకృతమైన ఆకాశం, ఆ సముద్రం నీటిలో ఆకుపచ్చని పూల తోటలా వుంది. సూర్యుడు పసుపు రంగులో పొద్దుతిరుగుడు పువ్వులా వున్నాడు. అబద్ధం చెప్పాలని నిర్ణయించుకున్నాడు ఇవాస్కా.

పిల్లవాడు ఇలా అన్నాడు "లేదు. మా నాన్న చేపలు తినడు, ఎందుకంటే అవి చాలా సన్నగా వుంటాయి".

పెద్ద చేప ఇలా అంది "మీ నాన్నకు తెలిసింది చాలా తక్కువ. ఎందుకంటే నన్ను, నా కుటుంబాన్ని చూడు. మేమెంత బలంగా, అందంగా వున్నామో!"

ఈ చర్చ కొనసాగించడం పిల్లవాడికి ఇష్టం లేదు. పిల్లవాడు వినయంగా ఇలా అడిగాడు

"నువ్వెప్పుడైనా నీటి పైకి వెళ్ళావా?"

"ఎందుకు? నాకు అక్కడ గాలి ఆడదు" అంది పెద్ద చేప.

"కానీ నీటి పైన అందమైన పక్షులు ఎగురుతూ వుంటాయి. వాటిని చూస్తే భలేగా వుంటుంది."

పెద్ద చేప పిల్లవాడి చుట్టూ ఈదింది. దాన్ని మొహాన్ని పిల్లవాడి ముక్కుకు ఎదురుగుండా పెట్టి అడిగింది "పక్షులా? అలా అయితే నువ్వు వాటిని చూస్తూ కూర్చోక నీటిలోకి ఎందుకొచ్చావ్?"

చూస్తుంటే ఈ పెద్ద చేప నన్ను తినేశాలా వుంది. దీంతో జాగ్రత్తగా వుండాలని మనసులో నిర్ణయించుకున్నాడు ఇవాస్కా.

పిల్లవాడు నిర్లక్ష్యంగా ఇలా అన్నాడు "కారణమేం లేదు. నేను అలా సరదాగా నడుచుకుంటూ నీటిలోకి వచ్చాను".

"హమ్మా!" అని ఆశ్చర్యపోయింది చేప.

"నువ్వు మునిగిపోలేదా?" అంది చేప.

"లేదు, నేను సరదాగా నడుచుకుంటూ వచ్చాను., కావాలంటే చూడు, ఇప్పుడు నిలబడగలను" అన్నాడు పిల్లవాడు.

పిల్లవాడు నిలబడటానికి ప్రయత్నించాడు. ఓ పెద్ద దుప్పటిలో ఇరుక్కు పోయినట్లు వుంది ఆ అబ్బాయి పరిస్థితి. కొంచెం కూడా కదలలేకపోయాడు.

పిల్లవాడికి ఏడవాలనిపించింది. కానీ ఏం లాభం? కన్నీరు సముద్రపు నీటిలో కలసిపోతుంది. తనను ఈ గండం నుండి బయపడేయలేదు.

ఏదో ఉపాయం ఆలోచించాలి అనుకున్నాడు. సముద్రంలోని వివిధ రకాల జీవులు పిల్లవాడి చుట్టూ చేరాయి.సముద్రపు నీటి గుర్రం ఇలా అంది

"ఓ అబ్బాయ్! నీ గురించి నాకు తెలుసుకోవాలని వుందోయ్..!"

ఓ సముద్రపు రొయ్య వ్యంగ్యంతో ఇలా అంది "నువ్వు చూడు ఎలా వున్నావో, ఎండ్రకాయవి కాదు, చేపవి కాదు, తాబేలువీ కాదు...టూట్...టూట్.."

"ఏమో! నేను పెద్దయితే ఎగరగలనేమో!" అన్నాడు పిల్లవాడు. ఓ సముద్రపు ఎండ్ర కాయ పిల్లవాడి తొడపైకి ఎక్కి, కళ్ళలోకి చూస్తూ ఇలా అడిగింది

"సమయం ఎంతయింతో చెప్పగలవా?"

చేపలు, రొయ్యలు పిల్లవాడి జుత్తుతో ఆడుకున్నాయి. చెవులు

మెలిపెట్టాయి. ఒంటి మీద పాకుతూ, చక్కిలిగింతలు పెడుతూ, పిల్లవాడికి చిరాకు తెప్పించాయి.

"ఓ..ఓ.." అని నవ్వుతూ, ఆనందంగా వున్నట్లు నటించాడు పిల్లవాడు. ఎందుకంటే ఇంట్లో తను తప్పు చేసినప్పుడు, అమ్మనాన్న కోప్పడతారు. అప్పుడు పిల్లవాడు ఆనందంగా వున్నట్లు, ఏమీ తెలియనట్లు నటిస్తాడు.

ఈలోగా ఎన్నో చిన్న, పెద్ద చేపలు ఇవస్కా చుట్టూ చేరాయి. అబ్బాయిని వింతగా గమనిస్తూ ఇలా పాట పాడాయి

**"పిల్లవాడా! ఓ పిల్లవాడా!!**
**పొలుసుల్లేని పిల్లవాడా**
**మొప్పల్లేని పిల్లవాడా**
**తోకల్లేని పిల్లవాడా**
**ఎలా బ్రతకగలవు పిల్లవాడా**
**మా జాతివి కాదు నువ్వు పిల్లవాడా**
**ఆక్టోపస్‌కి చుట్టానివా పిల్లవాడా**
**పిల్లవాడా! ఓ పిల్లవాడా!!"**

ఇదంతా విన్న పిల్లవాడికి కోపం వచ్చింది. పట్టించుకోనట్లు నటిస్తూ, ఈల వేయడానికి ప్రయత్నించాడు. కానీ అతని నోటి నిండా నీరు చేరడం వల్ల, ఈల వేయడం సాధ్యం కాలేదు. ఈలోగా మాట్లాడే పెద్ద చేప ఇలా అడిగింది "నీకు సముద్రం నచ్చలేదా?"

"లేదు, కాదు నచ్చింది. నాకు మా ఇల్లంటే కూడా చాలా ఇష్టం" అన్నాడు పిల్లవాడు.

ఈ చేపలన్ని కలసి తనని తినేస్తాయేమోనని భయపడ్డాడు పిల్లవాడు.

పిల్లవాడు బిగ్గరగా ఇలా అన్నాడు "నాకు విసుగ్గా వుంది. ఆడుకుందామా?"

పెద్ద చేపకు ఈ ఆలోచన నచ్చింది. అది దాని పెద్ద నోరుని తెరిచి గట్టిగా నవ్వింది. దాని పదునైన, పొడవైన పళ్ళను చూసి ఆశ్చర్యపోయాడు పిల్లవాడు.

"అలాగే! నాకు ఆటలంటే ఎంతో ఇష్టం" అంది పెద్ద చేప.

"సముద్రంపైకి ఈదుకుంటూ వెళ్దాం" అన్నాడు పిల్లవాడు.

"ఎందుకు?"

"మనం ఇప్పుడు సముద్రం అడుగు భాగాన వున్నాం, ఇంతకు మించి కిందకు వెళ్ళలేం, అదీకాక సముద్రంపైకి వెళ్తే మనం ఎన్నో పక్షులను చూడవచ్చు".

"పక్షులంటే నీకు ఇష్టమా?" అడిగింది పెద్ద చేప.

ఇవాస్కొకి వాళ్ళ అమ్మనాన్న, ఐస్క్రీం ఈ మూడంటేనే ఇష్టం. అయినప్పటికీ ఇలా అనేశాడు

"అవును".

"సరే పద" అంది పెద్ద చేప.

పిల్లవాడు పెద్ద చేప మొప్పలను జాగ్రత్తగా పట్టుకున్నాడు. పెద్దచేప పిల్లవాడిని తన వీపుపై ఎక్కించుకుంది.

చేప నీటిపైకి ఈదడం మొదలుపెట్టింది. అది నాట్యం చేస్తూ, పాడుతూ సముద్రంపైకి వెళ్తుంది.

చిన్న చిన్న మీనోస్ అనే చేపల గుంపు ఈ పెద్ద చేప చుట్టూ ప్రయాణించడం మొదలుపెట్టాయి. అవి ముక్తకంఠంతో ఇలా పాడాయి

**"హెచ్చరికోయ్! హెచ్చరిక!!**
**మన పెద్దచేపగారు**
**చిన్న పిల్లవాడు**
**ఆడుకుంటున్నారు**
**అడ్డు తొలగండి**
**హెచ్చరికోయ్! హెచ్చరిక!!**

పెద్ద చేప పిల్లవాడిని ఎక్కించుకొని, చాలాసేపు ఈదింది. చాలా వేగంగా ఈదింది. వున్నట్టుండి పిల్లవాడి తల నీటి పైకి వచ్చింది. స్వచ్ఛమైన గాలి తగిలింది. అలా వాళ్ళు సముద్రం పైకి వచ్చారు.

మెల్లగా తెలవారుతుంది. వెలుతురు తివాచీ పరిచినట్లుంది. సూర్యుడు నీటిపై ఆడుకుంటున్నాడు. తెల్లటి నురగతో పచ్చటి అలలు తీరంపైపు ఎగసెగసి పడుతున్నాయి. ఆ అలలు చేసే శబ్ధం వింత సంగీతాన్ని సృష్టిస్తుంది.

ఇవాస్కా, చేపలు పట్టే కర్ర తీరానికి దూరంగా నీటిపై తేలుతుంది. పెద్దచేప, పిల్లవాడు ఆకాశం కేసి చూశారు. రంగురంగుల పక్షులు, కొన్ని ఒంటరిగా, కొన్ని జంటలుగా, కొన్ని గుంపులుగా ఎగురుతున్నాయి. వాటిలో

బుజ్జి బుజ్జి పక్షులున్నాయి. పెద్ద పెద్ద పక్షులున్నాయి. వాటిని చూసి పెద్ద చేప ఎంతో ఆనందించింది. పిల్లవాడు, పెద్ద చేప ఆనందంతో కేరింతలు కొట్టారు.

కొంత సమయం గడిచాక, పిల్లవాడు ఒడ్డుకు చేరాడు. "కృతజ్ఞతలు మిత్రమా!" అన్నాడు పిల్లవాడు.

"జాగ్రత్త" అని చెప్పింది పెద్ద చేప. పెద్ద చేప సెలవు తీసుకుని సముద్రంలోకి తిరుగు ప్రయాణమైంది.

చూశారా పిల్లలూ..! పెద్ద చేప పిల్లవాడిని ఎలా కాపాడిందో!

| | | |
|---|---|---|
| English Title | : | Evseika goes fishing |
| Writer | : | Maxim Gorky |
| English Translation | : | Galina Glagoleva |
| Illustration | : | Yuri Molokanov |



# వింత టోపి

## స్పిరిడాన్ వెంగిలి

అనగనగా ఒక ఊరిలో 'గుగుడ్సె' అనే చిన్న పిల్లవాడు వుండేవాడు. వాళ్ళకు గొర్రెల మంద వుండేది.

అది చలికాలం. గుగుడ్సె వాళ్ళ నాన్న ఓ టోపి తయారుచేసి పిల్లవాడికి బహుమతిగా ఇచ్చాడు. అది గొర్రె బొచ్చుతో తయారుచేసిన మేలుజాతి టోపి.

గుగుడ్సె ఆనందంగా టోపిని తన తలపై పెట్టుకున్నాడు. గుగుడ్సె తల చిన్నది. టోపియేమో పెద్దది. తల నుండి టోపి జారి పిల్లవాడి కళ్ళ మీద పడేది.

"నాన్నా! ఈ టోపి జారి నా కళ్ళ మీద పడుతుంది'' అన్నాడు పిల్లవాడు.

"అయితే దానిని చేత్తో పైకెత్తి పట్టుకో" సమాధానం చెప్పాడు నాన్న.

"అంతేనా!" అన్నాడు గుగుడ్సె. తరువాత రోజు తెల్లవారగట్లనే నిద్రలేచాడు పిల్లవాడు. మేకలకు, గొర్రెలకు మేత తినిపించి నీళ్ళు తాగించాడు. ఓ గొర్రెపై ఎక్కి ఆడుకుంటున్నాడు.

ఇంతలో వాళ్ళ నాన్న నిద్ర లేచాడు.

గొర్రెపై ఆడుకుంటున్న గుగుడ్సెని చూశాడు. 'శుభోదయం గుగుడ్సె' అన్నాడు నాన్న.

'శుభోదయం నాన్న' అన్నాడు పిల్లవాడు.

తండ్రి చేతిలో వున్న పశువుల దాణాను చూసి, గుగుడ్సె ఇలా అన్నాడు. "నాన్నా! ఈరోజు నేను గొర్రెల మందకు మేత తినిపించి, నీళ్ళు తాగించాను. మీరు తెచ్చిన దాణాను వెనక్కు తీసుకువెళ్ళండి".

నాన్న చిరునవ్వు నవ్వి, పిల్లవాడి భుజం తట్టి మెచ్చుకున్నాడు.

ఆ రోజు నుండి గొర్రెల మంద బాగోగులు పిల్లవాడే చూసుకునేవాడు. గొర్రెలు కూడా పిల్లవాడికి బాగా మచ్చికయ్యాయి. అవి పిల్లవాడితో సరదాగా ఆటలాడేవి.

రోజురోజుకి మంచు కురవడం ఎక్కువయ్యింది. చలి విపరీతంగా పెరిగిపోయింది. పిల్లవాడు మంచుపై కాలుమోపిన ప్రతిసారీ, వయోలిన్ వాయించినపుడు వచ్చే సంగీతంలాంటి శబ్దం వచ్చేది.

ఒక రోజు గుగుడ్సె నడుచుకుంటూ బడికి వెళ్తున్నాడు. దారిలో వాళ్ళ బడిలో చదివే చిన్న పాప చలికి వణుకుతూ కనిపించింది. ఆమె తన పుస్తకాలను చేతిలో పట్టుకొని వుంది.

పిల్లవాడికి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. "నా టోపి ఆ పాపకు ఇస్తే, తను పుస్తకాలను టోపిలో పెట్టి, టోపిని తలపై పెట్టుకోవచ్చు కదా!" అనుకున్నాడు.

చిన్న పాప వద్దకు వెళ్ళి ఇలా అడిగాడు "చలిగా వుందా?"

"అవును" అంది పాప.

"నా టోపి తీసుకో!" అన్నాడు పిల్లవాడు.



“వద్దు గుగుడ్సె, టోపి లేకుంటే నువ్వు చలికి గడ్డ కట్టుకుపోతావు!” అంది పాప.

పిల్లవాడు కోపంతో, టోపిని మంచులోకి విసిరేశాడు. పిల్లవాడు పాప కొన్ని అడుగులు నడిచారు. వెనక్కి తిరిగి చూశారు.

టోపి దిగులుగా గుగుడ్సె వంక చూసింది. ఆశ్చర్యం, వున్నట్టుండి టోపి తనంతట తానే మంచులో నుండి లేచి నిలబడింది. టోపి పరిమాణం పెరగడం ప్రారంభమైంది. ఇది చూసి పిల్లవాడు, పాప ఆశ్చర్యపోయారు.

గుగుడ్సె వెళ్ళి టోపిని తీసుకున్నాడు. దాన్ని తన తలమీద, పాప తలమీద వుంచాడు. అది ఇద్దరికీ చక్కగా సరిపోయింది. కబుర్లు చెప్పుకుంటూ పాఠశాలకు నడిచి వెళ్ళారు. అలా ఆ వింత టోపి గుగుడ్సెనీ, చిన్న పాపను చలి నుండి కాపాడింది.

ఆ రోజు నుండి గుగుడ్సె తన టోపి కింద తన స్నేహితులను తీసుకువెళ్తూ చలి నుండి రక్షించేవాడు. ఓ రోజైతే, ఏడు లేదా ఎనిమిది మంది అమ్మాయిలను తన వింత టోపి కింద, వాళ్ళ ఇళ్ళ దగ్గర దింపాడు.

మరో రోజు తన తరగతి ఉపాధ్యాయురాలికి వింత టోపితో సాయం చేశాడు. అదేం విచిత్రమో! జనాల సంఖ్యని బట్టి టోపి పెద్దదయ్యేది. చలి నుండి కాపాడేది.

గుగుడ్సె ఇంటికి చేరగానే, టోపి చిన్నగా అయ్యి చక్కగా గదిలో అమరేది. ఇలా టోపి సందర్భాన్ని బట్టి పెద్దదవడం, చిన్నగా మారడం చూసి ఊరి ప్రజలు గుగుడ్సె గొప్పతనాన్ని పొగిడేవారు.

ఓ రోజు టోపి పెద్దదవడం మానేసింది. గుగుడ్సె టోపిని ఆజ్ఞాపించాడు, బ్రతిమిలాడాడు, ప్రార్థించాడు. కానీ ఏం లాభం! టోపి కొంచెం కూడా పెద్దదవలేదు.

ఆ రోజు గుగుడ్సె చలిలోనే పాఠశాలకు వెళ్ళి వచ్చాడు.

ఉన్నట్టుండి గుగుడ్సెకు ఓ విషయం గుర్తొచ్చింది. ఆ రోజు ప్రొద్దున, తను గొర్రెల మందకు దాణా తినిపించలేదు, నీళ్ళు తాగించలేదు. తన

మతిమరుపుతనానికి చింతించాడు.

ఆ క్షణమే గొర్రెల మందకు పచ్చటి గడ్డిని తినిపించి, నీళ్ళు తాగించాడు.

తన గదిలోకి తిరిగి వచ్చి చూసేసరికి, ఆశ్చర్యం! టోపి పెద్దదయ్యింది. వింత టోపి గుగుడ్సె మాటని చక్కగా వినింది. పిల్లవాడి ఆజ్ఞను పాటించింది.

ఒకరోజు పిల్లవాడికి ఓ ఆలోచన వచ్చింది. తన వింత టోపితో ఊరి జనాల్ని, వాళ్ళ ఇళ్ళని, చలిబారి నుండి కాపాడితే ఎలా వుంటుంది అని. ఆలోచన వచ్చిందే తడువుగా గుగుడ్సె తమ ఇరుగు పొరుగు వాళ్ళ గొర్రెల మందకు గడ్డి తినిపించి నీళ్ళు తాగించేవాడు. మెల్ల మెల్లగా వింత టోపి పెద్దదవడం ప్రారంభమైంది. వింత టోపి ఎంత పెద్దదయిందంటే, అది ఊరి మొత్తాన్ని పెద్ద గొడుగులా కప్పేసింది. చలి నుండి కాపాడింది. ఊరి ప్రజలంతా గుగుడ్సెని ఎంతో మెచ్చుకున్నారు. గుగుడ్సెకు, వింత టోపికి కృతజ్ఞతలు చెప్పారు.

చలికాలం ముగిసి, వసంత కాలం వచ్చింది. గుగుడ్సే టోపిని చిన్నగా మారమని అడిగాడు. పిల్లవాడి కోరికను టోపి వెంటనే మన్నించి, చిన్నగా అయిపోయింది. పిల్లవాడు చక్కగా దానిని తలపై పెట్టుకొని గొర్రెల బాగోగులు చూస్తూ, వాటితో ఆడుకొనేవాడు. బుద్ధిగా బడికి వెళ్ళి చక్కగా చదువుకునేవాడు. ప్రతి సంవత్సరం, చలికాలం వింత టోపి గుగుడ్సేని, వాళ్ళ ఊరిని చలిబారి నుండి కాపాడేది. ఇప్పటికీ కాపాడుతోంది...!

| | | |
|---|---|---|
| English Title | : | Gugutse's Hat |
| Writer | : | Spiridon Vangeli |
| English Translation | : | James Riordan |
| Illustration | : | Viktor Duvidov |



# చెక్క బొమ్మ పిల్లవాడు

## అలెక్సేయ్ తొల్‌స్తోయ్

అనగనగా ఒక ఊరిలో ముసలి దంపతులు నివసించేవారు. వారికి పిల్లలంటే విపరీతమైన ఇష్టం. కానీ దురదృష్టవశాత్తు వాళ్ళకి పిల్లలు కలగలేదు. పిల్లలు లేకపోవడం వల్ల వాళ్ళు జీవితం ఒంటరిగా, నిరాశగా ఉండేది.

ఓ రోజు ముసలాయన చెక్కను బొమ్మలాగా చెక్కాడు. ముసలమ్మకు ఆ బొమ్మను బహుమతిగా ఇస్తూ ఇలా అన్నాడు "ఈ చెక్క బొమ్మని మనం కొడుకు గా ఊహించుకుందాం. మన మనసులోని బాధకు కొంతైనా స్వాంతన కలుగుతుంది."

ముసలమ్మ ఆనందంగా ఆ బొమ్మను తీసుకుని దానికి బట్టలు తొడిగింది. వాళ్ళిద్దరు ఆ చెక్క బొమ్మ పిల్లవాడికి "తెర్యోషా" అని నామకరణం చేసారు.

ముసలమ్మ తెర్యోషాను ఒళ్ళో పడుకోబెట్టుకొని ఇలా పాడసాగింది.

**"లాలీ జో . . . లాలిజో**

**నిద్రపో ఓ కన్నా !**

**పక్షులెగిరిపోయాయి.**

**నక్కలూ, కుందేళ్ళు,**

**అడవిన నిద్రించాయి.**

**లాలిజో. . . లాలిజో**

**నిద్రపో ఓ నాన్నా!!**

రోజురోజుకి ఆ చెక్క బొమ్మ పెద్దగా అవటం ప్రారంభమైంది. ఆశ్చర్యం ఓ రోజు ఆ చెక్క బొమ్మకి ప్రాణం వచ్చింది. పిల్లలు లేని లోటు తీరినందుకు ముసలి దంపతులు ఎంతో సంతోషించారు.

అలా కొన్ని సంవత్సరాలలో తెర్యోషా తెలివైన పిల్లవాడిగా మారాడు. ముసలాయన ఓ చిన్న చెక్క పడవని, రెండు చెక్క తెడ్లని తయారు చేసాడు. పడవకి తెల్ల రంగు వేసాడు, తెడ్లకి ఎరుపు రంగు వేసాడు. ఆ పడవని, తెడ్లని, పిల్లవాడికి బహుమతిగా ఇచ్చారు. పిల్లవాడి ఆనందానికి అవధుల్లేవు. తెర్యోషా వాళ్ళ ఇంటి దగ్గరలోని నది వద్దకు వెళ్ళాడు. పడవతో ఇలా అన్నాడు.

**" ఎంతో మంచి తెల్ల పడవ!**

**నా కోరిక మన్నించు**

**చేపలు ఎక్కువ దొరికే**

**చోటుకి నన్ను తీసుకెళ్ళు"**

పడవ బాలుడి కోరికను మన్నించింది. నదిలో చాలా దూరంలో ప్రయాణించి, చేపలు బాగా దొరికే ప్రదేశంలో ఆగింది. తెర్యోషా చేపలు పట్టాడు.

మధ్యాహ్నం అవగానే తెర్యోషా వాళ్ళ అమ్మ బోజనం తెచ్చేది. నదీ తీరంలో నిలబడి ఇలా పిలిచింది.

**"ఓ నా బంగారు బాబు తెర్యోషా !**

**నీకిష్టమైన కూర చేశాను**

**పెరుగు, తేనె తెచ్చాను**

**త్వరగా రా! త్వరగా రా!**

**నా చేత గోరుముద్దలు తిను."**

అమ్మ గొంతు తెర్యోషా కు లీలగా వినిపించింది.

పిల్లవాడు బయటకు వచ్చాడు. తను వేటాడిన చేపల్ని అమ్మకు ఇచ్చాడు. అమ్మతో కబుర్లు చెబుతూ గోరు ముద్దలు తిన్నాడు.

అమ్మ తెర్యోషా కు పొడి బట్టలు తొడిగి, తల దువ్వింది. అమ్మకు వీడ్కోలు చెప్పి తెర్యోషా తిరిగి నదిలో ప్రయాణానికి వెళ్ళాడు.

ఇది తెర్యోషా దినచర్య.

ఓ మంత్రగత్తె పొదలమాట నుండి ఇదంతా గమనించింది.

ఓ రోజు మధ్యాహ్నం, మంత్రగత్తె నది తీరంలో నిలబడి తన బొంగురు గొంతుతో నిలబడి ఇలా పిలిచింది.

**"ఓ నా బంగారు బాబు తెర్యోషా !**

**నీకిష్టమైన కూర చేశాను**

**పెరుగు, తేనె తెచ్చాను**

**త్వరగా రా! త్వరగా రా!**

**నా చేత గోరుముద్దలు తిను.”**

మంత్రగత్తె బొంగురు గొంతు తెర్యోషాకు లీలగా వినిపించింది.

అది తన అమ్మ గొంతు కాదని పిల్లవాడు గుర్తించాడు.

తనని నదిలో వీలైనంత దూరం తీసుకెళ్ళమని పడవని ప్రార్ధించాడు. పడవ అలాగే చేసింది.

మంత్రగత్తె ఎంత పిలిచినా, పిల్లవాడు ఒడ్డుకు రాలేదు. తన మోసం బయటపడిందని మంత్రగత్తె గ్రహించింది.

మంత్రగత్తె వడ్రంగి వద్దకు వెళ్ళింది. తన బొంగురు గొంతును, తెర్యాషా వాళ్ళ అమ్మ గొంతులా మార్చమని కోరింది. సరేనని వడ్రంగి, మంత్రగత్తె గొంతును మార్చాడు.

తరువాత రోజు మధ్యాహ్నం మంత్రగత్తె నదీ తీరంలో నిలబడి, తెర్యోషా వాళ్ళ అమ్మ గొంతుతో ఇలా పిలిచింది.

**“ఓ నా బంగారు బాబు తెర్యోషా !**

**నీకిష్టమైన కూర చేసాను**

**పెరుగు, తేనె తెచ్చాను**

**త్వరగా రా! త్వరగా రా!**

**నా చేత గోరుముద్దలు తిను.”**

అది తన అమ్మ గొంతని పొరబడ్డాడు పిల్లవాడు.

ఒడ్డుకు చేరాడు. పిల్లవాడిని బంధించింది మంత్రగత్తె.

పిల్లవాడిని తన సంచిలో వేసుకుని, చిన్న అడవి లోని తన ఇంటికి



చేరింది. పిల్లవాడిని వండి, మంచి భోజనం తయారు చేయమని కూతురుని ఆజ్ఞాపించింది.

సరేనంది మంత్రగత్తె కూతురు.

పెద్ద పొయ్యిలో కట్టెలు వేసి బాగా మంట పెట్టింది.

పిల్లవాడిని పెద్ద చెక్క గరిటెపై పడుకోమని ఆజ్ఞాపించింది. పిల్లవాడు దానిపై కూర్చున్నాడు.

మంత్రగత్తె కూతురు ఎంత తోసినా, పిల్లవాడు పొయ్యిలోకి వెళ్ళట్లేదు. అతని చేతులు కాళ్ళు లోపలికి వెళ్ళకుండా అడ్డుపడుతున్నాయి.

"నిన్ను చెక్క గరిటెపై పడుకోమని చెప్పాకదా" గట్టిగా కోప్పడింది మంత్రగత్తె కూతురు.

" చెక్క గరిటెపై ఎలా పడుకోవాలో నాకు తెలియదు. మీరు దయ చేసి ఓ సారి పడుకుని చూపించండి." అన్నాడు తెర్యాషా.

"పిల్లులు, కుక్కలు ముడుచుకుని పడుకుంటాయి చూడు, అలా పడుకో" ఆజ్ఞాపించింది మంత్రగత్తె కూతురు.

"దయచేసి ఎలా పడుకోవాలో మీరు చూపించండి" బ్రతిమాలాడుతూ అన్నాడు తెర్యోషా.

మంత్రగత్తె కూతురు చెక్క గరిటె పై పడుకుంది. క్షణాల్లో తెర్యోషా గరిటెను పొయ్యిలోకి నెట్టాడు. పొయ్యి తలుపు మూసేశాడు.

ఇంటి బయటకు పరిగెత్తాడు. ఇంటి పక్కనున్న ఒక చెట్టుపైకి ఎక్కాడు. ముసలి మంత్రగత్తె ఎప్పుడు తిరిగి వస్తుందా అని చూడసాగాడు.

మంత్రగత్తె సాయంత్రానికి ఇల్లు చేరింది పొయ్యిలో ఉన్న మాంసాన్ని ఆబగా తినింది. జల్సాగా ఇలా పాడుతూ ఇంటి బయటకు వచ్చింది.

**ఎంత రుచిగా ఉందో.**

**పిల్లవాడి మాంసం.**

**ఎంతో తృప్తిగా తిన్నాను.**

**ఎంతో హాయిగా వుంది.**

ఒక చెట్టు పై నుండి తెర్యోషా ఇలా అన్నాడు

"ఓ మంత్రగత్తె! నువ్వు తినింది నన్ను కాదు. నీ కూతురుని."

మంత్రగత్తె కదుల్తున్న ఒక చెట్టు ఆకుల్ని చూసింది చెట్టుపైన ఆకుల మధ్య తెర్యోషా కనిపించాడు.

మంత్రగత్తెకు పిచ్చి కోపం వచ్చింది.

చెట్టు కాండాన్ని, తన పళ్ళతో కొరక సాగింది. అది చాలా బలిష్టమైన చెట్టు. దాంతో మంత్రగత్తె ముందు వరుస పళ్ళు ఊడి చేతిలో పడ్డాయి. మంత్రగత్తె పరిగెత్తుకుంటూ వడ్రంగి వద్దకు వెళ్ళింది "తక్షణమే రెండు ఇనుప పళ్ళు తయారుచేసి ఇవ్వు" అని ఆజ్ఞాపించింది. వడ్రంగి అలాగే చేసిచ్చాడు.

ఆ పళ్ళను పెట్టుకుని చెట్టు వద్దకు వచ్చింది ఈ సారి ఇంకా బలంగా, చెట్టు కాండాన్ని కొరికింది. మంత్రగత్తె వెనుక వరుస పళ్ళు రెండు ఊడి చేతిలో పడ్డాయి.

మరలా మంత్రగత్తె పరిగెత్తుకుంటూ వడ్రంగి వద్దకు వెళ్ళింది.

"తక్షణమే మరో రెండు ఇనుప పళ్ళు తయారు చేసి ఇవ్వు" అని ఆజ్ఞాపించింది. వడ్రంగి అలాగే చేసిచ్చాడు. ఆ పళ్ళను పెట్టుకుని చెట్టు వద్దకు వచ్చింది. ఎంత కొరికినా చెట్టుకు ఏమీ కాలేదు.

ఆ చెట్టు పైనున్న తెర్యోషా ఇదంతా చూస్తున్నాడు. ఇంతలో ఆకాశంలో

ఓ తెల్ల కొంగల గుంపు ఎగురుతూ కనిపించింది.

అవి చెట్టు సమీపానికి రాగానే పిల్లవాడు ఇలా బ్రతిమిలాడాడు.

**" తెల్లని రెక్కల కొంగల్లారా!**
**ఎంతో మంచి కొంగల్లారా**
**మంత్రగత్తె నన్ను బంధించింది**
**అమ్మకు దూరం చూసింది**
**కట్లు విప్పి నన్ను కాపాడండి**
**అమ్మ దగ్గరకు చేర్చండి**
**ఎంతో మంచి తెల్లని కొంగల్లారా!**

కొంగల గుంపు ఇలా అంది "వెనుక ఇంకో కొంగల గుంపు వస్తుంది. వాటినడుగు. అవి తప్పక నీకు సాయం చెయ్యగలవు"

కొద్ది క్షణాల్లో మరో కొంగల గుంపు చెట్టుపై నుండి ఎగురుతున్నాయి.

పిల్లవాడు వాటిని బ్రతిమలాడాడు. ఆ కొంగల గుంపు ఇలా అంది "వెనుక ఓ ఒంటరి కొంగ వస్తుంది. దాని రెక్కలు చాలా బలమైనవి. దాని హృదయం చాలా మంచిది. అది నీకు తప్పక సాయపడగలదు!"

మరుక్షణం ఒంటరి కొంగ చెట్టుపై నుండి ఎగరసాగింది. పిల్లవాడు ఇలా బ్రతిమలాడాడు.

**"ఎంతో చక్కని తెల్లని కొంగా**
**మంత్రగత్తె నన్ను బంధించింది**
**అమ్మకు దూరం చేసింది**
**కట్లు విప్పి నన్ను కాపాడండి**
**అమ్మ దగ్గరకు చేర్చండి**

ఎంతో మంచి తెల్లని కొంగా!

పిల్లవాడిని చూసి కొంగకు జాలేసింది. తన రెక్కలపై పిల్లవాడిని కూర్చోపెట్టుకుని చక్కా ఎగిరిపోయింది. ఈ దృశ్యాన్ని నిస్సహాయంగా మంత్రగత్తె చూస్తూ ఉండిపోయింది.

కొంగ పిల్లవాడిని వాళ్ళ ఇంటి వద్దకు క్షేమంగా చేర్చింది.

ముసలమ్మ భోజనానికి రొట్టెలు చేసింది. "ఇది నీకు, ఇది నాకు" అంటూ రొట్టెలు ముసలయ్య చేతిలో పెట్టింది.

"మరి నా సంగతేంటి? అన్నాడు తెర్యోషా.

కిటికీ దగ్గర నుండి కొడుకు గొంతు వినిపించేసరికి, ముసలి దంపతులు ఆశ్చర్యంగా తిరిగి చూసారు.

తిరిగి వచ్చిన తెర్యోషాను చూసి కౌగలించుకున్నారు. ముద్దుల వర్షం కురిపించారు. ఆనంద బాష్పాలు రాల్చారు.

తమకు సాయం చేసిన తెల్ల కొంగకు కృతజ్ఞతలు చెప్పారు. కొంగకు కూడా తిండి పెట్టారు. నీరు తాపారు. కొంగ వాళ్ళ వద్ద సెలవు తీసుకుని ఆకాశంలోకి ఎగిరి పోయింది.

కొంగ ఇప్పటికీ అపుడపుడు తెర్యోషాను కలుస్తుంటుంది. వాళ్ళిపుడు మంచి స్నేహితులు.

| | | |
|---|---|---|
| English Title | : | Teryosha |
| Writer | : | Alexei Tolstoy |
| English Translation | : | Olga Shartse |
| Illustration | : | Yulian Korovin |



# కొసక్ వీరుడి కథ

ఉక్రేనియన్ జానపద కథ

అనగనగా ఒక ఊరిలో ఓ కొసక్ వీరుడు ఉండేవాడు. అతని పేరు మామారిహా. అతను సైన్యంలో ఇరవై ఐదు సంవత్సరాలు గడిపాడు. అందుకు ప్రతిగా మూడు రాగి నాణాలు జీతంగా లభించాయి. వాటిని జేబులో వేసుకుని అతను దేశ సంచారానికి బయలుదేరాడు.

అలా నడుస్తూ, నడుస్తూ వెళ్తున్నాడు. ఓ రోజు అతనికి ఓ యువకుడు ఎదురుపడ్డాడు. "శుభదినం" అన్నాడు కొసక్ వీరుడు. ''మీక శుభదినం'' అన్నాడు ఆ యువకుడు.

తన గురించి చెప్పి, "నీవు ఎక్కడకి వెళ్తున్నావు?" అని అడిగాడు కొసక్ వీరుడు.

మొదటి యువకుడు ఇలా చెప్పసాగాడు. “నాకు గుడ్డ సంచి దొరికింది. ఆశ్చర్యంగా అది నేను కోరుకున్నపుడల్లా, కావలసినంత తిండిని, తాగటానికి నీరుని ఇస్తుంది. నా యజమానికి ఈ విషయం తెలిసి నన్ను కొట్టించాడు. గుడ్డసంచిని లాక్కున్నాడు. నేను అతి కష్టం మీద ఆ గుడ్డ సంచిని తిరిగి సంపాదించి పారిపోయి వచ్చాను. అడవిలో ప్రయాణిస్తుండగా, ఓ దొంగల ముఠా నా మీద దాడి చేసి ఆ విలువైన గుడ్డ సంచిని దోచుకుంది.”

“బాధపడకు మిత్రమా! ఈ రోజు నుండి నీవు నా సోదరుడివి. మనం కలిసి ప్రయాణిద్దాం.” అన్నాడు కొసక్ వీరుడు.

ఇద్దరూ కలిసి ప్రయాణించసాగారు. కొన్నిరోజులు గడిచాయి. ఓ రోజు వాళ్ళకు మరో యువకుడు తారస పడ్డాడు.

‘శుభోదయం’ అన్నాడు కొసక్ వీరుడు. “మీకూ శుభోదయం” అన్నాడు యువకుడు.

తన గురించి, మొదటి యువకుడి గురించి చెప్పి, “నీవు ఎక్కడకి వెళ్తున్నావు?” అని అడిగాడు కొసక్ వీరుడు.

రెండవ యువకుడు ఇలా చెప్పసాగాడు.

“నేను ఓ ధనికుడి వద్ద కూలివానిగా పనిచేసాను. రోజూ అడవిలో చెట్లు నరికి, కలప తయారు చేసేవాడిని. ఓ రోజు అడవిలో చెట్లు నరికి, కలప తయారు చేస్తుండగా ఓ చెట్టుమీద నాకొ రబ్బరు సంచి దొరికినది. ఆశ్చర్యంగా అది నేను కోరిన వెంటనే, చెట్లు నరికి కలప తయారు చేయగలదు. ఏ పని చెప్తే ఆ పని చేయగలదు. నా యజమానికి ఈ విషయం తెలిసి నన్ను కొట్టించాడు. రబ్బరు సంచిని లాక్కున్నాడు. నేను అతి కష్టం మీద ఆ రబ్బరు సంచిని తిరిగి సంపాదించి పారిపోయి వచ్చాను. అడవిలో ప్రయాణిస్తుండగా,

ఓ దొంగల ముఠా నా మీద దాడి చేసి ఆ విలువైన రబ్బరు సంచిని దోచుకుంది.”

“బాధపడకు మిత్రమా! ఈ రోజు నుండి నీవు కూడా మా సోదరుడివి. మనం కలిసి ప్రయాణిద్దాం.” అన్నాడు కొసక్ వీరుడు.

ముగ్గురూ కలిసి ప్రయాణించసాగారు. కొన్నిరోజులు గడిచాయి. ఓ రోజు వాళ్ళకు మరో యువకుడు ఎదురైయ్యాడు.

‘శుభోదయం’ అన్నాడు కొసక్ వీరుడు. “మీకూ శుభోదయం” అన్నాడు యువకుడు.

తమ ముగ్గురి కథ చెప్పి, “నీవు ఎక్కడకి వెళ్తున్నావు?” అని అడిగాడు కొసక్ వీరుడు.

మూడవ యువకుడు ఇలా చెప్పసాగాడు.

“నేను ఓ వ్యాపారస్తుని వద్ద గుర్రపుశాలలో పని చేసేవాడిని. ఓ రోజు నాకు వింత పాదరక్షలు దొరికాయి. అవి ధరిస్తే, నేను ఎంచక్కా నీటి మీద నడవగలను. నా యజమానికి ఈ విషయం తెలిసి నన్ను కొట్టించాడు. వింత పాదరక్షలని లాక్కున్నాడు. నేను అతి కష్టం మీద ఆ వింత పాదరక్షలని తిరిగి సంపాదించి పారిపోయి వచ్చాను. అడవిలో ప్రయాణిస్తుండగా, ఓ దొంగల ముఠా నా మీద దాడి చేసి ఆ విలువైన వింత పాదరక్షలని దోచుకుంది.”

“బాధపడకు మిత్రమా! ఈ రోజు నుండి నీవు మా సోదరుడివి. మనం కలిసి ప్రయాణిద్దాం.” అన్నాడు కొసక్ వీరుడు.

నలుగురు కలిసి ప్రయాణించసాగారు. వాళ్ళకి చేతనైన పని చేసి డబ్బు సంపాదించేవారు. ఆ డబ్బుతో తిండి సంపాదించుకుని సమానంగా

పంచుకునేవారు. ఆనందంగా గడిపేవారు. మరలా ప్రయాణం కొనసాగించేవారు.

ఓ రోజు వాళ్ళకి ఓ నాలుగు రహదారుల కూడలి ఎదురైంది. కొసక్ వీరుడు ఇలా అన్నాడు. “సోదరులారా! మనం విడిపోవల్సిన సమయం వచ్చింది. నా వద్ద ఉన్న మూడు రాగి నాణాలను ముగ్గురికి ఇస్తాను. ఈ నాలుగు దారుల్లో, తలా ఓ దారిని ఎంచుకోండి. మిగిలిన నాలుగవ దారిన నేను ప్రయాణిస్తాను.”

కొసక్ వీరుని మంచితనానికి కృతజ్ఞతలు చెప్పారు. రాగి నాణెం తీసుకుని తలో దిక్కుకి వెళ్ళారు. మొదటి యువకుడు తూర్పు దిక్కుకు వెళ్ళాడు. రెండవ యువకుడు పడమర దిక్కుకు వెళ్ళాడు. మూడవ యువకుడు ఉత్తరం దిక్కు వైపుకు వెళ్ళాడు. మిగిలిన దక్షిణం దిక్కుకు కొసక్ వీరుడు ప్రయాణించాడు.

అలా కొసక్ వీరుడు ఎక్కడెక్కడో తిరిగాడు. ఓ మూడు సంవత్సరాలు గడిపాడు. ఓ రోజు దట్టమైన అరణ్యం గుండా ప్రయాణిస్తున్నాడు. అరుపులు, కేకలు వినపించాయి. ఏంటా అని చూస్తే, ఓ నలుగురు యువకులు గొడవపడుతున్నారు.

కొసక్ వీరుడు వాళ్ళ వద్దకు వెళ్ళి గొడవను ఆపాడు. కారణమేమిటి? అని అడిగాడు.

వాళ్ళు ఇలా చెప్పసాగారు.

“మేము నలుగురు అన్నదమ్ములం. మా వద్ద నాలుగు విలువైన వస్తువులున్నాయి. మొదటిది, ఎపుడడిగితే అపుడు ఆహారాన్ని, నీటినీ ప్రసాదించే గుడ్డ సంచి. రెండవది అడిగిన పనిని క్షణాల్లో చేసిపెట్టే రబ్బరు



సంచి. మూడవది నీటిపై నడవగలిగే పాదరక్షలు. నాలుగవది ఆకాశంలో ఎగరగల గుర్రం.
కానీ ఒకే వస్తువుని ఇద్దరు కావాలనుకోవడం వల్ల గొడవ మొదలైంది.

ఇది వినగానే తన సోదరుల వద్ద విలువైన వస్తువుల్ని కాజేసిన దొంగల ముఠా వీళ్ళేనని అర్థమైంది.

కొసక్ వీరుడు ఇలా అన్నాడు. "మీకు నా మాట మీద గౌరవం ఉంటే, నేనొక ఉపాయం చెప్తాను. అపుడు మీ సమస్య సులువుగా పరిష్కారమవుతుంది."

"సరే చెప్పండి" అన్నారు నలుగురు.

" మీ వద్ద ఉన్న నాలుగు విలువైన వస్తువుల్ని, ఇక్కడ వరుసగా పెట్టండి. అర కిలోమీటరులో ఉన్న బిర్చి చెట్టు వద్దకు వెళ్ళి వరుసగా నిలబడండి. నేను చేయి ఊపగానే పరుగు పందెం ప్రారంభించండి.

పరుగుపందెంలో ప్రథమ విజేతకు, నాలుగు విలువైన వస్తువుల్లో, నచ్చిన ఒక వస్తువును ఎంచుకునే అవకాశం ఉంటుంది. రెండవ స్థానంలో వచ్చిన వ్యక్తికి మిగిలిన మూడువస్తువుల్లో ఓ దానిని ఎంచుకుంటాడు. మూడవ స్థానంలో వచ్చిన వ్యక్తి మిగిలిన రెండు వస్తువుల్లో ఓ దానిని ఎంచుకుంటాడు. నాలుగవ స్థానంలో వచ్చిన ఆఖరి వ్యక్తికి ఆఖరుగా మిగిలిన వస్తువు లభిస్తుంది." అన్నాడు కొసక్ వీరుడు.

ఈ పందెం చాలా న్యాయంగా, ధర్మంగా అనిపించింది అన్నదమ్ములకు.

నాలుగు విలువైన వస్తువులు వరుసలో ఉంచారు. అర కిలోమీటరు దూరంలో ఉన్న బిర్చి చెట్టు వద్దకు వెళ్ళారు. కొసక్ వీరుడు చేతితో సంజ్ఞ

చేసాడు. వాళ్ళు పరుగు పందెం ప్రారంభించారు.

కొసక్ వీరుడు క్షణాల్లో, పాదరక్షలు, గుడ్డసంచి, రబ్బరు సంచి తీసుకుని, గుర్రాన్ని అధిరోహించి ఆకాశంలో వాయు వేగంతో ఎగురుతూ మాయమైయ్యాడు.

తన ముగ్గురు సోదరులకు వాళ్ళ విలువైన వస్తువులను తిరిగి అప్పగించి, తను ఎగిరే గుర్రాన్ని ఉంచుకుందాం అనుకున్నాడు కొసక్ వీరుడు.

వాళ్ళ కోసం వెదుకులాట ప్రారంభించాడు. ఎంతో వెతకగా ఓ రోజు, ఓ పెద్ద భవనం ముందు నిలబడి నీరు అడిగాడు. ఆ భవన యజమాని కొసక్ వీరుడుని గుర్తు పట్టాడు. ఆ భవన యజమాని ఎవరో కాదు కొసక్ వీరుని మొదటి తమ్ముడు. జరిగిన కథంతా చెప్పి 'గుడ్డ సంచి' ఇవ్వబోయాడు. మొదటి తమ్ముడు 'గుడ్డ సంచి' ని సున్నితంగా తిరస్కరించాడు.

"అన్నయ్యా! నువ్వు నాకిచ్చిన రాగి నాణెం, నాకు అదృష్టాన్ని తెచ్చి పెట్టింది. కష్టపడ్డాను. సిరి సంపదలు పొందాను. కాబట్టి ఆ గుడ్డ సంచిని నువ్వే ఉంచుకో" అన్నాడు మొదటి తమ్ముడు.

ఇదే విధంగా రెండో తమ్ముడుని, మూడవ తమ్ముడిని కూడా కనిపెట్టాడు. వాళ్ళు కూడా కొసక్ వీరుడిచ్చిన రాగి నాణెంను పెట్టుబడిగా పెట్టి, బాగా ధనం సంపాదించారు.

ఆనందంగా నిజాయితీగా జీవిస్తున్నారు. రబ్బరు సంచిని, పాదరక్షల్ని కొసక్ వీరుడినే ఉంచుకోమని కోరారు.

కొసక్ వీరుడు తిరిగి తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. గుర్రంపై ఎగురుతూ ఓ ప్రదేశంలో ఆగి ఓ గుడారాన్ని కట్టివ్వమని రబ్బరు సంచిని అడిగాడు. క్షణాల్లో ఓ గుడారం ప్రత్యక్షమైంది. రుచికరమైన భోజనం, స్వచ్ఛమైన

త్రాగేనీరు కావాలని గుడ్డసంచిని అడిగాడు. క్షణాల్లో కోరినవన్ని ప్రత్యక్షమైయ్యాయి. తృప్తిగా తిని విశ్రాంతి తీసుకున్నాడు.

తిరుగుప్రయాణం ప్రారంభించి ఓ వింత రాజ్యాన్ని చేరాడు. అక్కడ ప్రజలు నోళ్ళల్లో ఓ కథ నానుతోంది. అదేంటంటే మహారాజు ఓ చాటింపు వేయించాడు. దాని ప్రకారం రాజు కోటకెదురుగా ఉన్న ఓక్ చెట్టు కింద రహస్య నిధి దాగి ఉంది. ఎవరైతే ఆ ఓక్ చెట్టుని పడగొట్టి, నిధిని కనిపెట్టి, రాజుకు అప్పగిస్తారో, వారికి రాజకుమారితో వివాహం జరిపించి, అర్ధరాజ్యం ఇస్తారు. ఒక వేళ పరీక్షలో ఓడిపోతే మరణ శిక్ష విధిస్తారు. ఇది విని కొసక్ వీరుడు, రాజుని కలిసాడు. పరీక్షలో పాల్గొనటానికి తాను సిద్ధం అన్నాడు.

పరీక్ష మొదలైంది. కొసక్ వీరుడు అర్ధరాత్రి, ఓక్ చెట్టు వద్దకు వెళ్ళాడు. తన రబ్బరు సంచిని బయటకు తీసాడు.

“ఈ ఓక్ చెట్టును, వేళ్ళను నరకండి”. అని ఆజ్ఞాపించాడు. ఆశ్చర్యం, క్షణాల్లో భారీ ఓక్ చెట్టు మొత్తం చిన్న చిన్న చెక్క ముక్కలుగా నరికి వేయబడింది. దాని మొదట్లో విలువైన వజ్రవైఢూర్యాలు, కెంపులు, మరకతమణులు బయటపడ్డాయి.

కొసక్ వీరుడు, రాజుకి కబురు చేసాడు. మహారాజు ఇచ్చిన మాట ప్రకారం తన అందాల కుమార్తెతో వివాహం జరిపించాడు. సాధారణ కొసక్ వీరుడుని పెళ్ళాడటం రాజకుమారికి ఇష్టం లేదు. కాని తండ్రి మాటని కాదనలేక వివాహానికి ఒప్పుకుంది.

అర్ధరాజ్యం వల్ల ప్రయోజనం లేదని ఇస్తే పూర్తి రాజ్యం ఇవ్వాలని, లేదంటే అసలుకి ఏదీ వద్దని అన్నాడు కొసక్ వీరుడు, పూర్తి రాజ్యం ఇవ్వటం కుదరదని చెప్పాడు మహారాజు.

అలా అయితే తన దారి తాను చూసుకుంటాను అన్నాడు కొసక్ వీరుడు. గుర్రంపై తన భార్యని కూర్చోపెట్టుకుని ఎగిరిపోయాడు.

అలా ఆకాశంలో ఎగురుతూ తాను నివశించటానికి అనువైన, సురక్షితమైన ప్రత్యేక ప్రదేశం కోసం వెతికాడు. నల్ల సముద్రం మీద ఉన్న ఓ దీవి అతనికి నచ్చింది. అది నిర్మానుష్యంగా ఉంది. క్రూర మృగాల భయం లేదు. రబ్బరు సంచి సాయంతో ఓ గృహాన్ని నిర్మించుకున్నాడు. చేతి సంచి సాయంతో వాళ్ళ తిండికి డోకా లేదు. ఎగిరే గుర్రం వల్ల అపుడపుడూ వ్యాహ్యాళికి వెళ్ళేవారు.

కొద్దిరోజులు గడిచాక, ఓ రోజు కొసక్ వీరుడు గాఢ నిద్రలో ఉన్నాడు. అతని భార్య, గుడ్డ సంచిని, రబ్బరు సంచిని తీసుకుని, గుర్రంపై ఎక్కి సొంత రాజ్యానికి ఎగిరిపోయింది.

కొసక్ వీరుడు నిద్రలేచాకా, జరిగిన మోసాన్ని గ్రహించాడు. పాదరక్షల్ని ధరించి నల్ల సముద్రంపై నడవసాగాడు.

అలా కొన్నిరోజులు నడిచాకా చివరకి నల్ల సముద్రం దాటి ఓ అరణ్యానికి చేరాడు. నడిచి నడిచి అలసిపోయాడు. విపరీతంగా ఆకలి వేస్తోంది. ఎర్ర బెర్రి పండ్ల చెట్టు కనిపించింది. రెండు ఎర్ర బెర్రి పండ్ల ను తిన్నాడు. అతని తలపై రెండు కొమ్ములు మొలిచాయి. ఇలా జరిగిందేంటబ్బా అని బాధ పడ్డాడు. నిశితంగా గమనించాకా కొద్దిదూరంలో ఓ నీలి బెర్రి పండ్ల చెట్టు కనిపించింది. రెండు నీలి బెర్రీలు తిన్నాడు. ఆశ్చర్యం తలపై రెండు కొమ్ములు మాయమయ్యాయి. గండం గడిచినందుకు సంతోషించాడు. ఎర్ర బెర్రీలను, నీలి బెర్రీలను సేకరించాడు. తన భార్య రాజ్యం వైపు ప్రయాణించాడు. మారువేషం ధరించాడు.

**"తాజా బెర్రీలు!**

**తాజా బెర్రీలు!**

**రుచికరమైన బెర్రీలు. . .**

**తిని చూడండి.**

**స్వర్గాన్ని తాకండి."**

ఇలా పాడుతూ రాజ భవనం ముందు అమ్మసాగాడు.

ఈ వార్త విని రాకుమారిని చేరింది. కొన్ని వెండి నాణాలకు బెర్రీలు కొనమని, పరిచారికను పంపింది.

కొసక్ వీరుడు తెలివిగా ఎర్ర బెర్రీలను పరిచారికకు అమ్మాడు. ఆశ్చర్యం వాటిని తిన్న రాకుమారికి తలపై కొమ్ములు మొలిచాయి. చూడటానికి అంద విహీనంగా కనిపిస్తోంది. వార్త తెలిసిన మహారాజు తను ఓ రెండు ఎర్రబెర్రీలను తిన్నాడు. ఆశ్చర్యం మహారాజు తలపైన రెండు కొమ్ములు మొలిచాయి.

రాజు రాజవైద్యులను పిలిపించాడు. తరుణోపాయం చెప్పమని ఆజ్ఞాపించాడు. ఎన్నో రకాల పసరులు, మందులు వాడినా ఏ మాత్రం ప్రయోజనం లేదు. రాకుమారి తీవ్రంగా ఏడ్చింది. దిగులుతో మంచం పట్టింది. ఈ లోగా రాకుమారికి, మహారాజుకు కొమ్ములు మొలిచాయన్న వార్త రాజ్యం మొత్తం దావానలంలా వ్యాపించింది. ప్రజలు నవ్వుకున్నారు. కొమ్ములున్న రాజు తమని పరిపాలించటానికి వీల్లేదని, ప్రజల్లో తిరుగుబాటు ప్రారంభమైంది. గూఢచారుల ద్వారా విషయం తెలుసుకున్న రాజు మరల చాటింపు వేయించాడు.

"ఎవరైతే మహారాజుకి ఆయన కూతురైన రాకుమారికి కొమ్ములు

మాయం చేస్తారో, వారికి పూర్తి రాజ్యం ఇచ్చి మహారాజు పట్టాభిషేకం జరిపిస్తారు. ఓడిపోతే మరణ శిక్ష విధిస్తారు".

కొందరు యువకులు ప్రయత్నించారు. కాని విఫలమైయ్యారు. ఉరి కొయ్యకు వేలాడారు.

కొసక్ వీరుడు మహారాజుని కలిసాడు.

రెండు నీలి బెర్రీలు ఇచ్చాడు. అవి తినగానే మహారాజు తలపై కొమ్ములు మాయమయ్యాయి.

తన భార్యకి కూడా రెండు నీలి బెర్రీలు ఇచ్చాడు. అవి తినగానే ఆమె తలపై ఉన్న కొమ్ములు కూడా మాయమైనాయి.

ఇది చూసి రాజోద్యోగులు కరతాళ ధ్వనులు చేసారు.

తను చేసిన మోసానికి, రాకుమారి క్షమాపణలడిగింది. మంచి మనసుతో కొసక్ వీరుడు క్షమించాడు.

మహారాజు మాట ప్రకారం పూర్తి రాజ్యాన్ని కొసక్ వీరుడికి అప్పగించి చక్రవర్తిగా పట్టాభిషేకం చేసాడు.

కొసక్ వీరుడు న్యాయంగా, ధర్మంగా ప్రజల్ని పరిపాలిస్తూ ఎంతో పేరు తెచ్చుకున్నాడు. ఆ రాజ్యం ఈ నాటికీ సుభిక్షంగా ఉంది.

| | | |
|---|---|---|
| English Title | : | The Cossack Mamariha |
| Writer | : | Ukrainian folk tale |
| English Translation | : | Mary skrypnyk |
| Illustration | : | Yuli kryha |



# తెలివైన అన్నదమ్ములు

## ఉజ్బెక్ జానపద కథ

అనగనగా ఒక ఊరిలో ఒక ముసలాయన నివసించేవాడు. అతను చాలా తెలివిగలవాడుగా పేరు తెచ్చుకున్నాడు. అతనికి ముగ్గురు కొడుకులు. ముసలాయన జబ్బు పడ్డాడు.

తన ముగ్గురు కొడుకుల్ని పిలిచి ఇలా అన్నాడు. "ప్రియమైన కొడుకుల్లారా! నేను మీకు వ్యవసాయం చేసుకోవటానికి పొలం ఇవ్వలేదు. ఖర్చు పెట్టుకోవటానికి ధనం ఇవ్వలేదు. ధరించటానికి బంగారం ఇవ్వలేదు. కాని వీటన్నిటికంటే విలువైన 'తెలివితేటలు' అనే ఆయుధాన్ని ఇచ్చాను. దాన్ని మీరు సద్వినియోగం చేసుకోండి. మీ జీవితం బాగవుతుంది".

ఇలా చెప్పిన కొన్ని గంటలకి ముసలాయన కన్ను మూసాడు.

ముగ్గురు అన్నదమ్ములు చర్చించుకున్నారు. దేశాటన చేద్దామని, తెలివితేటలు ఇంకా పెంచుకుందామని నిర్ణయించుకున్నారు. కొంత ఆహారాన్ని, పళ్ళని మూటకట్టుకుని, దేశాటనకి బయలుదేరారు. వాళ్ళు ఖాళీ సెప్ట్ మైదానాలును, దట్టమైన అరణ్యాలను, ఎగుడు దిగుడు కొండలను దాటారు. అలా ఓ నలభై రోజులు నడిచారు. వారు తమవెంట తెచ్చుకున్న ఆహార పదార్థాలు అయిపోయాయి. వాళ్ళకి ఇప్పుడు విపరీతంగా ఆకలేస్తోంది. దాహమేస్తోంది. తాగటానికి చుక్కనీరు లేదు.

కొద్ది సేపటి తర్వాత వాళ్ళకి చెట్లు కనిపించాయి. చెట్లు దాటాకా ఓ నగరం కనిపించింది. హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు. ఓపిక తెచ్చుకుని వేగంగా నడవసాగారు.

అలా వాళ్ళు నడుస్తూ ఉండగా, ఉన్నట్టుండి పెద్దతను ఆగాడు. చుట్టుపక్కల ప్రదేశాన్ని నిశితంగా గమనించాడు. ఇలా అన్నాడు. “ఒక ఒంటె మనకంటే ముందు ఈ ప్రదేశం నుండి నడిచి వెళ్ళింది”.

నాలుగైదు అడుగులు నడిచాకా, మధ్యతను ఇలా అన్నాడు. “ఆ ఒంటెకు ఎడమ కన్ను మాత్రమే కనిపిస్తుంది. కుడి కన్ను గుడ్డిది.”

ఇంకొన్ని అడుగులు నడిచాకా, చిన్నతను ఇలా అన్నాడు. “ఓ మహిళ ఒంటెపై ప్రయాణిస్తోంది.”

కొద్ది దూరం ప్రయాణించాకా వాళ్ళకి గుర్రంపై ఓ యోధుడు కనిపించాడు. అతడి నడుముకు పొడవైన కత్తి వేలాడుతోంది.

పెద్దతను యోధుడుతో ఇలా అన్నాడు.

"మీరు దేనికోసమైనా వెతుకుతున్నారా?"

"అవును" అని సమాధానమిచ్చాడు యోధుడు.

"మీరు వెతుకున్నది ఒంటెకోసమేనా?" అడిగాడు పెద్దతను.

"అవును" అన్నాడు యోధుడు.

'ఆ ఒంటెకు ఎడమ కన్ను మాత్రమే కనిపిస్తుందా? కుడికన్ను గుడ్డిదా?" ప్రశ్నించాడు మధ్యతను.

"అవును" అన్నాడు యోధుడు.

"ఆ ఒంటెపై ఓ మహిళ ప్రయాణిస్తోందా?" ప్రశ్నించాడు చిన్నతను.

"అవును" అయితే మీకు నా ఒంటె దొరికినట్లుంది. దాన్ని ఎక్కడ దాచారొ చెప్పండి, అన్నాడు యోధుడు హెచ్చు స్వరంతో.

" మేము నీ ఒంటెను చూడలేదు" అన్నారు ముగ్గురు అన్నదమ్ములు ముక్తకంఠంతో.

"మీరు ఒంటెను చూడనట్లయితే, ఈ వివరాలన్నీ ఇంత ఖచ్చితంగా ఎలా చెప్పగలరు.? అని ప్రశ్నించాడు యోధుడు.

"మేము మా తెలివితేటలతో ఊహించాము. నీ ఒంటె ఈ ఉత్తరం దిక్కువైపు వెళ్ళింది. నీవు త్వరగా బయలుదేరు. దాన్ని చేరుకోవచ్చు." అని సమాధానమిచ్చారు ముగ్గురు అన్నదమ్ములు.

"నేను నమ్మను. ఒంటెను మీరే ఎక్కడో బంధించారు" అని కోపంగా అన్నాడు యోధుడు.

యోధుడు రాజభటుల సాయంతో వాళ్ళని బంధించి ఆ రాజ్యంలోని మహారాజు ఎదుట ప్రవేశ పెట్టారు.

ఆ యోధుడు ఆ రాజ్యంలో సైనికాధికారికి ముఖ్య అనుచరుడు. అతను తన పశు సంపదని కొండలు దాటిస్తుండగా, అతని భార్య ఒంటెపై అతన్ని అనుసరించింది. ఆమె అలసిపోయి, దారి తప్పింది. ఇదీ కథ. యోధుడు చెప్పిన కథంతా మహారాజు శ్రద్ధగా విన్నాడు.

మహారాజు ముగ్గురు అన్నదమ్ముల్ని ఇలా ప్రశ్నించాడు.

"ఓ దొంగల్లారా! ఒంటెని ఎక్కడ బంధించారు? యోధుడి భార్యని ఏం చేసారు?"

"మేము ఒంటెని, యోధుడి భార్యని చూడలేదు." అన్నారు ముగ్గురు అన్నదమ్ములు.

"యోధుడు ఏ వివరాలు మీతో చెప్పలేదు. మీరే ఒంటె గురించి, దాని గుడ్డి కన్ను గురించి, అతని భార్య గురించి అతడితో చెప్పారు. మీరు చూడకుండా, ఇన్ని వివరాలు ఎలా చెప్పగలరు?" అని ప్రశ్నించాడు మహారాజు.

దయగల మహారాజా!

" మేము ఈ భూ ప్రపంచంలో ఎంతో తిరిగాము. ఎన్నో సంతోషాల్ని, బాధల్ని చూసాము. మా నాన్నగారు మాకు తెలివితేటల్ని వారసత్వంగా ఇచ్చి వెళ్ళిపోయారు. మేము కేవలం మా తెలివి తేటల్ని ఊహాశక్తిని ఉపయోగించి, ఒంటె గురించి, కన్ను గురించి, మహిళ గురించి ఊహించగలిగాము." అన్నారు అన్నదమ్ములు.

"మహారాజు ముగ్గురు అన్నదమ్ముల్ని పరీక్షించాలనుకున్నాడు.

మహారాజు తన ఆంతరంగిక సలహాదారుడి చెవిలో ఏదో రహస్యంగా చెప్పాడు.



కొద్దిసేపటి తర్వాత, ఇద్దరు సేవకులు ఒక పెట్టెను చెక్క బల్లపై మోసుకొని వచ్చారు.

సేవకులు ఆ పెట్టెను మోసుకొస్తున్న తీరును, ముగ్గురు అన్నదమ్ములు నిశితంగా గమనించారు.

మహారాజు ఇలా అన్నాడు.

"ఓయ్ దొంగల్లారా! మీకో పరీక్ష. ఆ పెట్టెలో ఏముందో మీరు ఖచ్చితంగా చెప్పగలిగితే మీకు ప్రాణభిక్ష లభిస్తుంది. చెప్పలేకపోయారో మీకు మరణ శిక్ష విధిస్తాను."

"ఖచ్చితంగా ఏదో ఉంది" అన్నాడు పెద్దతను.

"అది గుండ్రటి ఆకారంలో ఉంది"అన్నాడు మధ్యతను.

"పెట్టెలో ఉన్నది దానిమ్మ పండు" అన్నాడు చిన్నతను.

మహారాజు పెట్టెను తెరిచాడు. ఆశ్చర్యం. అందులో ఒక దానిమ్మ పండు మాత్రమే ఉంది. ఈ దృశ్యం చూసి మహారాజు, యోధుడు, సభకులంతా ఆశ్చర్యపోయారు.

మహారాజు యోధుడితో ఇలా అన్నాడు.

"యోధా! వీళ్ళు దొంగలు కాదు. అపరిమితమైన ఊహాశక్తి గల మేధావులు. నీవు వెళ్ళి ఒంటెను, నీ భార్యని గాలించు. అవసరమైతే మన సైనికుల సాయం తీసుకో".

"చిత్తం మహారాజా అని యోధుడు సభ నుండి వెళ్ళిపోయాడు.

మహారాజు, సభకులు కరతాళ ధ్వనుల్తో అన్నదమ్ముల్ని అభినందించారు.

మహారాజు స్వయంగా, ఒక ప్లేటులో రొట్టెను తీసుకుని వచ్చి అన్నదమ్ములకు ఇచ్చాడు.

వాళ్ళు రొట్టెను కొంచెం తిని, మిగిలినది చేతి రుమాలులో దాచుకున్నారు.

మహారాజు మనసులో అనుమానం ఇంకా తొలగలేదు.

వాళ్ళు దొంగలేమో అన్న సందేహం ఇంకా ఉంది అతనికి.

"మీరు మా అతిథి గృహంలో విశ్రాంతి తీసుకోండి" అన్నాడు మహారాజు.

అన్నదమ్ములు మహారాజుకి కృతజ్ఞతలు చెప్పి, అతిథి గృహం వైపు వెళ్ళారు

ఈలోగా మహారాజు మారువేషంలోకి మారి, సాధారణ పౌరుడిలా వాళ్ళని రహస్యంగా అనుసరించాడు. అతిథి గృహానికి చేరాకా ముగ్గురు అన్నదమ్ములు తేనీరు సేవిస్తూ ఇలా మాట్లాడుకోసాగారు.

"నువ్వేమి గమనించావు? తమ్ముడూ" అడిగాడు పెద్దతను.

"మరి నువ్వేమి గమనించావు అన్నయ్య" అడిగాడు చిన్నతను.

"నేననుకోవటం, మహారాజు సాధారణ కుటుంబం నుండి వచ్చాడు. అతను ఓ రొట్టెల కొట్టు యజమాని  కుమారుడై ఉండవచ్చు." అన్నాడు పెద్దతను.

వీళ్ళ సంభాషణ అంతా, చెట్టు చాటున మారువేషంలో ఉన్న మహారాజు విన్నాడు. తన చెవుల్ని తానే నమ్మలేక పోయాడు.

మహారాజు వెనువెంటనే తన తల్లి దగ్గరకు వెళ్ళాడు.

"అమ్మ నేను రాజవంశంలో పుట్టానా? లేక సాధారణ కుటుంబంలో పుట్టానా?" అని అడిగాడు.

"ఎందుకలా అడుగుతున్నావు?" అంది తల్లి.

"నేను ఎక్కడ పుట్టానో నాకు ఖచ్చితంగా తెలీదు. కాబట్టి అడిగాను" అన్నాడు మహారాజు.

తల్లి ఇలా చెప్పడం ప్రారంభించింది.

"నా భర్త మహారాజు. మాకు పిల్లలు కలగలేదు. మావద్ద ఒక రొట్టెల వర్తకుడు పనిచేసేవాడు. రొట్టెల వర్తకుడి భార్య, పండంటి బిడ్డకు జన్మనిచ్చి, దురదృష్ట వశాత్తు చనిపోయింది. ఓ వర్షపు రోజు రాత్రి రొట్టెల వర్తకుడు మా వద్దకు వచ్చాడు. గుడ్డలో చుట్టిన పసికందును మాకు అప్పగించాడు. ఈ బాబుని మీ బిడ్డలా పెంచండి. ఈ రహస్యాన్ని ఎవ్వరికీ చెప్పకండి. అని చెప్పి ఎక్కడికో వెళ్ళిపోయాడు ఆ రొట్టెల వర్తకుడు. మహారాజు ఆ పసికందును ఎంతో అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేసాడు. మహారాజు తదనంతరం, ఆ పిల్లవాడు యువరాజు అయ్యాడు. ఇదీ నీ జన్మరహస్యం"

తన తల్లికి కృతజ్ఞతలు చెప్పి మహారాజు అక్కడినుండి నిష్క్రమించాడు. తరువాత రోజు మహారాజు, ముగ్గురు అన్నదమ్ముల్ని తన ఆంతరంగిక మందిరానికి పిలిచాడు.

వాళ్ళను చాలా గౌరవంగా ఆహ్వానించాడు. వివిధ రకాల ఫలాలను, అద్భుతమైన వంటలను వాళ్ళ ముందు పెట్టాడు.

మహారాజు ఇలా అన్నాడు.

"నా ప్రియమైన అతిథులారా! స్వాగతం. ఒంటెను పోగొట్టుకున్నావా?

అని యోధుడిని ప్రశ్నించింది. ఎవరు.?"

"అది నేనే" అని మహారాజుకి వంగి నమస్కరించాడు పెద్దతను.

" అతను ఒంటెను పోగొట్టుకున్నాడని నీవెలా ఊహించావు?" అడిగాడు మహారాజు.

గౌరవనీయులైన మహారాజుగారూ! ఒంటె పాదముద్రల్ని నేను గుర్తుపట్టాను. ఆ యోధుడి మొఖంలో వెతుకులాట కనిపించింది. కాబట్టి అతడు ఒంటెను పోగొట్టుకొన్నాడని గ్రహించాను." అని సమాధానం చెప్పాడు పెద్దన్న.

"ఒంటెకు ఎడమ కన్ను మాత్రమే కనిపిస్తోందని, కుడి కన్ను గుడ్డిదని మీలో ఎవరు ఊహించారు?" ప్రశ్నించాడు మహారాజు.

"అది నేనే" అని మహారాజుకి వంగి నమస్కరించాడు రెండో వాడు.

"ఒంటెను చూడకుండానే, దాని కుడి కన్ను గుడ్డిదని ఎలా ఊహించావు?" అని అడిగాడు మహారాజు.

"గౌరవనీయులైన మహారాజుగారూ! ఒంటె ప్రయాణించిన మార్గంలో, రహదారికి ఎడమ వైపు మాత్రమే, చెట్ల చిగుళ్ళు కొరకబడ్డాయి. కుడివైపు చెట్ల చిగుళ్ళు అలానే వున్నాయి. కాబట్టి దానికి ఎడమ కన్ను మాత్రమే కనిపిస్తుందని ఊహించగలిగాను". అని సమాధానమిచ్చాడు మధ్యతను.

"ఒంటెపై ప్రయాణిస్తున్నది మహిళ అని ఎవరు ఊహించారు? ఎలా ఊహించారు?" అడిగాడు మహారాజు.

"అది నేనే" అని మహారాజుకి వంగి నమస్కరించాడు మూడోవాడు.

"గౌరవనీయులైన మహారాజుగారూ! ఒంటె ఒక ప్రదేశంలో విశ్రాంతి తీసుకున్న గుర్తులు కనిపించాయి. దాని పక్కనే స్త్రీ పాదముద్రలు గమనించాను. ఇలా ఊహించగలిగాను."

"మరి పెట్టెలో ఉన్నది దానిమ్మ పండు అని ఎలా ఊహించారు." ప్రశ్నించాడు మహారాజు.

"ఇద్దరు సేవకులు ఆ పెట్టెను మోసుకొచ్చారు. వాళ్ళు మోసుకొచ్చిన తీరు చూస్తూ అందులో బరువైన వస్తువు లేదని అర్థమవుతోంది. రాజాజ్ఞ కాబట్టి ఖచ్చితంగా ఏదో ఒకటి పెట్టెలో ఉంటుందని ఊహించాను" అన్నాడు పెద్దతను.

"లోపల ఏదో కదులుతున్న శబ్దం వినిపించింది. కాబట్టి అది గుండ్రంగా ఉంటుందని ఊహించాను." అన్నాడు రెండో వాడు.

"రాజ దర్బారుకి వచ్చేదారిలో దానిమ్మ చెట్లను చూసాను. ఆ గుండ్రంగా ఉన్న వస్తువు సాధారణ వస్తువు అయివుంటుందని, అది దానిమ్మ పండు అని ఊహించాను." అన్నాడు చిన్నతను.

"ఓ ! అలాగా" అన్నాడు మహారాజు.

"మరి నేను రాజ వంశంలో పుట్టలేదని, రొట్టెల వర్తకుడి కుమారుడనని ఎలా ఊహించగలిగారు?" ప్రశ్నించాడు మహారాజు.

చిన్నతను వంగి నమస్కరించి ఇలా చెప్పసాగాడు.

"గౌరవనీయులైన మహారాజా! మేము పెట్టెలో ఉన్నది దానిమ్మ పండు అని కనిపెట్టాక, మీరు స్వయంగా పళ్ళెంలో రొట్టెని తెచ్చి ఇచ్చారు. అభినందించారు. కానీ ఇతర దేశాల రాజులైతే, బంగారం ఇచ్చేవారు. లేదా

ఉన్నత పదవులు ఇచ్చేవారు. మీరు మాత్రం రొట్టెను ఇచ్చారు. అంటే మీ దృష్టిలో రొట్టె, బంగారమూ, పదవీ కంటే విలువైనవి. కాబట్టి మీరు రొట్టెల వర్తకుడి కుటుంబంలో పుట్టుంటారని ఊహించాము.”

మహారాజు చప్పట్లు కొట్టాడు. ముగ్గురు అన్నదమ్ముల తెలివితేటలను, ఊహాశక్తిని ఎంతో పొగిడాడు. వాళ్ళ ముగ్గురిని తన ఆంతరంగిక సలహాదారులుగా నియమించాడు. వాళ్ళకి సకల భోగభాగ్యాలు కల్పించాడు.

ఆ ముగ్గురి అన్నదమ్ముల సలహాలు పాటిస్తూ, సత్యాన్ని, ధర్మాన్ని కాపాడుతూ, ప్రజల్ని ప్రేమగా పరిపాలిస్తున్నాడు. ఆ రాజ్యంలో ప్రజలు సుఖశాంతులతో సంతోషంగా జీవించారు.

| | | |
|---|---|---|
| English Title | : | The Quick Witted Brothers |
| Writer | : | An Uzbek folk tale |
| English Translation | : | W. May |
| Illustration | : | V. Gubarev |



# బుజ్జి సూర్యుడు

## ఆర్మీనియన్ కథ

## హెడ్‌జాక్ గయుల్నాజర్యాన్

అనగనగా ఒక ఊరిలో ఆర్థర్ అనే చిన్న పిల్లవాడు వుండేవాడు. ఆ ఊరు ఆర్మీనియా పట్టణానికి దగ్గరలో వుంది. వాళ్ళ ఊరి దగ్గరలో 'గార్ని దేవాలయం' వుంది. అది సూర్య దేవాలయం. 1679 వ సంవత్సరంలో భూకంపం కారణంగా అది తీవ్రంగా దెబ్బతింది. దాన్ని తిరిగి మళ్ళీ కట్టారు. దేదీప్యమానంగా ప్రకాశించే సూర్య కిరణాలు ఆ గుడి పరిసరాల్ని ప్రకాశింపచేస్తుండేవి.

ప్రతి వసంతకాలం ఆర్థర్ వాళ్ల అమ్మ, తన భర్తతో ఇలా అనేది "ఏమండీ! సంతకు వెళ్ళి కొన్ని ఆపిల్ పండ్లు, ద్రాక్ష కొనుక్కొని రండి. మన

ఆర్థర్‌కు విటమిన్లు వున్న పోషకాహారం కావాలి".

నాన్న 'సరే' నని సంతకు వెళ్ళేవాడు. ఇది విన్న ఆర్థర్‌కు అర్థమయ్యేది కాదు. ఎందుకంటే వాళ్ళ ఇంట్లో జేజమ్మ వుంది. "ఆమెకు విటమిన్లు వున్న పోషకాహారం అక్కర్లేదా?" అని పిల్లవాడి సందేహం. జేజమ్మ ఏది వుంటే అది తినేది. ఇది కావాలి, అని ఎప్పుడూ అడిగేది కాదు.

ఆర్థర్ మాత్రం గారాలు పోతూ, తనకు కావాల్సినవి నాన్నను అడిగి తెప్పించుకునే వాడు.

ఆ రోజు ఆరు బయట వర్షం జల్లుగా కురుస్తుంది. జేజమ్మ వరండాలో నులక మంచంపై పడుకొని వుంది.

"ఓఫ్..ఓఫ్..ఓఫ్..ఫ్" అని పొడి దగ్గు దగ్గుతోంది. "జేజమ్మా..!" అని అరుస్తూ పిల్లవాడు ఆమె వద్దకు వెళ్ళాడు. "ఏంటి నా బంగారు తండ్రీ..!" అంది జేజమ్మ.

"మళ్ళీ నీ కాలు నెప్పెడుతుంది కదూ!" అన్నాడు పిల్లవాడు.

"అవును నాన్నా" అంది జేజమ్మ.

"ఈ నారింజ కాయ తిను నీకు విటమిన్లు లభిస్తాయి. నీ కాలి నొప్పి తగ్గుతోంది" అన్నాడు పిల్లవాడు.

జేజమ్మ నవ్వింది.

"నారింజ నువ్వే తిను నాన్నా. నారింజ వల్ల నాకు ఉపయోగం లేదు. నాకు సూర్య కిరణాలు కావాలి. కానీ వర్షాల వల్ల సూర్యుడు మేఘాల వెనుక దాక్కున్నాడు" అంది జేజమ్మ.



ఇది విన్నాక మేఘాలపై కోపం వచ్చింది పిల్లవాడికి. మేఘాలపై యుద్ధం ప్రకటించాడు పిల్లవాడు.

తన బొమ్మ తుపాకీని తీసుకున్నాడు. బుజ్జి పెంపుడు కుక్క పిల్ల 'కొటో' ని తీసుకుని మిద్దెపైకి వెళ్ళాడు. ఆ సమయానికి వర్షం ఆగిపోయింది.

"నువ్వు మేఘాలపై మొరుగు, నేను నా తుపాకీతో మేఘాలను కాలుస్తాను" అని కుక్క పిల్లను ఆజ్ఞాపించాడు పిల్లవాడు.

"భౌ..భౌ...భౌ..భౌ...భౌ" అని కుక్క పిల్ల మొరగసాగింది. దాని అరుపులు కింద గదిలో వున్న వాళ్ళకే వినిపించి వుండవు. ఇక మేఘాలకేమి వినిపిస్తాయి? పిల్లవాడు 'బూమ్..బూమ్' అని బొమ్మ తుపాకీతో మేఘాల్ని కాల్చసాగాడు. ఆ సమయంలో పిల్లవాడి మొహం చాలా కోపంగా వుంది. ఎంత కాల్చినా మేఘాలు కొంచెం కూడా పక్కకు జరగట్లేదు. కుక్క పిల్ల ఎంత మొరిగినా ప్రయోజనం లేదు. చివరకు దాని నోరు నొప్పి పుట్టి ఊరుకుంది.

కారణమేమిటా అని ఆలోచించాడు ఆర్థర్. తన తుపాకి చిన్నది, మేఘాలు పెద్దవి కనుక అవి భయపడలేదని అనుకున్నాడు. జేజమ్మ దగ్గరకు వచ్చాడు. పిల్ల వాడి వెనుక బుజ్జి కుక్క పిల్ల తోక ఊపుకుంటూ వచ్చింది.

"జేజమ్మ! నా తుపాకితో మేఘాల్ని కాల్చాను. కొంచెం పక్కకు జరిగాయి. కానీ నా తుపాకి చిన్నది కాబట్టి అవి పూర్తిగా బెదరలేదు. సూర్యుడింకా బయటకు రాలేదు. నాకో పెద్ద తుపాకి కావాలి. అప్పుడు మేఘాల్ని తరిమేసి, నీ కోసం సూర్యుణ్ణి తీసుకొస్తా!" అన్నాడు పిల్లవాడు.

"నా బంగారు తండ్రి, ఎంత మంచి పని చేశావ్! నువ్వు మేఘాల్ని కొంచెం బెదరగొట్టావు. నా కాలి నొప్పి సగం తగ్గిపోయింది" అంది జేజమ్మ.

"అయితే, మిగిలిన నొప్పిని కూడా తగ్గించే మార్గం నాకు తెలుసు" అన్నాడు పిల్లవాడు.

"ఎలా" అంది జేజమ్మ.

"అమ్మా! నాకొక కాగితం కావాలి" అని అరుస్తూ వంట గదిలోకి పరుగెత్తాడు పిల్లవాడు. కుక్క పిల్ల తోక ఊపుకుంటూ పిల్లవాడి వెనకే తిరుగుతుంది. దానికి పిల్లవాడే ప్రపంచం.

"సొరుగులోంచి ఓ కాగితం తీసుకో!" అంది అమ్మ.

పిల్లవాడు ఓ ఖాళీ కాగితం, ఎర్ర రంగు పెన్సిల్ తీసుకున్నాడు. నేలపై బోర్లా పడుకున్నాడు. కాగితంపై సూర్యుని బొమ్మ గీయసాగాడు. కొద్దిసేపటికి ధగధగా వెలిగే ఎర్రటి సూర్యుడి బొమ్మ కాగితంపై ప్రత్యక్షమైంది. పిల్లవాడి మొహం వెలిగిపోయింది. బుజ్జి కుక్కపిల్ల బొమ్మ చుట్టూ గెంతుతుంది.

పిల్లవాడు సూర్యుని బొమ్మను తీసుకుని, జేజమ్మ వద్దకు వెళ్ళాడు.

"జేజమ్మ! చూడు నీ కోసం ఏం తెచ్చానో!" అన్నాడు పిల్లవాడు.

"ఏం తెచ్చావ్ నాన్నా!"అంది జేజమ్మ.

"నీ కోసం సూర్యుని బొమ్మ గీసాను" అన్నాడు పిల్లవాడు.

జేజమ్మ సూర్యుని బొమ్మ చూసి మనస్ఫూర్తిగా నవ్వింది.

"ఎంత అందమైన ఎర్రటి సూర్యుడు, చాలా వెచ్చగా వున్నాడు. నా కాలు దగ్గర వుంచుకుంటాను" అంది జేజమ్మ.

జేజమ్మ సూర్యుడి బొమ్మ వున్న కాగితాన్ని, నొప్పి వున్న కాలి వద్ద వుంచింది. కొద్ది క్షణాల తరువాత జేజమ్మ మొహంలో ఆనందం కనిపించింది.

"నా బంగారు తండ్రీ! నా కాలు నొప్పి పూర్తిగా తగ్గిపోయింది. నువ్వు తెచ్చిన బుజ్జి సూర్యుడి వెచ్చటి కిరణాలు, నా కాలు నొప్పిని పూర్తిగా తగ్గించాయి. భలే పని చేసావు శభాష్!" అంది జేజమ్మ.

పిల్లవాడిపై ముద్దుల వర్షం కురిపించింది.

సాయంత్రానికల్లా జేజమ్మ చక్కగా తిరగసాగింది.

నాన్న జేజమ్మతో ఇలా అన్నాడు "ఇప్పుడు నొప్పి ఎలా వుంది అమ్మా!"

"నా కాలు నొప్పి పూర్తిగా నయమైంది. నా మనవడు, బుజ్జి సూర్యుడు నొప్పిని నయం చేశారు" అంది జేజమ్మ.

నాన్నకు అర్థం కాలేదు. జేజమ్మ జరిగిన కథంతా చెప్పింది. ఆర్థర్ ముక్కు దురద పుడుతుంది. పిల్ల వాడు ముక్కు గీరుకుంటున్నాడు.

నాన్న ఆనందంగా నవ్వాడు. అమ్మ కూడా ఆ ఆనందంలో పాలు పంచుకుంది. "మన ఆర్థర్‌ను చూసి, చుట్టుపక్కల పిల్లలు బుద్ధి తెచ్చుకోవాలి" అన్నాడు నాన్న.

పిల్లవాడి భుజం తట్టి అభినందించాడు.

పిల్లవాడి బుజ్జి సూర్యుడి బొమ్మ నట్టింట్లో వరండాలో పడివుంది.

బుజ్జి కుక్క పిల్ల ఆ సూర్యుడి బొమ్మపై నిద్రపోసాగింది. "కోటో నిద్రలే! ఎవరైనా సూర్యుడిపై పడుకుంటారా? నిద్రలే, లేదంటే నీ పొట్ట కాలిపోతుంది" అని పిల్లవాడు కుక్క పిల్లని లేపసాగాడు. ఇదండీ పిల్లలూ!

బుజ్జి సూర్యుని కథ. మీరు కూడా రంగురంగుల బొమ్మలు గీసి వుంటారు. వాటి వెనుక ఇలాంటి ఓ కథ వుండే వుంటుంది. ఆ కథ నాకూ చెప్తారు కదూ..!

| | | |
|---|---|---|
| English Title | : | Little Arthur's Sun |
| Writer | : | Hadjak Gyulnazaryan |
| English Translation | : | Raduga Publishers |
| Illustration | : | Albert Yaralyan |



# నిప్పు పక్షి

## అలగ్జాండర్అఫనస్యేవ్

అనగనగా ఒక రాజ్యానికి బెరాండీ అనే రాజు వుండేవారు. అతనికి ముగ్గురు కొడుకులు. అందరికంటే చిన్న కొడుకు పేరు ఇవాన్. కోట ప్రాంగణంలో ఓ అందమైన ఉద్యానవనం వుండేది. దానిలో బంగారు ఆపిల్ పండ్లు కాసే చెట్టు వుండేది. ఆ చెట్టు అన్నా, దాని బంగారు ఆపిల్ పండ్లు అన్నా మహారాజుకి చాలా ఇష్టం.

ప్రతి రోజు రాత్రి బంగారు ఆపిల్ పండ్లు ఎవరో దొంగిలిస్తున్నారని మహారాజు గమనించారు. రక్షక భటుల్ని కావలాగా నియమించారు. కానీ ప్రయోజనం లేదు.

మహారాజు దిగులుతో

అన్నపానీయాలు తీసుకోవడం మానేశాడు.

ముగ్గురు కొడుకులు రాజు వద్దకు వచ్చి ఇలా అన్నారు "బాధపడకండి నాన్నగారు! మేము బంగారు ఆపిల్ చెట్టుకు కాపలా కాస్తాం, దొంగలని కనిపెడతాం".

సరేనన్నాడు మహారాజు.

మొదటి రోజు రాత్రి పెద్ద కొడుకు బంగారు ఆపిల్ చెట్టు కాపలాకి బయలుదేరాడు. కానీ, అతను ఉద్యానవనంలోని మెత్తటి గడ్డిపై పడుకొని నిద్రపోయాడు. "దొంగని కనిపెట్టావా?" అని అడిగాడు మహారాజు. "రాత్రంతా మేలుకొనే వున్నాను కానీ ఏ దొంగ రాలేదు నాన్న గారు" అన్నాడు పెద్ద కొడుకు.

రెండవ రోజు రాత్రి రెండవ కొడుకు బంగారు ఆపిల్ చెట్టు కాపలాకి బయలుదేరాడు. కానీ ఇతను కూడా నిద్రపోయాడు. "దొంగని కనిపెట్టావా?" అని అడిగాడు మహారాజు. "రాత్రంతా మేలుకొనే వున్నాను కానీ ఏ దొంగా రాలేదు నాన్నగారు" అన్నాడు రెండవ కొడుకు.

మూడవ రోజు రాత్రి చిన్న కొడుకు ఇవాన్ వంతు వచ్చింది. అతను జాగ్రత్తగా కనురెప్ప వాల్చకుండా రాత్రంతా కాపలా కాస్తున్నాడు. అర్ధరాత్రి అలికిడి వినిపించింది. కళ్ళు మిరుమిట్లు గొలిపే కాంతి ఆపిల్ చెట్టు చుట్టూ వెలుగుతుంది. తీరా చూస్తే దేదీప్యమానంగా వెలిగిపోయే ఓ నిప్పు పక్షి, బంగారు ఆపిల్ పండ్లు తింటుంది.

ఇవాన్ చెట్టెక్కాడు. నిప్పు పక్షిని పట్టుకున్నాడు. కాని అది తెలివిగా తప్పించుకొని మాయమైంది. కానీ దాని తోక నుండి ఓ ఈక ఊడి ఇవాన్ చేతిలో పడింది. తరువాత రోజు ఉదయం ఇవాన్ తండ్రి వద్దకు వెళ్ళాడు.

"దొంగని కనిపెట్టావా?" అని అడిగాడు మహారాజు. "కనిపెట్టాను నాన్న గారు. నిప్పు పక్షి ప్రతి రోజు రాత్రి మన తోటలోని బంగారు ఆపిల్ పండ్లను దొంగతనంగా తింటుంది. ఆ పక్షిని బంధించాలని చూశాను. కానీ అది ఒడుపుగా తప్పించుకొని, నాకు దాని తోక ఈకను మిగిల్చింది" అని నిప్పు పక్షి ఈకను చూపాడు ఇవాన్. మహారాజు చిన్న కొడుకు ఇవాన్‌ని అభినందించాడు. మహారాజు తన నిరాహారదీక్షను విరమించి, భోజనం చేశాడు.

కొన్ని రోజుల తరువాత....

మహారాజు తన ముగ్గురు కొడుకుల్ని పిలిచి ఇలా అన్నాడు. "మీలో ఎవరు నిప్పు పక్షిని బంధించి తీసుకొస్తారో వారే ఈ దేశానికి కాబోయే మహారాజు. వారి కోసమే ఈ సింహాసనం ఎదురుచూస్తూ వుంటుంది".

కొడుకులు తండ్రికి నమస్కరించి, సెలవు తీసుకున్నారు. ముగ్గురు కొడుకులు మూడు వేర్వేరు దిక్కుల్లో ప్రయాణం ప్రారంభించారు. పెద్ద కొడుకు తూర్పు దిక్కువైపు ప్రయాణించాడు. రెండవ కొడుకు పడమర దిక్కువైపు ప్రయాణించాడు. చిన్న కొడుకు ఇవాన్ దక్షిణ దిక్కువైపు ప్రయాణించాడు.

అలా ప్రయాణించి, ప్రయాణించి అలసిపోయాడు ఇవాన్. దట్టమైన అరణ్యంలో తన గుర్రాన్ని ఆపాడు. చెట్టు కింద సేద తీరాడు. ఇంతలోకి గాఢ నిద్రలోకి జారుకున్నాడు. నిద్రలేచి చూసేసరికి గుర్రం ఎముకలు మాత్రమే కనిపించాయి. ఏదో జంతువు గుర్రాన్ని వేటాడి తినినట్లు స్పష్టంగా తెలుస్తుంది.

తన గుర్రాన్ని కోల్పోయినందుకు బాధపడ్డాడు ఇవాన్.

ఈలోగా ఓ బూడిదరంగు తోడేలు అతని వద్దకు వచ్చింది.

"ఎందుకు దిగులుగా కూర్చున్నావు?" అడిగింది తోడేలు.

నా గుర్రాన్ని ఎవరో తినేశారు అని బాధగా సమాధానమిచ్చాడు ఇవాన్.

నన్ను క్షమించు. ఆకలికి తట్టుకోలేక నీ గుర్రాన్ని నేనే తినేశాను. అందుకు బదులుగా నీకు ఏ సాయం కావాలన్నా చేస్తాను మిత్రమా" అంది బూడిద రంగు తోడేలు.

ఇవాన్ తన కథంతా చెప్పాడు. నిప్పు పక్షి జాడను కనిపెట్టడానికి తోడేలు సాయం అడిగాడు.

తోడేలు ఇలా అంది "నువ్వు నీ గుర్రంపై వెళ్ళి, నిప్పు పక్షి జాడని కనిపెట్టాలంటే మూడు సంవత్సరాలు పట్టేది. ఎందుకంటే దాని జాడను కనిపెట్టడం చాలా కష్టం. కానీ ఆ రహస్యం నాకు తెలుసు. నేను మాట ఇచ్చినట్లుగా నీకు సాయం చేస్తాను. నా వీపు మీద కూర్చొని నన్ను గట్టిగా పట్టుకో".

ఇవాన్ తోడేలు వీపు మీద కూర్చొని, దాన్ని గట్టిగా పట్టుకున్నాడు.

తోడేలు క్షణాల్లో మాయమైంది. అది మెరుపు వేగంతో ప్రయాణించింది. నీలి నదుల్ని దాటింది. దట్టమైన ఆకుపచ్చ అరణ్యాలను రెప్పపాటులో దాటింది. చివరకు ఎత్తైన గోడలున్న ఓ రాజ భవనం వద్ద ఆగింది.

తోడేలు ఇలా హెచ్చరించింది "ఇవాన్! నేను చెప్పేది జాగ్రత్తగా విను. ఈ సమయంలో రక్షక భటులు నిద్రపోతుంటారు. కోట గోడ ఎక్కి అవతల దిగు. అక్కడ కిటికీ వద్ద బంగారు పంజరంలో, నిప్పు పక్షి కనిపిస్తుంది. బంగారు పంజరాన్ని తాకకుండా, నిప్పు పక్షిని తీసుకొనిరా!".



సరేనన్న ఇవాన్ బయలుదేరాడు. నిప్పు పక్షిని తీసుకున్నాడు. తోడేలు హెచ్చరికను మర్చిపోయాడు. బంగారు పంజరాన్ని కూడా తీయబోయాడు.

ఇవాన్ బంగారు పంజరాన్ని తాకగానే కర్ణ కఠోరమైన శబ్ధంతో గంటలు మోగాయి. రాజభటులు ఇవాన్‌ని బంధించి ఆ దేశ రాజు అఫ్రాన్ ముందు ప్రవేశపెట్టారు.

అఫ్రాన్ రాజు కథంతా విన్నాడు. రాజు ఇలా అన్నాడు "ఇవాన్! నీకు మరణశిక్ష విధిస్తున్నాను. కానీ శిక్షను తప్పించుకోవడానికి ఓ మార్గముంది. ఇక్కడ నుండి కుడివైపు ప్రయాణిస్తే కుస్మాన్ రాజ్యం వస్తుంది. ఆ కోటలోని గుర్రపుశాలలో బంగారు జూలు కలిగిన గుర్రం వుంది. ఆ గుర్రాన్ని తెచ్చి నాకు ఇచ్చావంటే, నీకు నిప్పు పక్షి, బంగారు పంజరం ఇస్తాను. ప్రాణ బిక్ష కూడా ప్రసాదిస్తాను".

చేసేదేమిలేక ఇవాన్ దిగులు మొహంతో తోడేలు వద్దకు వెళ్ళి జరిగినదంతా చెప్పాడు. తోడేలు హెచ్చరికను మర్చిపోయి చిక్కుల్లో పడినందుకు క్షమాపణ అడిగాడు. బంగారు జూలు కలిగిన గుర్రాన్ని సాధించడానికి, తోడేలు సాయం అడిగాడు. తోడేలు సరేనంది.

తోడేలు క్షణాల్లో మాయమైంది. అది ఆ రాజ్యానికి కుడివైపు ప్రయాణించింది. కుస్మాన్ రాజ్యాన్ని చేరింది. కోట గోడలు చాలా ఎత్తుగా వున్నాయి.

తోడేలు ఇలా హెచ్చరించింది "ఇవాన్! నేను చెప్పేది జాగ్రత్తగా విను. ఈ సమయంలో రక్షక భటులు నిద్రపోతుంటారు. కోట గోడ ఎక్కి అవతల దిగు. అక్కడ గుర్రపుశాలలో దేదీప్యమానంగా వెలిగిపోతూ బంగారు జూలుగల గుర్రం కనిపిస్తుంది. దానిని తీసుకొనిరా. కానీ గుర్రం ప్రక్కన వున్న కళ్ళెం మాత్రం ఎట్టిపరిస్థితులలోనూ తాకవద్దు".

'సరే' నన్న ఇవాన్ బయలుదేరాడు. బంగారు జూలుగల గుర్రాన్ని తీసుకున్నాడు. తోడేలు హెచ్చరిక మరచిపోయాడు. బంగారు కళ్ళాన్ని కూడా తీసుకోబోయాడు.

ఇవాన్ బంగారు కళ్ళాన్ని తాకగానే కర్ణ కఠోరమైన శబ్ధంతో గంటలు మోగాయి. రాజభటులు ఇవాన్‌ని బంధించి ఆ దేశ రాజు కుస్మాన్ ముందు ప్రవేశపెట్టారు.

కుస్మాన్ రాజు కథంతా విన్నాడు.

కుస్మాన్ రాజు ఇలా అన్నాడు "ఇవాన్! నీకు మరణశిక్ష విధిస్తున్నాను. కానీ శిక్షను తప్పించుకోవడానికి ఓ మార్గముంది. ఇక్కడ నుండి ఎడమవైపు ప్రయాణిస్తే దల్‌మాట్ రాజ్యం వస్తుంది. ఆ రాజుకి ఎలినా అనే అందమైన కూతురు వుంది. ఆ రాకుమారిని తెచ్చి నాకు ఇచ్చావంటే, నీకు బంగారు జూలుగల గుర్రం, బంగారు కళ్ళెం ఇస్తాను. ప్రాణభిక్ష కూడా ప్రసాదిస్తాను".

చేసేదేమిలేక ఇవాన్ దిగులు మొహంతో తోడేలు వద్దకు వెళ్ళి జరిగినదంతా చెప్పాడు. తోడేలు హెచ్చరికను మర్చిపోయి చిక్కుల్లో పడినందుకు క్షమాపణ అడిగాడు. అందాల రాకుమారి ఎలినాను సాధించడానికి, తోడేలు సాయం అడిగాడు. తోడేలు సరేనంది.

తోడేలు క్షణాల్లో బైలుదేరింది. అది ఆ రాజ్యానికి ఎడమవైపు ప్రయాణించింది. దల్‌మాట్ రాజ్యాన్ని చేరింది. కోట గోడలు చాలా ఎత్తుగా వున్నాయి.

ఇవాన్‌ని అక్కడే వుండమని చెప్పి, తోడేలు కోట గోడపై ఎక్కి తొంగి చూసింది. రాకుమారి ఎలినా తన చెలిగత్తెలతో ఉద్యానవనంలో తిరుగుతూ వుంది. తోడేలు కోట గోడను దూకింది. రాకుమారిని అపహరించి, ఇవాన్

వద్దకు తీసుకువచ్చింది. ఇవాన్‌ని, ఎలినాను తన వీపు మీద కూర్చోపెట్టుకొని క్షణాల్లో మాయమైంది తోడేలు.

దారిలో ఓ అడవిలో ఆగింది. బాధగా వున్న ఇవాన్‌ని కారణమేమిటని అడిగింది. అందాల భరిణ ఎలినాని చూసి తను తొలిచూపులోనే ప్రేమలో పడ్డానన్నాడు. తనని వదులుకోలేక పోతున్నానన్నాడు.

తోడేలు మంత్రం వేసి, అచ్చం ఎలినాలా మారిపోయింది. ఇవాన్ నకిలీ ఎలినాను కుస్మాన్ రాజుకి అప్పగించాడు. బంగారు జూలుగల గుర్రాన్ని, బంగారు కళ్ళాన్ని తీసుకొని వాయువేగంతో అడవిలోకి చేరాడు. నిజమైన ఎలినాని కలుసుకున్నాడు.

కుస్మాన్ రాజు తన ఏకాంత మందిరంలో ఎలినా రూపంలో వున్న తోడేలుని కలిసాడు. ఆమె చేతిని తాకగానే, అది బూడిద రంగులో వున్న భయంకరమైన తోడేలుగా మారిపోయింది. రాజు పై ప్రాణాలు పైనే పోయాయి. 'బాబోయ్' అని అరుస్తూ పారిపోయాడు. తోడేలు అక్కడ మాయమై అడవిలో ప్రత్యక్షమైంది.

ఇప్పుడు కూడా ఇవాన్ మొహంలో బాధ కనిపిస్తుంది. కారణమేమిటని అడిగింది తోడేలు. బంగారు జూలుగల గుర్రాన్ని, నిప్పు పక్షి కోసం ఇవ్వబుద్ధి కావట్లేదని చెప్పాడు ఇవాన్.

తోడేలు ఇవాన్‌కి మరో ఉపాయం చెప్పింది. ఎలినాని, బంగారు జూలుగల గుర్రాన్ని, బంగారు కళ్ళాన్ని అడవిలోని రహస్య ప్రదేశంలోనే వుంచారు. ఇవాన్, తోడేలు అఫ్రాన్ రాజ్యానికి వెళ్ళారు.

తోడేలు మంత్రం వేసి, అచ్చం బంగారు జూలుగల గుర్రంలా మారిపోయింది. ఇవాన్ నకిలీ బంగారు గుర్రాన్ని అఫ్రాన్ రాజుకి

అప్పగించాడు. నిప్పు పక్షిని, బంగారు పంజరాన్ని తీసుకుని వాయువేగంతో అడవిలోని రహస్య ప్రదేశానికి చేరాడు. ఎలినాని, నిజమైన బంగారు గుర్రాన్ని కలుసుకున్నాడు.

అఫ్ఘాన్ రాజు నకిలీ బంగారు గుర్రాన్ని అదిరోహించాలని చూసాడు. అది బూడిద రంగులో వున్న భయంకరమైన తోడేలుగా మారిపోయింది. రాజు మూర్ఛపోయాడు. తోడేలు అక్కడ మాయమై అడవిలో ప్రత్యక్షమైంది.

ఇవాన్ వంగి తోడేలుకు మూడుసార్లు నమస్కరించాడు. కృతజ్ఞతలు తెలిపాడు. తోడేలు చేసిన మేలు గుర్తుంచుకుంటానన్నాడు. "సెలవు మిత్రమా!" అన్నాడు ఇవాన్.

"ఇప్పుడే సెలవు చెప్పకు. భవిష్యత్తులో కూడా నా సాయం అవసరం పడొచ్చు" అంది తోడేలు.

ఆశ్చర్యపోయాడు ఇవాన్. బంగారు గుర్రంపై ఎలినాను కూర్చోపెట్టుకుని, నిప్పు పక్షిని తీసుకొని తన రాజ్యం వైపు బయలుదేరాడు ఇవాన్. అలా చాలా దూరం ప్రయాణించాక విశ్రాంతి కోసం ఓ అడవిలో ఆగాడు. కొంచెం తిని నిద్రపోయాడు.

నిప్పు పక్షి కోసం వెతికి నిరాశ చెందిన పెద్దన్న, చిన్నన్న అడవిలో నిద్రపోతున్న ఇవాన్‌ని, ఎలినాని, బంగారు గుర్రాన్ని, నిప్పు పక్షిని చూశారు.

ఇవాన్‌ని నిర్దాక్షణ్యంగా చంపారు. ఎలినాని బెదిరించారు. ఎలినాని, బంగారు గుర్రాన్ని, నిప్పు పక్షిని తీసుకొని వెళ్ళిపోయారు.

ఇవాన్ మృతదేహం చుట్టూ కాకుల గుంపు వృత్తాకారంలో తిరుగుతూ "కావ్..కావ్" మని అరుస్తున్నాయి. ఈ అరుపులు విన్న తోడేలు మనసులో ఏదో కీడు శంకించింది. అది అరుపులు వినిపించే దిక్కువైపు ప్రయాణించింది.

ఇవాన్ మృతదేహంపై వాలివున్న ఓ కాకిని బంధించింది. మిత్రుడు మృతదేహాన్ని చూసి కన్నీరు కార్చింది.

తోడేలు ఇలా అంది "కాకీ! మేఘ పర్వతానికి వెళ్ళి, నా కోసం మృత జీవజలాన్ని తీసుకొనిరా, లేదంటే నిన్ను చంపేస్తాను".

అందుకు అంగీకరించిన కాకి ఎగిరిపోయింది. కొద్దిసేపటి తరువాత కాకి మృత జీవ జలాన్ని తెచ్చి తోడేలుకి ఇచ్చింది.

తోడేలు మృత జలాన్ని, ఇవాన్ వంటిపై వున్న గాయాలలో పోసింది. ఆశ్చర్యం! మంత్రం వేసినట్లు ఆ గాయాలన్నీ మాయమయ్యాయి. తరువాత జీవ జలాన్ని ఇవాన్ నోటిలో పోసింది. ఇవాన్‌కి ప్రాణం వచ్చింది. అటూ ఇటూ కదులుతూ లేచి కూర్చున్నాడు.

"భలేగా నిద్రపట్టిందే!" అన్నాడు ఇవాన్.

"ఆహా! నిన్ను నీ సొంత అన్నలు చంపేశారు. ఎలినాని, బంగారు గుర్రాన్ని, నిప్పు పక్షిని ఎత్తుకెళ్ళారు. నేను నీకు తిరిగి ప్రాణం పోశాను" అంది తోడేలు.

కృతజ్ఞతలు చెప్పాడు ఇవాన్.

క్షణాల్లో ఇవాన్ తోడేలు వీపు ఎక్కి వాళ్ళ రాజ్యం వైపు వాయువేగంతో బయలుదేరాడు. కొన్ని గంటలు ప్రయాణించాక వాళ్ళకి దుష్టులైన ఇద్దరు అన్నలు కనిపించారు.

తోడేలు తన పదునైన పంజాతో వాళ్ళను చీల్చి చెండాడి చంపేసింది.

ఇవాన్, తోడేలు మిత్రునికి కృతజ్ఞతలు చెప్పి సెలవు తీసుకున్నాడు. తన సొంత రాజ్యాన్ని చేరాడు.

వాళ్ళ నాన్నకు జరిగిన కథంతా చెప్పాడు. నిప్పు పక్షిని, బంగారు

పంజరాన్ని, బంగారు గుర్రాన్ని, బంగారు జూలుగల గుర్రాన్ని, బంగారు కళ్ళాన్ని బహుకరించాడు. ఎంతో సంతోషించాడు ముసలి మహారాజు.

ఎలినాకి, ఇవాన్‌కి అంగరంగ వైభవంగా వివాహం జరిపించాడు. ఇవాన్‌ని మహారాజుగా పట్టాభిషేకం చేశాడు. ఇవాన్ న్యాయంగా, ధర్మంగా పరిపాలిస్తూ ప్రజల మనసులు చూరగొన్నాడు. ఆ రాజ్యం ఇప్పటికీ మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది.

| | | |
|---|---|---|
| English Title | : | The Fire Bird |
| Writer | : | Alexandar Afonasyev |
| English Translation | : | Serge Lednev |
| Illustration | : | Victor Kulkov |



# చందమామ రొట్టె
## రష్యన్ జానపద కథ

అనగనగా ఒక ఊరిలో ముసలి దంపతులు నివసించేవారు. ఒక రోజు ముసలాయన తనకో రొట్టెను తయారుచేసి యివ్వమని ముసలమ్మను అడిగాడు. ముసలమ్మ గోధుమ పిండితో ఓ గుండ్రని రొట్టెని తయారు చేసింది. ఆ రొట్టె ఎంత గుండ్రంగా వుందంటే ఎవరైనా చూస్తే దాన్ని చందమామ అనుకుంటారు. ముసలమ్మ రొట్టెను అంత గుండ్రంగా కాల్చింది. దాన్ని చల్లార్చడానికని ఇంటి కిటికీలో వుంచింది.

చందమామ రొట్టె కొద్దిసేపటి తరువాత మెల్లగా దొర్లడం ప్రారంభించింది. అది కిటికీ నుండి చెక్క బల్ల మీదకి, చెక్క బల్ల నుండి నేల మీదకు దొర్లింది. అక్కడ నుండి

పెరట్లోకి దొర్లింది. అలా దొర్లుతూ దొర్లుతూ ఇంటి తలుపు దాటి బయటకు వెళ్ళిపోయింది.

అలా అది రహదారిపై వెళ్తున్న రొట్టెను చూసి కుందేలుకు నోరూరింది.

కుందేలు ఇలా అంది "చందమామ రొట్టె! చందమామ రొట్టె! ఆగు నేను నిన్ను తినేస్తాను".

"ప్రియమైన కుందేలు మిత్రమా! ఆ పని మాత్రం చేయొద్దు. నేను నీకోసం ఓ పాట పాడతాను" అంది రొట్టె.

చందమామ రొట్టె ఇలా పాడసాగింది.

**"పొలాన గోధుమ పండింది.**
**దాని నుండి పిండొచ్చింది.**
**మామ్మ చేతితో వత్తింది.**
**గుండ్రటి రొట్టెను వచ్చాను.**
**పొయ్యిలో నన్ను కాల్చారు.**
**చల్లారను ఎండనపెట్టారు.**
**తాతనొదలి పరుగెత్తాను.**
**మామ్మనొదలి పరుగెత్తాను.**
**నిన్నొదిలి పారిపోతున్నా."**

ఇలా పాట పాడి క్షణాల్లో వేగంగా దొర్లుకుంటూ మాయమైంది.

అది అలా దొర్లుకుంటూ దొర్లుకుంటూ ముందుకు వెళ్తుంది.



ఇంతలో దానికి ఓ తోడేలు ఎదురుపడింది.

గతుక్కుమంది రొట్టె.

తోడేలు ఇలా అంది "చందమామ రొట్టె! చందమామ రొట్టె! ఆగు నేను నిన్ను తినేస్తాను".

"గౌరవనీయులైన తోడేలు గారు! ఆ పని మాత్రం చేయకండి. నేను నీకోసం ఓ పాట పాడతాను" అంది రొట్టె. సరే అంది తోడేలు.

**"పొలాన గోధుమ పండింది.**
**దాని నుండి పిండొచ్చింది.**
**మామ్మ చేతితో వత్తింది.**
**గుండ్రటి రొట్టెను వచ్చాను.**
**పొయ్యిలో నన్ను కాల్చారు.**
**చల్లారను ఎండనపెట్టారు.**
**తాతనొదలి పరుగెత్తాను.**
**మామ్మనొదలి పరుగెత్తాను.**
**నిన్నొదిలి పారిపోతున్నా."**

ఇలా పాట పాడి క్షణాల్లో వేగంగా దొర్లుకుంటూ మాయమైంది.

అది అలా దొర్లుకుంటూ ముందుకు వెళ్తుంది.

ఇంతలో దానికి ఓ ఎలుగు బంటి ఎదురుపడింది. చచ్చాన్రా బాబూ అనుకుంది రొట్టె.

ఎలుగు బంటి దానితో ఇలా అంది "చందమామ రొట్టె! చందమామ

రొట్టె! ఆగు నేను నిన్ను తినేస్తాను".

"పూజ్యులైన ఎలుగు బంటి గారు! ఆ పని మాత్రం చేయొద్దు. నేను నీకోసం ఓ పాట పాడతాను" అంది రొట్టె.

చందమామ రొట్టె ఇలా పాడసాగింది.

**"పొలాన గోధుమ పండింది.**
**దాని నుండి పిండొచ్చింది.**
**మామ్మ చేతితో వత్తింది.**
**గుండ్రటి రొట్టెను వచ్చాను.**
**పొయ్యిలో నన్ను కాల్చారు.**
**చల్లారను ఎండనపెట్టారు.**
**తాతనొదలి పరుగెత్తాను.**
**మామ్మనొదలి పరుగెత్తాను.**
**నిన్నొదిలి పారిపోతున్నా."**

ఇలా పాట పాడి క్షణాల్లో వేగంగా దొర్లుకుంటూ మాయమైంది.

అది అలా దొర్లుకుంటూ ముందుకు వెళ్తుంది.

ఇంతలో దానికి ఓ గుంట నక్క ఎదురుపడింది.

గుంట నక్క ఇలా అంది "చందమామ రొట్టె! చందమామ రొట్టె! నువ్వు గుండ్రంగా, నునుపుగా అచ్చం చందమామ అంత అందంగా వున్నావు. నీ అంత అందగాడిని నేనింతవరకు చూడలేదు".

నక్క పొగడ్తలకు, చందమామ రొట్టె ఆనందంతో

ఉబ్బితబ్బిపోయింది. సంతోషంతో నాట్యం చేస్తూ ఇలా పాడడం మొదలు పెట్టింది.

**“పొలాన గోధుమ పండింది.**
**దాని నుండి పిండొచ్చింది.**
**మామ్మ చేతితో వత్తింది.**
**గుండ్రటి రొట్టెను వచ్చాను.**
**పొయ్యిలో నన్ను కాల్చారు.**
**చల్లారను ఎండనపెట్టారు.**
**తాతనొదలి పరుగెత్తాను.**
**మామ్మనొదలి పరుగెత్తాను.**
**నిన్నొదిలి పారిపోతున్నా.”**

ఇలా పాట పాడి చందమామ రొట్టె వేగంగా దొర్లబోయింది. ఇంతలో గుంట నక్క ఇలా అంది.

“అబ్బా! ఎంత చక్కని పాట. ఎంత అద్భుతమైన సంగీతం వుంది దాన్లో, నా దురదృష్టవశాత్తు సరిగా వినలేకపోయాను. దయచేసి నా ముక్కుపై కూర్చుని మరోసారి పాడొచ్చు కదా!”.

నక్క పొగడ్తలకు చందమామ రొట్టె ఎంతో సంతోషించింది. నక్క ముక్కుపై కూర్చుంది. రాగయుక్తంగా మరలా పాటంతా పాడింది. నక్క చప్పట్లు కొట్టింది.

“అబ్బా! ఎంత బాగా పాడావు. ఎంత విన్నా ఇంకా వినాలనిపిస్తుంది.

దయచేసి నా నాలుకపై కూర్చుని చివరసారి పాడొచ్చు కదా!” అంది గుంట నక్క.

చందమామ రొట్టె నక్క నాలుకపై గెంతింది. గుంట నక్క నోరు మూసుకుంది. చందమామ రొట్టెను శుభ్రంగా తినేసింది. ఆ తరువాత చందమామ రొట్టె ఎవ్వరికీ కనిపించలేదు! పాపం చందమామ రొట్టె..

| | | |
|---|---|---|
| English Title | : | The Little Round Bun |
| Writer | : | A Russian folk tale |
| English Translation | : | Irina Zheleznova |
| Illustration | : | V. Kurchevsky |



# బంగారు చేప

## ఉజ్బెక్ జానపద కథ

అనగనగా ఒక రాజ్యంలో సముద్రపు ఒడ్డున ఓ ముసలి జాలరి, తన కొడుకుతో కలిసి నివసించేవాడు. వాళ్ళు నిరుపేదలు. వాళ్ళ వద్ద చేపలు పట్టే వల, పాత పడవ ఉండేవి. ఈ రెండు వాళ్ళ ఆస్తులు. యవ్వనంలో ఉన్న కొడుకు, ముసలి తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. యువకుడు రోజంతా పాటలు పాడేవాడు. పని చేస్తూ పాటలు పాడటం అతని దినచర్యలో భాగం.

ఒక రోజు జాలరి సముద్రంలోకి వలను విసిరాడు. వలను పైకి లాగి చూసే సరికి అందులో ఒక చిన్న చేప పడింది. అది సాదా సీదా చేప కాదు. బంగారు చేప, మిలమిలా మెరిసిపోతుంది.

బంగారు చేపను చూసి ఆశ్చర్యపోయాడు ముసలాయాన. కొడుకుతో ఇలా అన్నాడు "ఈ బంగారు చేపను జాగ్రత్తగా కాపాడు. నేను వెళ్ళి ఈ విషయాన్ని మన రాజుగారికి చెప్పి వస్తాను. ఆయన మనకు మంచి బహుమతి ఇస్తారు."

ముసలాయన రాజప్రసాదానికి బయలుదేరాడు. యువకుడు దయార్ద్ర హృదయుడు.

చేప వలలో చిక్కుకుని కొట్టుకోవడం యువకుడుకి బాధగా అనిపించింది. ఆ దృశ్యం చూడలేకపోయాడు. చేపను వల నుండి జాగ్రత్తగా తప్పించి సముద్రంలో వదిలాడు. చేప తోక ఊపుకుంటూ క్షణాల్లో మాయమైంది.

కొద్ది సేపటి తరువాత ముసలాయనతో పాటు రాజు తన అంగరక్షకులతో, పరివారంతో వేంచేసాడు.

"ఏది నీ అద్భుతమైన బంగారు చేపను చూపించు" అన్నాడు రాజు.

యువకుడు తలవంచుకుని ఇలా అన్నాడు "ఆ చేపని తిరిగి సముద్రంలో వదిలేసినందుకు నన్ను క్షమించండి మహారాజా!"

రాజు కోపంతో ఊగిపోతూ ఇలా అన్నాడు "ఓయి ముసలోడా! నీవు నీ పనికిమాలిన కొడుకు నా అందమైన నిద్రను చెడగొట్టారు? నాతోనే పరాచకాలాడతారా?" రాజు తన పొడవైన గడ్డాన్ని నిమురుకుంటూ ఇలా అన్నాడు. "నేను ఎన్నో ఏళ్ళుగా రాజ్యపాలన చేస్తున్నాను మీరు చెప్పిన అద్భుతమైన బంగారు చేపను గురించి ఎప్పుడూ వినలేదు."

ముసలాయన, తనని తన కొడుకుని క్షమించమని ప్రాధేయపడ్డాడు. కాని రాజు వినలేదు. యువకుడి కాళ్ళు, చేతులు కట్టేసి, వాళ్ళ పాత పడవలో

ఉంచి, ఆ పడవని సముద్రంలో వదిలేయమని శిక్ష విధించాడు మహారాజు.

రాజు తిరిగి తన కోటకు వెళ్ళిపోయాడు. పేద ముసలాయన సముద్రపు అంచున నిల్చుని, అలల్లో, పడవలో కొట్టుకుపోతున్న కొడుకుని చూసి కన్నీరు మున్నీరు అయ్యాడు. ఏం చేసి కొడుకుని కాపాడుకోవాలో అతనికి తెలియలేదు. తన కనుచూపు మేరనుండి కొడుకు దూరమయ్యాక ముసలాయన నేలపై దొర్లి రోదించాడు. రాజు క్రూరత్వాన్ని శపించాడు.

యువకుడు పడవలో ఆకాశం వంక చూస్తున్నాడు. తాను ఎక్కువ సేపు బ్రతకనని నిశ్చయించుకున్నాడు. పడవని సముద్రం అలా . . . అలా. . . ఎంతో దూరం తీసుకు వెళ్ళింది.

చివరకి ఓ ద్వీపం కనిపించింది. ఓ పెద్ద అల పడవని, ద్వీపంలోని ఇసుక ఒడ్డుకి తోసింది. మరు క్షణం ఓ చెట్టు వెనుక నుండి ఓ అందమైన యువకుడు పడవ వద్దకు వచ్చాడు. ఆశ్చర్యం. అతను అచ్చు గుద్దినట్లు ఈ జాలరి కుర్రాడిలానే ఉన్నాడు. అందమైన యువకుడు, జాలరి కుర్రాడి కట్లు విప్పి కాపాడాడు. కృతజ్ఞతలు చెప్పాడు జాలరి కుర్రాడు. తినటానికి కొన్ని పండ్లు ఇచ్చాడు. కాలాక్రమేణా ఒకర్ని విడిచి ఒకరు ఉండలేనంతగా వాళ్ళు మంచి స్నేహితులైనారు. ఒకరోజు వాళ్ళు సముద్ర తీరంలో నడుస్తూ, కబుర్లు చెప్పుకుంటూ ఉండగా వాళ్ళకి ఓ ముసలి గొర్రెల కాపరి, గొర్రెల మంద కనిపించాయి. ఇద్దరూ ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ఇన్నాళ్ళు ఆ ద్వీపంపై 'తామిద్దరమే ఉన్నాం' అని వాళ్ళనుకున్నారు.

ముసలి గొర్రెల కాపరిని పలకరించారు. ముసలి గొర్రెల కాపరి ఈ కథ చెప్పడం మొదలు పెట్టాడు.

"ఇక్కడి నుండి ఉత్తరం వైపు మూడు రాత్రుళ్ళు, మూడు పగళ్ళు

ప్రయాణిస్తే ఓ రాజ్యానికి చేరతారు. ఆ దేశ రాజు మానసిక వ్యధతో బాధపడుతున్నాడు. ఎందుకంటే అతనికి ప్రపంచంలోనే అద్భుత సౌందర్యరాశియైన ఓ కూతురుంది. కాని ఆమె మూగది. కాబట్టి ఆ రాజు ఓ చాటింపు వేయించాడు. ఎవరైతే తన కూతురు మాట్లాడేలా చేస్తారో, వారికి ఊహించని బహుమానం లభిస్తుంది. ఒకవేళ ఈ ప్రయత్నంలో విఫలమైతే శిరచ్ఛేదం విధిస్తారు. ఈ పోటీలో పాల్గొని, ఓడిపోయి చాలా మంది యువకులు మరణించారు."

ముసలి గొర్రెల కాపరి చెప్పిన కథంతా శ్రద్ధగా విన్నారు ఇద్దరు మిత్రులు. ఆ రాజ్యానికి వెళ్ళి పోటీలో పాల్గొని తమ అదృష్టం పరీక్షించుకుందామని నిర్ణయించుకున్నారు. ఉత్తరం దిక్కున మూడు రాత్రులు, మూడు పగళ్ళు ప్రయాణించి రాజుగారి కోట వద్దకు చేరారు. అందమైన యువకుడు జాలరి కుర్రాడితో ఇలా అన్నాడు. "మిత్రమా! పోటీలో మొదట నేను పాల్గొని, రాజుగారి కూతురుకి నయం చేస్తాను వచ్చిన బహుమతిని చెరో సగం పంచుకుందాం" సరేనన్నాడు జాలరి కుర్రాడు.

అందాల యువకుడు కోటలోకి ప్రవేశిస్తుండగా ద్వారపాలకులు ఇలా హెచ్చరించారు. "ఎంతో మంది యువకులు పోటీలో పాల్గొని తమ తలల్ని కోల్పోయారు. మరణించారు... జాగ్రత్త... నీవు ఆ కోవలోకి చేరుతావేమో!"

కాని తెలివైన అందాల యువకుడు ధైర్యంగా రాజకుమారి గదిలోకి వెళ్ళాడు. ఆమెకు నమస్కరించి ఇలా అన్నాడు.

"అందాల రాజకుమారి! నా కథ వినండి. మేం ముగ్గురం అన్నదమ్ములం. అప్పుడు వసంతకాలం. ఓ రోజు వంట చెరుకు కోసం



అడవిలోకి వెళ్ళాము. మా పెద్దన్నయ్య ఓ చెట్టు కొమ్మని నరికి, దాని కొయ్యతో ఓ అందాల చెక్క పిట్టని తయారు చేశాడు. అది ఎలా ఉందంటే అచ్చు నిజమైన పక్షిలాగే ఉంది.

మా చిన్నన్నయ్య దట్టమైన అరణ్యంలోకి వెళ్ళి రెండు రెక్కలను తెచ్చాడు. వాటిని ఈ చెక్కపిట్టకి అమర్చాడు. అప్పుడు దాని అందం రెట్టింపైంది. నేను ఆ చెక్క పిట్టని స్వచ్ఛమైన నీటి పాయలో స్నానం చేయించాను. ఆశ్చర్యంగా ఆ పిట్టకి ప్రాణం వచ్చింది. చక్కగా పాట పాడి తుర్రున ఎగిరిపోయింది...!

ఆ పక్షి నాది అంటే నాది అని ఆ క్షణం నుండి మేం ముగ్గురం పోట్లాడుకుంటున్నాము, మీరు తీర్పు చెప్పండి ఆ పక్షిపై హక్కులు న్యాయంగా ఎవరికి చెందుతాయో?

రాజకుమారి పెదాలపై ఓ చిరునవ్వు తొణికిసలాడింది. కాని ఆమె కొంచెం కూడా శబ్ధం చేయలేదు. తన బొటన వేలును పెదాలకు అడ్డంగా పెట్టుకుని తలని అడ్డంగా ఊపింది.

అందాల యువకుడికి పట్టరానంత కోపం వచ్చింది. "నీ కోసం నేను చావవలసి వస్తే ముందు నిన్ను చంపి తరువాత నేను చస్తాను." అని తన ఒరలోని కత్తిని తీసి గాలిలో ఒడుపుగా తిప్పాడు.

రాజకుమారి భయంతో గట్టిగా అరచి నేల మీద పడిపోయింది. ఆ క్షణంలో ఓ తెల్లటి పాము ఆమె నోటి నుండి బయటకు వచ్చింది. అందాల యువకుడు తన పదునైన కత్తితో ఆ పాముని ముక్కలు ముక్కలుగా నరికాడు.

ఇలా రాజకుమారికి శాపవిమోచనమైంది. ఆమె కళ్ళు ఆనంద భాష్పాలతో నిండిపోయాయి.

ఆమె తన చూపుడువేలుకు ఉన్న వజ్రపు ఉంగరాన్ని యువకునికి ఇచ్చి ఇలా అంది “ఈ ఉంగరాన్ని నాన్నగారికి చూపించు. ఆయన తగిన బహుమతితో నిన్ను గౌరవిస్తారు.” యువకుడు ఆ ఉంగరాన్ని తీసుకుని తన మిత్రుడైన జాలరి కుర్రాడు వద్దకు వెళ్ళాడు. జరిగినదంతా చెప్పాడు. ఉంగరాన్ని జాలరి కుర్రాడికి ఇచ్చాడు.

అందమైన యువకుడు ఇలా అన్నాడు “మిత్రమా! నా రహస్యం చెబుతా విను. నేను ఎవరో కాదు. మానవ రూపం ధరించిన బంగారు చేపను. నీవు ఆ రోజు నాకు స్వేచ్ఛను ప్రసాదించి ప్రాణభిక్ష పెట్టావు. అసలేం జరిగిందంటే నీవు అద్భుతంగా పాడతావు. ఆ విషయం చేపల ద్వారా ఆ నోటా ఈ నోటా పాకి మా నాన్నగారైన మత్సరాజు గారి వద్దకు చేరింది. నేను సముద్రగర్భంలోని మత్స్యరాజ్యానికి రాజ కుమారుడిని. మా నాన్నగారి వద్ద అనుమతి తీసుకుని నీ గాన మాధుర్యం విందామని పైకి వచ్చాను. నీ పాటలో లీనమై ఈ లోకాన్ని మర్చిపోయి వలలో చిక్కాను. అపుడు నీవు నన్ను కాపాడావు. కానీ దురదృష్టవశాత్తు మీ దుష్టరాజు నీ కాళ్ళు చేతులు కట్టేసి పాత పడవలో వదిలేసి శిక్ష విధించాడు. ఇదంతా నేనక్కడుండి గమనిస్తూనే ఉన్నాను. నా నమ్మకస్తులైన చేపల సాయం అడిగాను. వాళ్ళు జాగ్రత్తగా పడవ అడుగు భాగంలో చేరి ఈదుతూ నిన్ను ఈ ద్వీపానికి తీసుకుని వచ్చారు. తరువాత జరిగిన కథ నీకు తెలిసిందే. కానీ నీవు చాలా మంచివాడివి, నా ప్రాణ స్నేహితుడివి. ఈ ఉంగరాన్ని తీసుకెళ్ళి మహారాజుకి చూపించు, తగిన బహుమతిని స్వీకరించు, నేను నా మత్స్య రాజ్యానికి వెళ్ళవలసిన సమయం వచ్చింది.”

“ నీకు ఎప్పుడు నా అవసరం వచ్చినా, ఈ సముద్రం ఒడ్డు దగ్గర నిలబడి మూడు సార్లు బిగ్గరగా పిలువు. నీకు సాయం చేయటానికి నేను తప్పక వస్తాను.” అన్నాడు యువకుడు. మరుక్షణం యువకుడు బంగారు చేపలా మారిపోయాడు. సముద్రపు నీటిలో ఈదుతూ క్షణాల్లో మాయమయ్యాడు.

జాలరి కుర్రాడు మంచి మిత్రుడు దూరమైనందుకు బాధపడ్డాడు. విచార వదనంతో రాజుగారి కోటలోకి వెళ్ళాడు. ఉంగరాన్ని రాజుగారికి చూపించాడు. రాజు ఆనందంతో జాలరి కుర్రాడికి నమస్కరించాడు. తన ఒక్కగానొక్క కూతురికి మాటలు తెప్పించినందుకు కృతజ్ఞతలు చెప్పాడు. “నీకు నేనివ్వబోయే బహుమతి ఏదో కాదు, నా కంటి దీపం అయిన నా ఒక్కగానొక్క కూతురు. ఆమెను భార్యగా స్వీకరించి ఆనందంగా జీవించు.” అన్నాడు మహారాజు. ‘సరే’ నన్నాడు జాలరి కుర్రాడు.

తరువాత రోజు ఆకాశమంత పందిరి వేసి భూలోకమంత అరుగు వేసి జాలరి కుర్రాడికి, రాజకుమారికి అంగరంగ వైభవంగా వివాహం జరిపించారు. ఆ రాజు దేశ ప్రజలందరికి విందుభోజనాలు వడ్డించారు. చూడ చక్కటి జంటని చూసి ప్రజలు హర్షధ్వనాలు చేశారు.

కొన్ని నెలలు వాళ్ళు ఆనందంగా గడిపారు. యువరాజు ముభావంగా, దిగులుగా వుండటం రాజకుమారి గమనించింది. కారణం ఏమిటి అని అడిగింది. యువరాజు ఇలా చెప్పాడు. “నేను జాలరిగా వున్నపుడు పాటలు పాడుతూ రోజంతా చేపలు పట్టడానికి ప్రయత్నించేవాడిని. ఖాళీగా ఓ నిమిషం కూడా గడిపేవాడిని కాదు. కానీ ఇక్కడ యువరాజు

హెూదాలో రోజంతా ఖాళీగా గడపాల్సి వస్తుంది. అది నాకు నచ్చటం లేదు.

అదీకాక మా రాజ్యంలో మా నాన్న ముసలివాడైపోయాడు. అతని చివరి రోజుల్లో, అతని బాగోగులు చూడటం కొడుకుగా నా బాధ్యత. నీవు నాతో మా రాజ్యం వస్తే, సముద్రం పక్కన ఓ గుడిసెలో ఆనందంగా గడుపుదాం. కానీ నీ పరిచారికలు, సేవకులు, భోగభాగ్యాలు ఏమి వుండవు. "ప్రాణంగా ప్రేమించే నేను మాత్రం ఉంటాను."

"మీరు ఆనందంగా ఉంటాను అంటే నేను దేనికైనా సిద్ధమే. మీతో ఎక్కడికి రమ్మన్నా వస్తాను. కానీ మనం ఈ సముద్రాన్ని దాటడం ఎలా? పడవను నిర్మించడం కూడా ఇక్కడ ఎవరికీ రాదు." అంది యువరాణి. "నేను ఏదో ఒక మార్గం కనిపెడతాను. నువ్వు ప్రయాణానికి సిద్ధంగా వుండు". అన్నాడు యువకుడు.

తరువాత రోజు యువరాజు సముద్రతీరానికి వెళ్ళాడు. మూడు సార్లు బిగ్గరగా బంగారు చేపని పిలిచాడు. బంగారు చేప వచ్చింది. ఏ సహాయం కావాలి మిత్రమా? అని అడిగింది.

"నాకు మా నాన్న మీద మా దేశం మీద బెంగగా ఉంది. తిరిగి వెళ్దాం అంటే ఇక్కడ పడవ లేదు. నా పాత పడవ విరిగిపోయింది." అన్నాడు యువకుడు.

"నీ కోరిక నెరవేరుతుంది. ఈ రోజు రాత్రికాగానే నేనో తిమింగలాన్ని చంపుతాను. అది నోరు తెరువగానే నీవు, నీ భార్య ఏ మాత్రం భయపడకుండా, దాని నోటిలోకి నడిచి వెళ్ళండి. అది మిమ్మల్ని క్షేమంగా

రేపు ఉదయం కల్లా మీ రాజ్యంలో వదిలి పెడుతుంది.” అంది బంగారు చేప.

“ఆ తిమింగలం మమ్మల్ని మింగేస్తే?” అని సందేహం వెలిబుచ్చాడు యువరాజు.

“ఏం భయపడద్దు. దాని ఆకారం భయంకరంగా ఉంటుంది. కాని దాని మనసు వెన్న. నేనిక వెళ్ళాలి. నీ ప్రయాణం విజయవంతమవుగాక” అని సెలవు తీసుకుంది బంగారు చేప.

రాత్రయింది ఉన్నట్టుండి సముద్రం అల్లకల్లోలంగా మారింది. భారీ తిమింగలం ఈదుకుంటూ సముద్రపు ఒడ్డు దగ్గరకు వచ్చింది. అది తన తోకని మెల్లగా కదిలించింది. ఆ కదలికకే సముద్రపు అలలు ఆకాశం అంత ఎత్తున ఎగసి పడ్డాయి. సముద్రం అంతా అల్లకల్లోలంగా మారింది.

ఈ దృశ్యాన్ని చూడగానే యువరాణి భయంతో గజగజ వొణికింది. యువరాజు ధైర్యం చెప్పాడు. రాణి చేతిని పట్టుకుని, ఇద్దరు నడుచుకుంటూ తిమింగలం నోటిలోకి వెళ్ళారు. వాళ్ళు నోటిలోకి వెళ్ళి వెళ్ళగానే తిమింగలం తన నోరు మూసింది. ప్రయాణం ప్రారంభించింది.

తిమింగలం ఎంతో జాగ్రత్తగా, మెల్లగా ప్రయాణించింది. దాని శరీర కదలికలకు, ఈ యువజంట మత్తుగా నిద్రలోకి జారుకుంది.

ఉదయానికల్లా చేరాల్సిన రాజ్యం యొక్క సముద్రతీరానికి చేరింది. మెల్లగా నోరు తెరిచింది. జంట బయటకు వచ్చింది. తిమింగలంకు కృతజ్ఞతలు చెప్పారు. అది శెలవు తీసుకుంది.

సముద్రపు ఒడ్డున పూరి గుడిసె లోపల వాళ్ళ నాన్న దిగులుగా

కూర్చుని ఉన్నాడు. ఏదో ఆలోచిస్తున్నాడు. “నాన్నా” అని పిలుస్తూ వెళ్ళి తండ్రిని కౌగలించుకున్నాడు యువకుడు. తిరిగొచ్చిన కొడుకుని చూసి ఆనందం భాష్పాలు రాల్చాడు ముసలి జాలరి. తన భార్యను పరిచయం చేశాడు కుర్రాడు. ఆశీర్వదించాడు ముసలి జాలరి.

ఆ క్షణం నుంచి వాళ్ళు ముగ్గురు ఆ గుడిసెలో ఉంటూ సముద్రంలో చేపల్ని వేటాడుతూ ఆనందంగా జీవించారు.

| | | |
|---|---|---|
| English Title | : | The Gold Fish |
| Writer | : | An Uzbek fairy tale |
| English Translation | : | Fainna Solasko |
| Illustration | : | R. Volshy |

# REQUEST TO READERS

Telugu Readers Club would be glad to have your openion of this book, its translation, design and any suggestions you may have for future publications.

Please send all your comments to telugureadersclub@gmail.com



children readers club